# చట్టం

సంపూర్ణ స్వతంత్ర వార్తా పత్రిక

నిజామాబాద్
శుక్రవారం
19.06.2026

సంపుటి : 16 సంచిక: 264
పేజీలు:8 వెల: రూ.5

ఎడిటర్ : సిరిగాద ప్రసాద్




## కేన్ డబుల్.. క్రొయేషియాపై ఇంగ్లండ్ ఘన విజయం

ఫిఫా ప్రపంచకప్‌లో టైటిల్ ఫేవరేట్లలో ఒకటైన ఇంగ్లండ్‌కు అదిరిపోయే శుభారంభం దక్కింది. డల్లాస్ స్టేడియం వేదికగా గురువారం జరిగిన గ్రూపు-ఎల్ పోరులో ఇంగ్లండ్ 4-2 తేడాతో క్రొయేషియాపై అద్భుత విజయం సాధించింది. కిక్కిరిసిన అభిమానుల మధ్య జరిగిన పోరు ఆద్యంతం ఆసక్తి కల్గించింది. సరిగ్గా ఎనిమిదేండ్ల క్రితం కీలకమైన సెమీఫైనల్లో తమకు ఎదురైన ఓటమికి ఇంగ్లండ్ కసితీరా ప్రతీకారం తీర్చుకుంది. ఇంగ్లండ్ తరపున హ్యారీ కేన్(12ని, 42ని) డబుల్ గోల్స్‌తో అదరగొట్టగా, జూడ్ బెల్లింగ్‌హామ్(47ని), మార్కస్ రాష్‌ఫోర్డ్(85ని) ఒక్కో గోల్ చేశారు. మరోవైపు తామేం తక్కువ కాదన్నట్లు మార్టిన్ బతురినా(36ని), పీటర్ ముసా(45+5ని)..క్రొయేషియాకు గోల్స్ అందజేశారు. ఈ విజయంతో మూడు పాయింట్లు ఖాతాలో వేసుకున్న ఇంగ్లండ్ గ్రూపులో అగ్రస్థానంలోకి దూసుకురాగా, క్రొయేషియా(0) నాలుగో స్థానంలో కొనసాగుతున్నది.

# రైతులకు శుభవార్త



- ఒకే వారంలో పీఎం కిసాన్, రైతు భరోసా నిధులు విడుదల
- ప్రధాని మోదీ చేతుల మీదుగా పీఎం కిసాన్ రూ.2,000 జమ
- సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా రైతు భరోసా ప్రారంభం
- ఈ-కేవైసీ, ల్యాండ్ సీడింగ్ ఉంటేనే ఖాతాలోకి డబ్బులు
- పీఎం కిసాన్ వెబ్‌సైట్ ద్వారా ఫోన్లోనే పేమెంట్ స్టేటస్ చెకింగ్
- అర్హులైన కొత్త రైతులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు

**చట్టం, స్టేట్ బ్యూరో:**
దేశవ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది కర్షకులకు ఈ విడత సాయం ఎంతో ఊరటనివ్వనుంది. పశ్చిమ బెంగాల్‌లోని తారకేశ్వర్ వేదికగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వచ్చే శనివారం అనగా జూన్ 20న 23వ విడత పీఎం కిసాన్ నిధులను బటన్ నొక్కి విడుదల చేయనున్నారు. ఈ ఒక్క విడత ద్వారానే దేశవ్యాప్తంగా ఉన్న 9 కోట్లకు పైగా రైతు కుటుంబాల ఖాతాల్లోకి నేరుగా నగదు బదిలీ కానుంది. వ్యవసాయ పనుల ముమ్మరంగా సాగుతున్న తరుణంలో ఈ పెట్టుబడి సాయం రైతులకు ఎంతో ఆసరాగా నిలుస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఈ పథకం ద్వారా అర్హులైన ప్రతి రైతు కుటుంబానికి ఏడాదికి 6,000 రూపాయల ఆర్థిక సాయం అందుతోంది. ఈ భారీ మొత్తాన్ని ఒకే విడతలో కాకుండా రైతుల అవసరాలకు అనుగుణంగా మూడు సమాన విడతలలో కేంద్రం అందిస్తోంది. ప్రతి నాలుగు నెలలకు ఒకసారి 2,000 రూపాయల చొప్పున నేరుగా లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాలకే ఈ సొమ్ము చేరుతోంది. ప్రస్తుత ఖరీఫ్ సీజన్ సాగు ఖర్చుల కోసం ఈ 2,000 రూపాయలు ఎంతో కీలకం కానున్నాయి. అయితే ఈ పథకం కింద వచ్చే నగదు నేరుగా మీ అకౌంట్‌లో పడాలంటే కొన్ని కీలకమైన సాంకేతిక ప్రక్రియలను పూర్తి చేయడం తప్పనిసరి. సాంకేతిక కారణాల వల్ల ఏ ఒక్క రైతు కూడా నష్టపోకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం కొన్ని నిబంధనలను కఠినతరం చేసింది. పీఎం సమ్మాన్ 23వ విడత డబ్బులు ఖాతాలో జమ కావాలంటే రైతులు కచ్చితంగా ఈకేవైసీ ప్రక్రియను పూర్తి చేసి ఉండాలి. మీ మొబైల్ నంబర్ లేదా బయోమెట్రిక్ ద్వారా ఈ ప్రక్రియను సులభంగా పూర్తి చేసుకోవచ్చు. దీనితో పాటు సాగు భూమి రికార్డులను సైతం పీఎం కిసాన్ పోర్టల్‌తో అనుసంధానం చేయడం ప్రాథమిక నిబంధనగా మార్చారు. ల్యాండ్ సీడింగ్ ప్రక్రియ పూర్తయితేనే మీ ఖాతా యాక్టివ్‌గా ఉన్నట్లు పరిగణిస్తారు. వీటితో పాటు బ్యాంక్ ఖాతాకు ఆధార్ కార్డ్ లింక్ కావడం, ఎన్‌పీసీఐ మ్యాపింగ్ జరగడం అత్యంత ఆవశ్యకం. ఈ ప్రక్రియలన్నీ సక్రమంగా ఉంటేనే కేంద్రం విడుదల చేసే నిధులు మీ అకౌంట్‌కు చేరతాయి. చాలా మంది రైతులు అన్ని అర్హతలు ఉన్నా ఈ చిన్నపాటి సాంకేతిక లింకులు లేకపోవడం వల్లే గతంలో డబ్బులు కోల్పోయారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో మీ మొబైల్ ఫోన్ ద్వారానే లబ్ధిదారుల జాబితాలో మీ పేరు ఉందో లేదో చాలా ఈజీగా తెలుసుకోవచ్చు. దీని కోసం కిసాన్ సువిధ బెనిఫిషరీ స్టేటస్ యాప్ లేదా పీఎం కిసాన్ అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాల్సి ఉంటుంది. ఎక్కడికీ వెళ్లకుండా ఇంట్లోనే కూర్చుని మీ పేమెంట్ స్టేటస్‌ను చెక్ చేసుకునే సదుపాయాన్ని ప్రభుత్వం కల్పించింది. దీనివల్ల రైతులకు సమయం, డబ్బు ఆదా అవుతాయి. స్టేటస్ చెక్ చేసుకోవడానికి రైతులు ముందుగా పీఎం కిసాన్ అధికారిక వెబ్‌సైట్ ఓపెన్ చేయాలి. అక్కడ స్క్రీన్‌పై కనిపించే 'ఫార్మర్స్ కార్నర్' అనే విభాగానికి వెళ్లాల్సి ఉంటుంది. ఆ విభాగంలో మనకు కనిపించే 'నో యువర్ స్టేటస్' అనే ఆప్షన్‌పై క్లిక్ చేయాలి. ఈ ప్రక్రియ ద్వారా మీ అకౌంట్ ఏ స్థితిలో ఉందో స్పష్టంగా తెలిసిపోతుంది. అక్కడ మీ రిజిస్ట్రేషన్ నంబర్ లేదా మీ ఆధార్ నంబర్‌ను నిర్ణీత గడిలో ఎంటర్ చేయాల్సి ఉంటుంది. నంబర్ ఎంటర్ చేసిన తర్వాత మీ మొబైల్ నంబర్‌కు ఒక వన్ టైమ్ పాస్‌వర్డ్ (ఓటీపీ) వస్తుంది. ఆ ఓటీపీని స్క్రీన్‌పై నమోదు చేయగానే మీ పూర్తి స్టేటస్ ప్రత్యక్షమవుతుంది. రాబోయే 23వ విడత 2,000 రూపాయల డబ్బులు పడేది లేనిది అక్కడ క్లియర్‌గా చూపిస్తుంది. ఒకవేళ ఏవైనా లోపాలు ఉంటే వెంటనే సరిచేసుకోవడానికి మిగతా 7లో..

> పంట పెట్టుబడి కోసం ఆశగా ఎదురుచూస్తున్న అన్నదాతల బ్యాంక్ ఖాతాలు ఇక పైసలతో గలగలలాడనున్నాయి. ఒకవైపు వానాకాలం సీజన్ రైతు భరోసా నిధులను విడుదల చేసేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చకచకా ఏర్పాట్లు చేస్తోంది. సరిగ్గా ఇదే సమయంలో కేంద్ర ప్రభుత్వం సైతం పీఎం కిసాన్ సమ్మాన్ యోజన నిధుల విడుదలకు ముహూర్తం ఖరారు చేసి రైతులకు రెట్టింపు ఉత్సాహాన్ని ఇచ్చింది. ఈ నెల 26వ తేదీన ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గ కేంద్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఖరీఫ్ సీజన్ పంట పెట్టుబడి సాయాన్ని అధికారికంగా ప్రారంభించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే ఈ భరోసా కంటే ఆరు రోజుల ముందే, అంటే ఈ నెల 20న కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ నిధులను రైతుల ఖాతాల్లో జమ చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది.



# ఆకు పచ్చ తెలంగాణ మా ప్రభుత్వం లక్ష్యం

**చట్టం, ఎల్బీనగర్ :**
తెలంగాణ రాష్ట్ర ముఖచిత్రాన్ని మార్చే ప్రతిష్టాత్మకమైన మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్, భారత్ ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టులను ఎట్టి పరిస్థితుల్లోనూ పూర్తి చేసి తీరుతామని ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. దేశంలోని ఢిల్లీ, ముంబయ్, బెంగుళూరు లాంటి మహానగరాలు ఎదుర్కొంటున్న కాలుష్యం, వరదల వంటి దుస్థితి హైదరాబాద్ నగరానికి రాకూడదన్న సంకల్పంతో పని చేస్తున్నామని చెప్పారు. ఎల్‌బీ నగర్ నియోజకవర్గం పరిధిలోని గుర్రంగూడ ఎకోపార్క్‌లో ముఖ్యమంత్రి మొక్కను నాటి వనమహోత్సవం 2026 కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎకో పార్క్ ఏర్పాటు చేసిన ఫోటో ప్రదర్శనను తిలకించారు. వనమహోత్సవంలో భాగంగా పలు జిల్లాల్లో మొక్కలు నాటడం, వనాల పెంపుతో పాటు వన్య ప్రాణుల సంరక్షణ, ప్రకృతి సంరక్షణకు సంబంధించి రూ.35.50 కోట్లతో వివిధ అభివృద్ధి పనులను ప్రారంభించారు. గుర్రంగూడ రిజర్వ్ ఫారెస్ట్‌లో రూ. 17.84 కోట్ల వ్యయంతో చేపట్టిన పనులకు శ్రీకారం చుట్టారు.నిజామాబాద్, కొత్తగూడెం, హనుమకొండ, మెదక్, మహబూబ్‌నగర్, ములుగు, నారాయణపేట, భూపాలపల్లి, సంగారెడ్డి, రంగారెడ్డి, వరంగల్ జిల్లాల్లో రూ. 17.66 కోట్ల విలువైన అర్బన్ పార్కులు, ఎకో పార్కులు, వన్యప్రాణి సంరక్షణ, జూ ఆధునీకరణ, నివాస భవనాలు, పర్యావరణ మౌలిక సదుపాయాల వంటి అభివృద్ధి పనులను ఇక్కడి నుంచి ముఖ్యమంత్రి వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, దేశంలోని మహానగరాలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరిస్తూ, అంతర్జాతీయ స్థాయిలో మూసీ రివర్‌ఫ్రంట్ నిర్మాణం పూర్తి చేస్తామని చెప్పారు. ఎవరేమనుకున్నా మూసీ నది ప్రక్షాళన చేసి తీరుతాం. గండిపేట నుంచి గౌరెల్లి వరకు 55 కి. మీ మేరకు అంతర్జాతీయ స్థాయిలో రివర్‌ఫ్రంట్ పూర్తి చేసే బాధ్యత నాది. ప్రపంచ పర్యాటకులను ఆకర్షించే విధంగా భారత్ ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేస్తాం. సబర్మతీ, గంగా, యమునా నదుల రివర్‌ఫ్రంట్ల కన్నా అద్భుతంగా మూసీ రివర్‌ఫ్రంట్‌ను అభివృద్ధి చేస్తాం” అని స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో ఏ పనులు చేయాలన్నా ఒక ప్రాంతం వైపు మాత్రమే చేపట్టారని, కూతవేటు దూరంలో ఉన్న ఎల్బీనగర్, బీఎన్ రెడ్డి నగర్, వనస్థలిపురం, హయత్ నగర్, గుర్రంగూడ, బైరామల్ గూడ, సాయిబ్ నగర్ లాంటి ప్రాంతాలు అభివృద్ధికి నోచుకోలేదని పలు అంశాలను వివరించారు. ఈ విషయాలపై ఆలోచన చేసి జిల్లాలో ఈ ప్రాంతాలవైపు అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో పనులు చేపట్టామని చెప్పారు. అందులో భాగంగానే రూ. 2,400 కోట్లతో అంతర్జాతీయ ప్రమాణాలతో ఫ్రూట్ మార్కెట్ నిర్మిస్తున్న విషయాన్ని ప్రస్తావించారు.గుర్రంగూడ స్థలాన్ని కూడా కబ్జా చేయాలని, కొందరు ప్రైవేటు వ్యక్తులు స్థలాన్ని లేఅవుట్ చేసి విక్రయించాలని ప్రయత్నిస్తే సుప్రీంకోర్టులో బలంగా వాదించి రక్షించుకున్నామని తెలిపారు. ఇందులో నేషనల్ పార్క్ కోసం వంద ఎకరాలను కేటాయించామని చెప్పారు. ఎల్బీ నగర్ ప్రాంతంలో 424 ఎకరాల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో పార్క్‌ను నిర్మించడానికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని అధికారులను ఆదేశించానని అన్నారు. కబ్జాలు, ఆక్రమణల కారణంగా వర్షపు నీరు వెళ్లడానికి వీలులేక వర్షాలొచ్చినప్పుడు బస్తీలకు బస్తీలు నీట మునిగాయని గుర్తుచేస్తూ, అలాంటి కష్టాలు రావొద్దన్న ఉద్దేశంతోనే కబ్జాల కోరలు పీకాలని హైడ్రాను తీసుకొచ్చామని చెప్పారు. చెరువులు, పార్కులు, నాలాలు కబ్జా చేస్తే హైడ్రా కఠినంగా వ్యవహరిస్తుందని, కొద్ది మంది కబ్జాలకు పాల్పడటం వల్ల వేలాది కుటుంబాల కష్టాలను ఎదుర్కొనే పరిస్థితిని ఉపేక్షించబోమని అన్నారు. గతంలో సీరీస్ ఫ్యాక్టరీ వల్ల ఈ ప్రాంత ప్రజలు తీవ్రమైన ఇబ్బందులను ఎదుర్కొన్నారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు , కొండా సురేఖ తో పాటు ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



# విద్యార్థులకు గుడ్‌న్యూస్.. తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం

- జూన్ 21న NEET పరీక్షకు ఉచిత ప్రయాణం
- హాల్‌టికెట్ చూపిస్తే TGSRTC బస్సుల్లో ఫ్రీ జర్నీ
- ఆర్టీసీ ఎండీకి మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాలు
- విద్యార్థులు, తల్లిదండ్రులకు ఆర్థిక భారం తగ్గనున్నది



**చట్టం, స్టేట్ బ్యూరో:**
తెలంగాణలో నీట్ పరీక్ష రాసే విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అద్భుతమైన తీపి కబురు అందించింది. ఈ నెల జూన్ 21వ తేదీన జరగబోయే నీట్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులందరికీ తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (TGSRTC) బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించాలని ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ విషయాన్ని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారికంగా వెల్లడించారు. పరీక్ష రోజున విద్యార్థులు తమ వెంట కేవలం ‘హాల్‌టికెట్’ చూపిస్తే సరిపోతుందని, ఎలాంటి ఛార్జీలు చెల్లించకుండానే ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించి తమ పరీక్షా కేంద్రాలకు చేరుకోవచ్చని ఆయన స్పష్టం చేశారు. ఈ ఉచిత ప్రయాణ నిర్ణయాన్ని క్షేత్రస్థాయిలో విజయవంతంగా అమలు చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఉన్నతాధికారులను ఆదేశించారు. నీట్ రాసే విద్యార్థులకు హాల్ టికెట్ చూపిస్తే బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించేలా తక్షణ చర్యలు చేపట్టాలని ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డికి మంత్రి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల వేలాది మంది విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ఆర్థిక భారంతో పాటు ప్రయాణ ఇబ్బందులు కూడా తప్పనున్నాయి. పరీక్షా కేంద్రాలకు సకాలంలో చేరుకునేందుకు ఈ సదుపాయం ఎంతో దోహదపడుతుందని విద్యార్థుల కుటుంబాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

# ఒకే రోజు మూడు ఘోర ప్రమాదాలు

**చట్టం, స్టేట్ బ్యూరో:**
తెలంగాణ రాష్ట్రంలో వేర్వేరు జిల్లాల్లో జరిగిన మూడు ఘోర రోడ్డు ప్రమాదాలు తీవ్ర విషాదాన్ని నింపాయి. వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన ఈ రోడ్డు ప్రమాదాలలో మొత్తం ఏడుగురు దుర్మరణం పాలయ్యారు. మితిమీరిన వేగం, నియంత్రణ కోల్పోవడం వంటి కారణాలతో ఈ ప్రమాదాలు జరిగి రక్తాన్ని చిందించాయి. ప్రమాదాల తీవ్రతకు వాహనాలు పూర్తిగా నలిగిపోయి, ఘటనా స్థలాలు మృతుల బంధువుల ఆర్తనాదాలతో మిన్నంటాయి. మొదటి ఘోర ప్రమాదం మేడ్చల్ జిల్లాలో చోటుచేసుకుంది. జిల్లాలోని తుర్కపల్లి వద్ద అత్యంత వేగంగా వెళ్తున్న ఒక కారు అకస్మాత్తుగా అదుపుతప్పింది. రోడ్డుపై వెళ్తున్న లారీని వెనుక నుంచి అత్యంత వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదం ఎంత భీభత్సంగా జరిగిందంటే, కారు ముందు భాగం లారీ కిందకు దూసుకుపోయి నుజ్జునుజ్జయింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు వ్యక్తులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందుకున్న పోలీసులు స్థానికుల సహాయంతో మృతదేహాలను కారులో నుంచి బయటకు తీయాల్సి వచ్చింది. మరోవైపు జనగాం జిల్లా నెల్లుట్ల పరిధిలో జాతీయ రహదారిపై రెండో ప్రమాదం సంభవించింది. రోడ్డు పక్కన ఆగి ఉన్న ఒక ట్రక్కును వేగంగా దూసుకొచ్చిన లారీ బలంగా ఢీకొట్టింది. ఈ రెండు భారీ వాహనాలు ఒకదానికొకటి ఢీకొనడంతో లారీ క్యాబిన్ పూర్తిగా నలిగిపోయింది. ఈ ప్రమాదంలోనూ ముగ్గురు వ్యక్తులు అక్కడికక్కడే మరణించారు. ఇక మూడో ప్రమాదం రాజన్న సిరిసిల్ల జిల్లాలో వెలుగుచూసింది. సిరిసిల్ల ప్రాంతంలో ఒక కారు ఎదురుగా వస్తున్న డీసీఎం వ్యాన్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న వారిలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను తక్షణమే చికిత్స నిమిత్తం సమీప ఆసుపత్రికి తరలించారు. ఈ వరుస ప్రమాదాలపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.






# తెలంగాణలో రిజిస్ట్రేషన్ సేవలకు బ్రేక్

- తెలంగాణలో తాత్కాలికంగా రిజిస్ట్రేషన్ల నిలిపివేత
- జూన్ 26 నుంచి 28 వరకు తాత్కాలికంగా రిజిస్ట్రేషన్ల నిలిపివేత
- ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు కీలక ప్రకటన

**చట్టం, స్టేట్ బ్యూరో:**
తెలంగాణ రాష్ట్ర స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ కీలక ప్రకటన విడుదల చేసింది. సర్వర్ అప్‌గ్రేడేషన్ మరియు నిర్వహణ పనుల కారణంగా జూన్ 26 నుంచి 28 వరకు రాష్ట్రవ్యాప్తంగా రిజిస్ట్రేషన్ సేవలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. శాఖ అధికారిక వెబ్‌సైట్‌తో పాటు అనుబంధ ఆన్‌లైన్ సేవలకు సంబంధించిన సాంకేతిక పనులు చేపడుతున్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ఈ మూడు రోజుల వ్యవధిలో రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన ఆన్‌లైన్ మరియు కార్యాలయ సేవలు అందుబాటులో ఉండవని స్పష్టం చేశారు. ఐదేళ్ల తర్వాత ఈ స్థాయి సర్వర్ అప్‌గ్రేడేషన్ చేపడుతున్నామని ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు పేర్కొన్నారు. ఈ అప్‌గ్రేడేషన్ పూర్తయిన తర్వాత సేవల భద్రత, వేగం మరియు పనితీరు మరింత మెరుగుపడుతాయని తెలిపారు. భవిష్యత్తులో వినియోగదారులకు మరింత సమర్థవంతమైన సేవలు అందించడమే ఈ చర్యల ప్రధాన ఉద్దేశమని వివరించారు. ప్రజలు, రిజిస్ట్రేషన్ సేవలు వినియోగించుకునే వారు ముందస్తుగా తమ పనులను ప్రణాళిక చేసుకోవాలని అధికారులు సూచించారు. అత్యవసర రిజిస్ట్రేషన్ అవసరాలు ఉన్న వారు జూన్ 26కు ముందుగానే పూర్తి చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. జూన్ 29 నుంచి అన్ని రిజిస్ట్రేషన్ సేవలను యథావిధిగా పునరుద్ధరించి అందుబాటులోకి తీసుకువస్తామని ఐజీ తెలిపారు. అప్‌గ్రేడేషన్ అనంతరం సేవలు మరింత సురక్షితంగా, వేగవంతంగా అందుతాయని పేర్కొన్నారు.

# నిరుద్యోగులకు గుడ్ న్యూస్

- మరో నోటిఫికేషన్ విడుదల
- డైట్ కాలేజీల్లో 86 లెక్చరర్ ఖాళీలు
- జూన్ 24 నుంచి దరఖాస్తుల స్వీకరణ
- పీజీ, ఎం.ఎడ్ అభ్యర్థులకు అవకాశం
- రూ.1.37 లక్షల వరకు ఆకర్షణీయ జీతం

**చట్టం, స్టేట్ బ్యూరో:**
తెలంగాణలో కొలువుల జాతర ముమ్మరంగా కొనసాగుతోంది. ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (TGPSC) మరో అదిరిపోయే తీపి కబురు అందించింది. పాఠశాల విద్యా శాఖ పరిధిలోని జిల్లా విద్యా శిక్షణ సంస్థల (DIET) కాలేజీల్లో ఖాళీగా ఉన్న లెక్చరర్ పోస్టుల భర్తీకి కమిషన్ సరికొత్త నోటిఫికేషన్‌ను జారీ చేసింది.

**ఉద్యోగ ఖాళీల వివరాలు**
ఈ తాజా నోటిఫికేషన్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 86 ఖాళీ పోస్టులను భర్తీ చేయనున్నారు. వీటిని మల్టీజోన్ల వారీగా విభజించగా, మల్టీజోన్1 పరిధిలో 53 పోస్టులు , మల్టీజోన్2 పరిధిలో 33 పోస్టులు ఉన్నాయి. మొత్తం ఖాళీలలో 23 సీనియర్ లెక్చరర్ పోస్టులు ఉండగా, మిగిలిన 63 పోస్టులు వివిధ సబ్జెక్టులకు సంబంధించిన లెక్చరర్ విభాగానికి చెందినవిగా అధికారులు వెల్లడించారు.

**ముఖ్యమైన తేదీలు , వయోపరిమితి**
ఈ ఉద్యోగాలకు అర్హత , ఆసక్తి గల అభ్యర్థులు ఆన్‌లైన్ పద్ధతిలో మాత్రమే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ జూన్ 24, 2026 నుండి ప్రారంభం కానుంది. అభ్యర్థులు తమ దరఖాస్తులను సమర్పించడానికి జూలై 29, 2026 వరకు ఆఖరి గడువుగా నిర్ణయించారు. అలాగే దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల వయస్సు జూలై 1, 2026 నాటికి కనీసం 18 ఏళ్లు నిండి ఉండాలని, గరిష్టంగా 44 ఏళ్లకు మించకూడదని నోటిఫికేషన్‌లో స్పష్టం చేశారు. అయితే ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులైన అభ్యర్థులకు వయోపరిమితిలో సడలింపులు వర్తిస్తాయి.

**కావాల్సిన విద్యార్హతలు , జీతభత్యాలు**
ఈ పోస్టులకు దరఖాస్తు చేయాలనుకునే వారు సంబంధిత సబ్జెక్టులో కనీసం 55 శాతం మార్కులతో పోస్ట్ గ్రాడ్యుయేషన్ (PG) డిగ్రీ పూర్తి చేసి ఉండాలి. దీనితో పాటు ఎన్‌సీటీఈ (NCTE) గుర్తింపు పొందిన సంస్థ నుండి కనీసం 55 శాతం మార్కులతో ఎం.ఈడి (M.Ed) డిగ్రీ కూడా పాస్ అయి ఉండాలి. ఈ ఉద్యోగాలకు ఎంపికైన వారికి జీతభత్యాలు చాలా ఆకర్షణీయంగా ఉన్నాయి. సీనియర్ లెక్చరర్ పోస్టుకు నెలకు రూ. 58,850 నుండి రూ. 1,37,050 వరకు, అలాగే లెక్చరర్ పోస్టుకు నెలకు రూ. 54,220 నుండి రూ. 1,33,630 వరకు స్కేల్ ఆఫ్ పే లభిస్తుంది.

**దరఖాస్తు చేసుకునే విధానం**
అర్హులైన అభ్యర్థులందరూ TGPSC అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో తమ వివరాలను నమోదు చేసుకోవచ్చు. ఈ రిక్రూట్‌మెంట్‌కు సంబంధించిన పూర్తి వివరాలు, పరీక్షా విధానం, సిలబస్ , ఇతర సమాచారం కోసం అభ్యర్థులు https://www.tgpsc.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాల్సిందిగా కమిషన్ కోరింది.

## ఎమ్మెల్యేను కలిసిన ఆర్టీసీ ఆర్ఎం, డిప్యూటీ ఆర్ఎం

- **నూతనంగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఎమ్మెల్యేతో భేటీ**
- **ఆర్టీసీ అభివృద్ధికి అంకితభావంతో పనిచేయాలని సూచన.. పలు అంశాలపై చర్చ**



**చట్టం, నిజామాబాద్ ప్రతినిధి:** ఇటీవల నిజామాబాద్ ఆర్టీసీ ఆర్ఎం(రీజినల్ మేనేజర్), డిప్యూటీ ఆర్ఎం గా బాధ్యతలు చేపట్టిన కృష్ణమూర్తి, పి.జ్యోతి లు నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా.ఆర్.భూపతి రెడ్డిని గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి పరిచయం చేసుకున్నారు. అనంతరం పలు అంశాల పై చర్చించారు. నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం పరిధిలో ప్రజలకు రవాణా సౌకర్యం కల్పించడంలో అంకితభావంతో పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. ఆర్టీసీ బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు. అధికారులు ఆర్టీసీ సేవలను ప్రజలకు మరింత చేరువయ్యేలా కృషి చేయాలని సూచించారు.

## జూన్ 19 నుంచి మీసేవా రశీదులు ఇకపై SMS ద్వారానే




**చట్టం రామాయంపేట :** రాష్ట్రంలో డిజిటలైజేషన్‌కు మరింత ప్రాధాన్యం ఇస్తూ మీసేవా సేవల్లో కీలక మార్పులు అమల్లోకి రానున్నాయి. జూన్ 19 నుంచి మీసేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకునే వారికి కాగితంపై రశీదు ఇవ్వకుండా, SMS ద్వారానే రశీదులు పంపించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. కాగితం వినియోగాన్ని తగ్గించడం, పర్యావరణ పరిరక్షణతో పాటు దరఖాస్తుదారులకు వేగవంతమైన సేవలు అందించడం లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. దరఖాస్తుదారుల మొబైల్‌కు వచ్చే SMSలోని లింక్ ద్వారా రశీదును డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అవసరమైతే ప్రింట్ కూడా తీసుకోవచ్చు. సర్టిఫికెట్ జారీ కాకముందే ఒకవేళ SMS తొలగించబడినా, రీసెండ్ ఆప్షన్ ద్వారా మళ్లీ రశీదును పంపించేలా మీసేవా ఆపరేటర్లకు ప్రభుత్వం సూచనలు జారీ చేసింది.

## చౌదర్‌గూడలో సామూహిక అక్షరాభ్యాసం

- **చిన్నారులకు పుస్తకాలు, పలకలు, యూనిఫాంల పంపిణీ**



**చట్టం, శంషాబాద్ :** శంషాబాద్ మండలంలోని చౌదర్‌గూడ గ్రామ ప్రాథమిక పాఠశాల, అంగన్వాడి కేంద్రంలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ సంతపురి ప్రేమ్‌రాజ్ పాల్గొని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. అలాగే అంగన్వాడి కేంద్రంలోని చిన్నారులకు పలకలు, పాఠశాల యూనిఫాంలను అందజేశారు. ఈ సందర్భంగా మూడు సంవత్సరాలు నిండిన ప్రతి చిన్నారిని అంగన్వాడి కేంద్రంలో తప్పనిసరిగా చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. అంగన్వాడి కేంద్రంలో ఎలాంటి సమస్యలు ఉన్నా గ్రామపంచాయతీ తరపున పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు తాళ్ల జయమ్మ, బక్క రాజు, కుమ్మరి అరుణ పెంటయ్య, బక్క సుజాత సుధాకర్, మామిళ్ల సబిత మల్లేష్, ఉపాధ్యాయుడు శ్రీనివాస్, అంగన్వాడి టీచర్ అమూల్య, అంగన్వాడి ఆయా యాదమ్మ, ఆశా వర్కర్ కలమ్మ, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడిగా ఆది రంగారెడ్డి

- **ప్రధాన కార్యదర్శిగా కిష్టపురం లక్ష్మణ్**



**చట్టం సిద్దిపేట ప్రతినిధి :** ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఏఐటీయూసీ) సిద్దిపేట జిల్లా 4వ మహాసభలు బుధవారం సిద్దిపేట పట్టణంలోని శక్తి గార్డెన్స్‌లో నిర్వహించారు. మహాసభల్లో జిల్లా అధ్యక్షుడిగా ఆది రంగారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శిగా కిష్టపురం లక్ష్మణ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా కార్యవర్గం, జిల్లా కౌన్సిల్‌ను మొత్తం 31 మంది సభ్యులతో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఏఐటీయూసీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. బాలరాజ్ ప్రకటించారు. నూతనంగా ఎన్నికైన జిల్లా ప్రధాన కార్యదర్శి కిష్టపురం లక్ష్మణ్ మాట్లాడుతూ, ఎన్నికకు సహకరించిన కార్మిక సంఘం, పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో వివిధ రంగాల్లో పని చేస్తున్న కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతూ, సంఘాన్ని మరింత బలోపేతం చేసే దిశగా కృషి చేస్తామని తెలిపారు. జిల్లా ఉపాధ్యక్షులుగా అందె అశోక్, పిట్ల మల్లేశం, కర్నాల చంద్రం, బంక రాజయ్య, సహాయ కార్యదర్శులుగా తవుసుపల్లి బిక్షపతి, బెక్కంటి సంపత్, పంతం నర్సింహులు, గంగి రాజు, కోశాధికారిగా గోవిందారం బాలయ్య ఎన్నికయ్యారు.

## 108 అంబులెన్స్ ఆకస్మిక తనిఖీ చేసిన ప్రోగ్రాం మేనేజర్ జనార్ధన్



**చట్టం పోతంగల్ /కోటగిరి:** నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండల కేంద్రంలోని గురువారం 108 అంబులెన్స్ ని ఆకస్మిక తనికి చేసి రికార్డులను పరిశీలించారు.అంబులెన్స్ ను ప్రజలు వినియోగించుకునేల ఉండాలని సూచించారు. అంబులెన్స్ లో కాలం చెల్లిన మందులను ఎప్పటికప్పుడు పరిశీలించి తీసివేయాలని ఆయన సూచించారు. రికార్డులను పరిశీలించి రోజు చేస్తున్న కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి ఎల్లవేళలా సేవలు చేసే విధంగా అంబులెన్స్ ను ఉపయోగించుకునే విధంగా ఉండాలని ఆయన సూచించారు. ప్రోగ్రాం మేనేజర్ జనార్ధన్ మాట్లాడుతూ అన్ని రకాల కేసులను చేస్తూ ప్రజలకు ఎల్లప్పుడూ వైద్య సేవలు అందే విధంగా అంబులెన్స్ ను వినియోగించాలని ఆయన సూచించారు. పోతంగల్ అంబులెన్స్ లో వైద్య పరికరాలను పరిశీలించి వాటి పనితీరును పరిశీలించారు. పోతంగల్ అంబులెన్స్ సిబ్బంది రికార్డ్లను రోగులను ఎటువంటి ఇబ్బంది లేకుండా వాళ్ళు చెప్పిన హాస్పిటల్ కి తీసుకెళ్లాలని బోధన్ ఏరియా హాస్పిటల్ తీసుకెళ్లాలని ఆయన సూచించారు. దీంతో పోతంగల్ అంబులెన్స్ సిబ్బంది వి. నాగరాణి కే. నారాయణ పైలట్ ఎండికలింగ్ పాల్గొన్నారు.

## మొహర్రం పండగా ప్రారంభం ఆయాగ్రామాల్లో పీరీల ప్రతిష్టపన



**చట్టం న్యూస్ లింగంపేట్ :** లింగంపేట్ మండలం ఆయా గ్రామలల్లో గురువారం రోజున మొహర్రం పండగ ప్రారంభించారు. ఇందులో భాగంగా పోల్కంపేట్ గ్రామంలో హస్సేన్, హుస్సేన్, మౌలాలి, నాలెహజాద్, ఖాసీందుల పీరీలను ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా పీరీల నిర్వాహకులు మాట్లాడుతూ అనాదిగా వస్తున్న ఆచార సంప్రదాయం ప్రకారం మొహర్రం పండగ నిర్వహిస్తామని అన్నారు. త్యాగానికి ప్రతికగా పండగ నిర్వహిస్తామని తెలిపారు. మొహర్రం పండగలో భాగంగా గురువారం నుండి 9రోజులు పూజిస్తాం అన్నారు. మంగళవారం రోజున ఉదయం మౌలాలి సవారీ ఉంటుంది మరియు బుధవారం రోజున ఉదయం ఖాసీందూల సవారీ మరియు గురువారం రోజున ఉదయం నాలెహజాద్ సవారీ ఉంటుంది. తేదీ: 26062026 శుక్రవారం రోజున ఉదయం బీఫాతిమా, హస్సేన్, హుస్సేన్ సవారీలు ఉంటాయన్నారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు పీర్లకు కుడుకలు, బెల్లం, బియ్యం, సమర్పించి మొక్కులు తీర్చుకుంటున్నారు. ఈ ప్రతిష్టనలో సయ్యద్ మోహిద్ తదితరులు పాల్కొన్నారు.

# యూరియా కొరతపై బాల్కొండలో బీఆర్ఎస్ భారీ ధర్నా

- **ప్రభుత్వ వైఖరిపై ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి తీవ్ర విమర్శలు**
- **కలెక్టర్ హామీతో విరమించిన ఆందోళన**




**బాల్కొండ, (చట్టం న్యూస్):** యూరియా కొరత, యాప్ ఆధారిత పంపిణీ విధానం రద్దు, రైతులకు ఎకరానికి నాలుగు సంచుల యూరియాను ఒకేసారి అందజేయాలనే డిమాండ్లతో బాల్కొండ నియోజకవర్గ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో గురువారం ఎన్‌హెచ్ 63 వేల్పూర్ ఎక్స్‌రోడ్డు వద్ద భారీ ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాల్కొండ ఎమ్మెల్యే, మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి పాల్గొని రైతులతో కలిసి రోడ్డుపై బైఠాయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో రైతులు యూరియా కోసం రోడ్లపైకి రావాల్సిన పరిస్థితి కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు. కేసీఆర్ పాలనలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎరువులు, సాగునీరు, 24 గంటల ఉచిత విద్యుత్ అందించగా, ప్రస్తుతం యాప్ విధానంతో రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. జిల్లాలో సుమారు మూడు లక్షల మంది రైతులు ఉన్నప్పటికీ ఇప్పటివరకు కేవలం నాలుగు లక్షల యూరియా సంచులు మాత్రమే పంపిణీ చేశారని, ఇది అవసరానికి చాలా తక్కువని పేర్కొన్నారు. ఒక పంట సీజన్‌కే సుమారు 24 లక్షల యూరియా సంచులు అవసరమవుతాయని, అయినప్పటికీ స్టాకులు సమృద్ధిగా ఉన్నాయని అధికారులు చెబుతున్న ప్రకటనలు వాస్తవాలకు విరుద్ధమని అన్నారు. ప్రభుత్వం తక్షణమే యాప్ విధానాన్ని రద్దు చేసి, రైతులకు ఎకరానికి నాలుగు సంచుల చొప్పున యూరియాను ఒకేసారి అందించాలని, సహకార సంఘాలు మరియు ప్రైవేట్ ఎరువుల దుకాణాల్లో తగిన నిల్వలు ఉంచాలని డిమాండ్ చేశారు. అలాగే కేంద్ర ప్రభుత్వం కాంప్లెక్స్ ఎరువుల ధరలను తగ్గించాలని, రాష్ట్రానికి అదనపు యూరియా కోటా కేటాయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆందోళన స్థలానికి చేరుకున్న జిల్లా అడిషనల్ కలెక్టర్, వ్యవసాయ శాఖ అధికారులు జిల్లా కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడించి, రైతుల డిమాండ్లను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో బీఆర్ఎస్ నాయకులు ధర్నాను విరమించారు.

## యూరియా కోసం యాప్ యాతన!

- **అన్నదాత గర్జనతో ఎల్లారెడ్డి దద్దరిల్లింది... రైతు రోషం ఉప్పొంగింది**
- **టెక్నాలజీ పేరుతో రైతు జీవనంపై భారం**
- **మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ తీవ్ర విమర్శలు**



**చట్టం / ఎల్లారెడ్డి; :** యూరియా సరఫరాను యాప్‌కు పరిమితం చేయడంతో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ఎల్లారెడ్డి మండలం గురువారం ఆగ్రహంతో మిన్నంటింది. రైతుల సమస్యలకు పరిష్కారం కోరుతూ నిర్వహించిన ధర్నా కార్యక్రమం ఉద్విగ్న వాతావరణంలో సాగింది. ఈ ఆందోళనలో మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ పాల్గొని రైతులకు మద్దతు తెలుపుతూ ప్రభుత్వ విధానాలపై తీవ్రంగా విరుచుకుపడ్డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దేశానికి వెన్నెముకగా నిలిచే రైతును సాంకేతిక విధానాల పేరుతో ఇబ్బందులకు గురిచేయడం దురదృష్టకరమని పేర్కొన్నారు. యూరియా కొనుగోలును యాప్‌తో అనుసంధానం చేయడం వల్ల గ్రామీణ రైతులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఇది రైతు వ్యతిరేక నిర్ణయమని విమర్శించారు. స్మార్ట్‌ఫోన్లు లేని వృద్ధులు, నిరక్షరాస్య రైతులు యాప్ విధానంతో తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని, నమోదు ప్రక్రియ వారికి అందని ద్రాక్షగా మారిందని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సరైన నెట్‌వర్క్ సదుపాయం లేకపోవడం, సర్వర్ సమస్యలు తరచూ ఎదురవడం వల్ల రైతులు ఎండలో గంటల తరబడి నిలబడి వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. సకాలంలో యూరియా అందకపోతే పంట దిగుబడులు తీవ్రంగా దెబ్బతింటాయని, రైతుల ఆర్థిక పరిస్థితి మరింత క్షీణించే ప్రమాదం ఉందని హెచ్చరించారు. యాప్ రిజిస్ట్రేషన్ కోసం నెట్ సెంటర్ల చుట్టూ తిరగాల్సి రావడం వల్ల రైతులపై అదనపు ఖర్చు పడుతోందని తెలిపారు. 'సాంకేతికత రైతుకు సాయం చేయాలి... కానీ అతనికి అడ్డంకిగా మారకూడదు' అని స్పష్టం చేసిన ఆయన, గతంలో అమల్లో ఉన్న విధంగా ఆధార్ కార్డు లేదా పట్టాదారు పాస్ పుస్తకం ఆధారంగా నేరుగా యూరియా అందించే పద్ధతినే తిరిగి అమలు చేయాలని డిమాండ్ చేశారు. రెండు రోజుల్లో ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని అన్ని కేంద్రాల్లో యూరియా అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. లేకపోతే రైతులను ఏకం చేసి భారీ స్థాయిలో ఉద్యమాలు చేపట్టి ప్రభుత్వాన్ని స్తంభింపజేస్తామని స్పష్టం చేశారు. ధర్నా కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొని తమ ఆవేదనను వ్యక్తం చేశారు. 'యాప్ రద్దు చేయాలి - రైతును కాపాడాలి' అనే నినాదాలతో ప్రాంతం మారుమోగింది.

## ఆనాటి చదువు – నేటి చదువు: మారిన విద్యా వ్యవస్థ... పెరిగిన భారం




**చట్టం రామాయంపేట :** ఒకప్పుడు విద్య అంటే జ్ఞానాన్ని సంపాదించడం, మంచి విలువలను అలవర్చుకోవడం, సమాజంలో బాధ్యతాయుతమైన వ్యక్తిగా ఎదగడం అనే భావన ఉండేది. కాలక్రమేణా విద్యా విధానంలో వచ్చిన మార్పులతో పాటు, చదువు అనేది అనేక కుటుంబాలకు ఆర్థికంగా భారంగా మారిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో విద్యార్థులు పలక, బలపం, కొద్ది పుస్తకాలతోనే చదువును కొనసాగించేవారు. ఉపాధ్యాయులు బోధించిన పాఠాలు, పాఠశాలలో స్నేహితులతో కలిసి నేర్చుకున్న అనుభవాలు విద్యలో భాగమయ్యేవి. పరీక్షల్లో మార్కుల కంటే విజ్ఞానం, క్రమశిక్షణ, సంస్కారం వంటి అంశాలకు ఎక్కువ ప్రాధాన్యం ఉండేది. ప్రస్తుతం చిన్నారులు ఎల్‌కేజీ నుంచే ప్రవేశ ప్రక్రియలు, ఫీజులు, పుస్తకాలు, యూనిఫార్ములు, రవాణా, కోచింగ్ వంటి అనేక ఖర్చులను ఎదుర్కొంటున్నారు. దీంతో మధ్యతరగతి, పేద కుటుంబాలపై ఆర్థిక ఒత్తిడి పెరుగుతోందని పలువురు అభిప్రాయపడుతున్నారు. మరోవైపు మార్కులు, ర్యాంకులు, పోటీ పరీక్షల ఒత్తిడి విద్యార్థులపై మానసిక ప్రభావం చూపుతోందని విద్యావేత్తలు పేర్కొంటున్నారు. విద్యలో నాణ్యత, సమాన అవకాశాలు, అందుబాటు అనే అంశాలపై మరింత దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని సామాజిక వర్గాలు సూచిస్తున్నాయి. విద్యార్థుల్లో సృజనాత్మకత, నైపుణ్యాలు, మానవీయ విలువలు పెంపొందించే విధంగా విద్యా వ్యవస్థ ఉండాలని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. విద్య అనేది కేవలం ఫీజులు లేదా మార్కులతో కొలవలేని అంశమని, వ్యక్తిలో జ్ఞానం, వ్యక్తిత్వం, సామాజిక బాధ్యత పెంపొందించడమే దాని అసలు లక్ష్యమని పలువురు పేర్కొంటున్నారు. ప్రతి చిన్నారికి నాణ్యమైన విద్య అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

## హామీలు నెరవేర్చకుండా ప్రశ్నించిన వారిపై బాడీ షేమింగ్ చేయడం దురదృష్టకరం: బీఆర్ఎస్



**చట్టం – సిద్దిపేట ప్రతినిధి :** ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీల అమలుపై ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నాయకులపై వ్యక్తిగత వ్యాఖ్యలు చేయడం అధికార పార్టీ వైఫల్యాన్ని సూచిస్తోందని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పాల సాయిరాం, మోహన్ లాల్, ఎడ్ల సోమిరెడ్డి విమర్శించారు. సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటి పూర్తిస్థాయిలో అమలు కాలేదన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులకు రూ.10 వేల ఆర్థిక సహాయం, ఇంటర్ ఉత్తీర్ణులకు రూ.15 వేల ప్రోత్సాహకం, డిగ్రీ పూర్తి చేసిన వారికి రూ.25 వేల సాయం అందిస్తామని ప్రకటించిన ప్రభుత్వం ఇప్పటివరకు ఆ హామీలను అమలు చేయలేదని ఆరోపించారు. పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ కూడా సక్రమంగా అందడం లేదని పేర్కొన్నారు. అభివృద్ధి అంశాలపై ప్రశ్నిస్తున్న హరీష్ రావుపై వ్యక్తిగతంగా, శారీరక ఆకృతిని లక్ష్యంగా చేసుకుని వ్యాఖ్యలు చేయడం ముఖ్యమంత్రి స్థాయికి తగదన్నారు. ప్రజా సమస్యలకు సమాధానాలు చెప్పాల్సిన ప్రభుత్వం వ్యక్తిగత విమర్శలకు దిగడం సమంజసం కాదని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై అవినీతి ఆరోపణలు చేసిన కాంగ్రెస్ నాయకులు, విద్యాశాఖలో రూ.2 వేల కోట్ల కుంభకోణంపై వస్తున్న విమర్శలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఇకనైనా ప్రతిపక్ష నాయకులపై వ్యక్తిగత వ్యాఖ్యలు మానుకుని, ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై దృష్టి సారించాలని కోరారు. ఈ సమావేశంలో మోహిజ్, నాగరాజు, సాయి ప్రేమ్, మహిపాల్ గౌడ్, రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## మల్కారం గ్రామంలో ఘనంగా వన మహోత్సవం... మొక్కలు నాటిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్




**చట్టం, శంషాబాద్ :** శంషాబాద్ మండలం పరిధిలోని మల్కారం గ్రామంలో గురువారం 'వన మహోత్సవం' కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ముఖ్య అతిథిగా విచ్చేసి, స్వయంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... పచ్చదనం పెంపొందించడం, పర్యావరణాన్ని పరిరక్షించుకోవడం మన అందరి సామాజిక బాధ్యత అని గుర్తుచేశారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలిని, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించడానికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటడమే కాకుండా, వాటిని కంటికి రెప్పలా సంరక్షించాలని గ్రామస్తులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు కళ్ళే బిక్షపతి, రాంగోపాల్, కోటేశ్వర్ గౌడ్, బిక్షపతి రెడ్డి, గడ్డం శేఖర్ యాదవ్, మల్కారం సొసైటీ చైర్మన్ ప్రభు సాగర్, మాజీ సర్పంచ్ యాదగిరి రెడ్డి, రమేష్, ఇస్తారి, సీనియర్ నాయకులు చంద్రారెడ్డి, ఉప సర్పంచ్ శివకుమార్, శ్రీనివాస్, మహేందర్, ఫారెస్ట్ అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు మరియు మల్కారం గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## టిఆర్ఎస్ పార్టీ లో పలువురి చేరిక

- **తెలంగాణలో బలమైన రాజకీయ శక్తిగా ఎదుగుతున్న టిఆర్ఎస్**
- **టిఆర్ఎస్ ఎల్లారెడ్డి నియోజకవర్గ ఇన్చార్జ్ సంపత్ గౌడ్**



**చట్టం న్యూస్ లింగంపేట్ :** టిఆర్ఎస్ పార్టీ ఎల్లారెడ్డి నియోజకవర్గం ఇంచార్జ్ ఎదురుగట్ల సంపత్ గౌడ్ ఆధ్వర్యంలో లింగంపేట్ మండలం లోని శెట్పల్లి సంగారెడ్డి గ్రామానికి చెందిన యూత్ నాయకులు, ఉప్పరి ప్రశాంత్ వీరితో పాటు వివిధ పార్టీ కార్యకర్తలు సుమారు 15మంది చేరారు. పార్టీలో చేరిన వారికి సంపత్ గౌడ్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. తెలంగాణలో కల్వకుంట్ల కవిత నాయకత్వానికి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని అన్నారు. టిఆర్ఎస్ పార్టీకి రోజురోజుకు ఆదరణ పెరుగుతుందన్నారు ఎంతోమంది ప్రజలు స్వచ్ఛందంగా టిఆర్ఎస్ లో చేరుతున్నారని తెలిపారు. రానున్న రోజుల్లో తెలంగాణ రాజకీయాలను శాసించే స్థాయికి టిఆర్ఎస్ చేరుకుంటుందన్నారు. రానున్న ఎన్నికల్లో టిఆర్ఎస్ ఘనవిజయం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీఆరెస్ మండల అధ్యక్షులు పోకల సాయిరాం, సీనియర్ నాయకులు గోవర్ధన్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, జైల్ సింగ్, భాగారెడ్డి, ఫహీమ్, శ్రీకాంత్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## సామూహిక అక్షరాభ్యాసం పాఠ్యపుస్తకాలు పంపిణీ

- **మండల విద్యాధికారి బుచ్చా నాయక్**



**చట్టం న్యూస్, శివ్వంపేట :** శివ్వంపేట మండల పరిధిలో గల తిమ్మపూర్ పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం, పాఠ్యపుస్తకాల పంపిణీ జరిగింది. వనమహోత్సవంలో మొక్కలు నాటడం జరిగింది. ఒకటో తరగతి విద్యార్థులకు పుష్ప గుచ్చాలతో స్వాగతం పలకడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మండల విద్యాధికారి బుచ్చా నాయక్, గ్రామ స్థానిక సర్పంచ్, ఊపసర్పంచ్, వార్డు మెంబర్లు, కార్యదర్శి, పాఠశాల ప్రదానోపాధ్యాయులు అభిలాష్, పాఠశాల ఊపాధ్యాయులు లావణ్య, భాగ్యలక్ష్మి, అన్నపూర్ణ, అంగన్వాడీ టీచర్లు, ఏఏపీసి చైర్మన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఆలంపల్లి జడ్‌పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ




**చట్టం, వికారాబాద్ ప్రతినిధి :** వికారాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 22వ వార్డు ఆలంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 22వ వార్డు కౌన్సిలర్ లంక లక్ష్మీకాంత్ రెడ్డి విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేశారు. ఈ సందర్భంగా లంక లక్ష్మీకాంత్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్‌కు విద్యే బలమైన పునాది అని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అవసరమైన విద్యా సామగ్రి అందించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించి కుటుంబానికి, సమాజానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధికి తన వంతు సహకారం నిరంతరం ఉంటుందని హామీ ఇచ్చారు. విద్యార్థుల అవసరాలను గుర్తించి సమయానుకూలంగా సహాయం అందించడం వల్ల వారి చదువుపై మరింత ఆసక్తి పెరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, కాంగ్రెస్ నాయకుడు ఆనంద్ కుమార్, మాజీ కౌన్సిలర్ బుచ్చిబాబు గౌడ్, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. నోట్‌బుక్స్ అందుకున్న విద్యార్థులు ఆనందం వ్యక్తం చేయగా, పాఠశాల సిబ్బంది కార్యక్రమాన్ని అభినందించారు.

## సేవా భారతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ




**చట్టం, శంషాబాద్ :** సేవా భారతి ఫౌండేషన్ స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వర్యంలో గురువారం శంషాబాద్ మండలం సుల్తాన్ పల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సేవా భారతి ఆధ్వర్యంలో ఉచిత నోట్ బుక్స్ మరియు స్కూల్ బ్యాగ్స్ అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ ముఖ్య అతిథులుగా పాల్గొని ఆయన మాట్లాడుతూ... విద్యార్థులకు స్వచ్ఛంద సంస్థ వారు ఇలాంటి కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. విద్యార్థులు మంచి చదువులు చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ప్రభాకర్ గౌడ్, మాజీ సర్పంచ్ ఇస్తారీ, ఉప సర్పంచ్ వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల మధ్యే ప్రజాప్రతినిధి

- **సంక్షేమం నుంచి అభివృద్ధి వరకు వరుస కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్**



**చట్టం, కుభీర్ :** కుభీర్ మండలంలో ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ వరుస అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో పాల్గొంటూ ప్రజలకు మరింత చేరువయ్యారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆకస్మిక తనిఖీ, రూ.1 కోటి వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు భూమిపూజ, విఠలేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుపేదలకు సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో గృహ నిర్మాణ పథకాలను అమలు చేస్తున్నాయని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. లబ్ధిదారులు మంజూరు పత్రాలను సద్వినియోగం చేసుకొని త్వరితగతిన ఇళ్ల నిర్మాణం చేపట్టాలని కోరారు. అనంతరం కుభీర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. విద్యార్థుల హాజరు, బోధన విధానం, మౌలిక వసతులను పరిశీలించి తరగతి గదులను సందర్శించారు. ఉపాధ్యాయులతో మాట్లాడి బోధన నాణ్యతపై ఆరా తీశారు. కొందరు ఉపాధ్యాయులు విధుల నిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శించడాన్ని గుర్తించి అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో రాజీ పడకుండా సమయపాలన పాటిస్తూ నాణ్యమైన బోధన అందించాలని సూచించారు. విద్యా ప్రమాణాల పెంపునకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కళాశాల యాజమాన్యానికి ఆదేశించారు. తదుపరి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఆర్ఈజీఎస్) నిధులతో సుమారు రూ.1 కోటి వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు భూమిపూజ నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో రహదారి సౌకర్యాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. కొత్తగా నిర్మించే సీసీ రోడ్లు గ్రామ ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించడంతో పాటు వర్షాకాలంలో ఎదురయ్యే ఇబ్బందులను తగ్గిస్తాయని తెలిపారు. పనులను నాణ్యత ప్రమాణాలతో నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం కుభీర్ మండలంలోని విఠలేశ్వర స్వామి ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇటీవల ఎన్నికైన ఆలయ కమిటీ సభ్యులు శుభాకాంక్షలు తెలియజేశారు. ఆలయ అభివృద్ధి, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనపై చర్చించారు. ఆలయ సంప్రదాయాలు, ఆధ్యాత్మిక విలువల పరిరక్షణకు ప్రభుత్వం సహకారం అందిస్తుందని తెలిపారు. కార్యక్రమాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు, మండల నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## తూప్రాన్ ఆర్డీవో ను సన్మానించిన ఎమ్మార్పీఎస్ నాయకులు



**చట్టం మెదక్ ప్రతినిధి :** మెదక్ జిల్లా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన తూప్రాన్ ఆర్డీవో, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు మాసాయిపేట యాదగిరి మాదిగ, గజ్జెల బిక్షపతి మాదిగల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా రెవెన్యూ డివిజన్ పరిధిలో ఉన్న దళితులకు సంబంధించిన పలు సమస్యలను ఆర్డీవోకు విన్నవించగా ఆర్డీవో సానుకూలంగా స్పందించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. వెల్దుర్తి, చేగుంట, మాసాయిపేట మండల పరిధిలోని దళితుల భూసమస్యలు ఆర్డీవోకు విన్నవించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ (టిఎస్) సీనియర్ నాయకులు గుడ్డి క్రిష్ణ మాదిగ, వెల్దుర్తి మండల నాయకులు జాజాల క్రిష్ణ మాదిగ, మాజి వార్డు సభ్యులు, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు ముక్క దశరథ మాదిగ, దళిత నాయకులు ఎర్ర స్వామి మాదిగ, దప్పు మహేష్ మాదిగ, ఎర్ర సంతోష్ మాదిగ, ప్రసాద్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## ప్రీ మెట్రిక్ స్కాలర్షిప్ రెన్యువల్ చేసుకోండి

- **జిల్లా బీసీ సంక్షేమ అధికారి డి శ్రీనివాస్**



**చట్టం, నిర్మల్ ప్రతినిధి :** నిర్మల్ జిల్లాలోని బీసీ విద్యార్థులు ప్రీమెట్రిక్ స్కాలర్షిప్‌ల రెన్యువల్ చేసుకోవాలని జిల్లా బీసీ సంక్షేమ శాఖ అభివృద్ధి అధికారి డి.శ్రీనివాస్ తెలిపారు. రాష్ట్రంలో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రీమెట్రిక్ ఉపకార వేతనాల రెన్యువల్ ప్రక్రియ ప్రారంభమైందన్నారు. అర్హులైన విద్యార్థులు ఆలస్యం చేయకుండా వెంటనే ఆన్‌లైన్ ద్వారా తమ దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు. 202627 విద్యా సంవత్సరానికి గాను జిల్లాలోని ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేటు విద్యాసంస్థల్లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఈ స్కాలర్షిప్‌లను ప్రభుత్వం త్వరలోనే అందించనుందని అన్నారు. అర్హత కలిగిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న తర్వాత, ఆ దరఖాస్తు పత్రాల జిరాక్స్ కాపీలను సంక్షేమ శాఖ కార్యాలయంలో తప్పనిసరిగా అందజేయాలని సూచించారు. దరఖాస్తు ప్రక్రియ కోసం అభ్యర్థులు బీసీ కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డ్, నివాస ధ్రువీకరణ పత్రం, ఆధార్ సంఖ్యతో అనుసంధానమైన బ్యాంక్ ఖాతా వివరాలను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ఈ వివరాలన్నింటినీ ఆన్ లైన్లో ఖచ్చితంగా నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. ఈ ఉపకార వేతనాలకు సంబంధించిన ఇతర పూర్తి వివరాల కోసం నేరుగా శాఖ కార్యాలయాన్ని సందర్శించవచ్చున్నారు. మరింత సమాచారం కొరకు, సందేహాల నివృత్తి కొరకు 9849290043 నంబరును సంప్రదించవచ్చునని తెలిపారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన డి ఆర్ డి ఏ పిడి



**చట్టం, కుబీర్ :** జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం డిఆర్డిఓ పీడి విజయలక్ష్మి కుబేర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి అనుకోని ఉన్న మురికి కాలువతో మేదరి కాలనీ, విటళేశ్వర్ ఆలయ ప్రాంగణం ముంపుకు గురై తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయం జిల్లా కలెక్టర్ భవేశ మిశ్రా దృష్టికి వెళ్లడంతో ఆయన ఇటీవల మురికి కాలువను పరిశీలించారు. త్వరలోనే మురికి కాల్వ వెడల్పు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రహరీ గోడ పనులకు నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో గురువారం డి ఆర్ డి ఓ పి డి మురికి కాలువను పరిశీలించి ఉపాధి హామీ నిధులు మురికి కాలువ నిర్మాణం చేపడతామన్నారు. అనంతరం కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలను సైతం సందర్శించారు. పాఠశాలలో మురికి నీరు వర్షపు నీరు వృధాగా పోకుండా ఇంకుడు గుంత నిర్మించుకోవాలని ప్రత్యేక అధికారి వాణి కి సూచించారు.ఈ సందర్భంగా ఆమె వెంట స్థానిక సర్పంచ్ సాయినాథ్ ఉపాధి హామీ ఏపిఓ హరిలాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు విజేష్,కేజీబివి ప్రాథనోపాధ్యాయురాలు వాణి ఉపాధిహామీ టెక్నీకల్ అసిస్టెంట్ సంతోష్ తదితరులు ఉన్నారు.

## అంగన్వాడి పిల్లలకు అక్షరాభ్యాసం స్కూల్ యూనిఫాం పంపిణీ : సర్పంచ్ యం.నవీన్



**చట్టం న్యూస్,శివ్వంపేట :** శివ్వంపేట మండలపరిధిలో గల పెద్దగొట్టిముక్ల గ్రామంలో అంగన్వాడి కేంద్రంలో గ్రామ సర్పంచ్ యం. నవీన్ ఆధ్వర్యంలో అంగన్వాడి పిల్లలకు అక్షరాభ్యాసం,స్కూల్ యూనిఫాం పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయితీ వార్డు సభ్యులు మోకాళ్ళ హరీష్, నాయకులు మనోహర్ గౌడ్, చేత్రి గణేష్, కల్పగురి ఆనంద్, జిట్టా కృష్ణ, అంగన్వాడీ టీచర్ బుదేవి, ఆయా అమృత, గర్భిణీ స్రీలు పాల్గొన్నారు.

## పలు బాధిత కుటుంబాలను పరామర్శించిన ప్రజా ట్రస్ట్ చైర్మన్



**చట్టం, తానూర్ :** నిర్మల్ జిల్లా తానూర్ మండలం ఎల్వి గ్రామానికి చెందిన సూర్యావంశీ జాంబు పటేల్, అలాగే భైంసా పట్టణానికి చెందిన ఆదిత్య హాస్పిటల్ నిర్వాహకుడు చిప్ప రాము తండ్రి గంగారాం ఇటీవల అనారోగ్య కారణాలతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు, ప్రముఖ వ్యాపారవేత్త, ప్రజా ట్రస్ట్ చైర్మన్ భోస్లె మోహన్ రావు పటిల్ బాధిత కుటుంబాల నివాసాలకు వెళ్లి పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి, మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. వారి కుటుంబ సభ్యుల పరిస్థితిని అడిగి తెలుసుకుని, ఈ క్లిష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కష్టకాలంలో బాధిత కుటుంబాలకు అండగా ఉంటానని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో సుభాష్ జాదవ్, మాజీ ఎంపీపీ ముధోల్, బెల్గాం గ్రామస్థులు, బాధిత కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పకడ్బందీగా యూజీ నీట్2026 పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు




**చట్టం సిద్దిపేట ప్రతినిధి :** జిల్లాలో యూజీ నీట్ 2026 ప్రవేశ పరీక్షను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో పరీక్ష నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 723 మంది, ప్రభుత్వ ఉన్నత పాఠశాల (బాలికలు), అజంపుర కేంద్రంలో 216 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కానుండగా, మొత్తం 939 మంది పరీక్ష రాయనున్నారు. ఈ నెల 21వ తేదీ ఆదివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5:15 గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నారు. అభ్యర్థులను ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు మాత్రమే పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తారు. ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి ఉండదని, అడ్మిట్ కార్డు, పాస్‌పోర్ట్ సైజు ఫోటో, ఒరిజినల్ ఫోటో గుర్తింపు కార్డు, పారదర్శక వాటర్ బాటిల్ మాత్రమే తీసుకురావాలని సూచించారు. పరీక్ష నిర్వహణకు సంబంధించి అవసరమైన అన్ని ఏర్పాట్లు ఇప్పటికే పూర్తి చేసినట్లు తెలిపారు. ప్రతి పరీక్షా కేంద్రంలో చీఫ్ సూపరింటెండెంట్‌తో పాటు సిట్టింగ్ మేజిస్ట్రేట్‌ను నియమించామని, ప్రతి పరీక్షా గదిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, పోలీసు బందోబస్తు కల్పించినట్లు వెల్లడించారు.అభ్యర్థులకు తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు, ఫర్నిచర్ వంటి మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య పరీక్షలను విజయవంతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.సమావేశంలో డీఆర్వో నాగరాజమ్మ, కలెక్టరేట్ ఏవో రాజ్‌కుమార్, పరీక్ష కోఆర్డినేటర్‌తో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఆత్మహత్యకు ప్రయత్నించిన బాసర ట్రిబుల్ ఐటీ విద్యార్థిని

- **విద్యార్థిని ఆత్మహత్యపై కళాశాల అధికారుల గోప్యాత...?**
- **మెరుగైన చికిత్స కోసం నిజాంబాద్ హైదరాబాద్ ఆసుపత్రికి తరలింపు**
- **వరుస ఘటనల పై మండిపడుతున్న పోషకులు స్థానిక ప్రజాప్రతినిధులు వివిధ సంఘ నాయకులు**
- **విద్యార్థిని కు మెరుగైన చికిత్స అందించాలని జిల్లా కలెక్టర్, ఎస్పీ ప్రత్యేక చొరవ**



చట్టం, బాసర : పేద నిరుపేదల గ్రామీణ ప్రాంతాల వారి కోసం సాంకేతిక విద్య అందించాలని సంకల్పంతో గతంలో మాజీ ముఖ్యమంత్రి దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో ఉమ్మడి రాష్ట్రంలోని ఇడుపులపాయ, నూజివీడు, బాసర, లో రాజీవ్ గాంధీ సాంకేతిక పరిజ్ఞాన విశ్వవిద్యాలయం స్థాపించగా విద్యాలయం స్థాపించి దాదాపు పది సంవత్సరాలు దాటిన సంవత్సరంలో ఏదో ఒక ఘటన జరగడం శోషానీయకరం, వినేపథ్యంలో నిర్మల్ జిల్లా బాసర ఆర్జీయూకేటీలో కళాశాలలో చదువుతున్న యూసి మొదటి సంవత్సరం అస్మిత బేగం (17) సంగారెడ్డి జిల్లా మునూరు మండలం చెందిన విద్యార్థిని ఆత్మహత్య ఘటన కలకాలం రేపింది, ఈ నేపథ్యంలో జరిగిన ఘటన బయటకు తెలియకుండా కళాశాల అధికారులు గోప్యత ఉంచడంతో కళాశాల లో చదువుతున్న విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు వివిధ సంఘ నాయకులు స్థానిక ప్రజలు ప్రజాప్రతినిధులు మండిపడుతున్నారు. ఈ సందర్భంగా గత రెండు రోజుల క్రితమే భోజనశాలలు వడ్డించిన అల్పాహారంలో బొద్దింక వచ్చిన తరుణంలో ఇలాంటి ఘటనలు మరొక ముందే గతంలో కూడా ఎన్నో అనేక ఘటనలు జరిగినప్పటికీ అధికారులు కప్పిపుచ్చుకోవడం గోపాయత ఉంచడం ద్వారా పలు అనుమానాలకు తావిస్తోంది. ముందే బాసర ట్రిబుల్ ఐటీ లో మీడియా పట్ల అంశాలు ఉండడంతో ఎలాంటి ఫోటోలు కళాశాలలో జరుగుతున్న సంఘటనలపై బయటకు వెళ్లకుండా చూస్తున్న కళాశాల అధికారులు బుధవారం జరిగిన ఘటనపై మళ్లీ అదే తంతు పాటించడంతో కొందరు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆత్మహత్యకు పాల్పడిన విద్యార్థిని, కళాశాలలో తరగతికి వెళ్లకుండా వసతి గృహం లోనే ఉన్నట్లు సమాచారం గతంలో కూడా చున్నీతో ఆత్మహత్యకు పాల్పడుతుండగా గమనించిన స్థానికులు కాపాడినట్లు సమాచారం. ట్రిబుల్ ఐటీ లో కౌన్సిలింగ్కు వచ్చిన తమ స్నేహితురాలితో మాట్లాడుతూ విద్యార్థిని ఆందోళనలో ఉండడంతో, అంతేకాకుండా మధ్యాహ్నం భోజనం చేయకుండా గంగ బాలికల వసతి గృహంలో వెళ్లి నాలుగో అంతస్తు పై నుండి దూకడంతో ఆత్మహత్యకు ప్రయత్నించిన విద్యార్థిని కు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం నిజామాబాద్ ఆసుపత్రికి తరలించగా అక్కడ మధ్య రాత్రి వరకు చికిత్స నిర్వహించగా నొప్పులు బాగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ నేమ్స్ ఆసుపత్రికి తరలించారు. అనంతరం అధికారులు వారి తల్లిదండ్రులను సమాచారం చరదీసినట్లు సమాచారం, ఈ నేపథ్యంలో బాసర ట్రిబుల్ ఐటీ లో జరిగిన ఘటనపై నిర్మల్ జిల్లా కలెక్టర్ భావేష్ మిశ్రా తో పాటు జిల్లా ఎస్పీ డాక్టర్ జానకి షర్మిల రాష్ట్ర ఉన్నత విద్య శాఖ అధికారుల తో మాట్లాడి విద్యార్థినికి మెరుగైన చికిత్స అందించాలని ప్రత్యేక చొరవ చూపించారు. దీనితో ప్రస్తుతం విద్యార్థిని యొక్క పరిస్థితి వేరుగా ఉందని కళాశాల వర్గీయుల సమాచారం మేరకు త్వరలోనే ఆమె కోలుకోవాలని అనంతరం పూర్తి విషయాలు వెల్లడించడం జరుగుతుందని ట్రిబుల్ ఐటీ కళాశాలకు చెందిన అధికారులు వెల్లడించారు.

## ప్రతి ఒక్కరూ బాధ్యతయుతంగా మొక్కలు నాటాలి

- **జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా.**



చట్టం, నిర్మల్ ప్రతినిధి : వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా ప్రజలంతా బాధ్యతగా మొక్కలు నాటాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు. జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా గురువారం వనమహోత్సవం కార్యక్రమం ప్రారంభోత్సవ కార్యక్రమంలో భాగంగా మామడ మండలం లింగాపూర్ తండాలో నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ పలువురు అధికారులు, విద్యార్థులతో కలిసి సామూహికంగా మొక్కలు నాటారు. కలెక్టర్ మాట్లాడుతూ... వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా ప్రజలంతా విరివిగా మొక్కలు నాటాలన్నారు. మొక్కలు నాటి పర్యావరణ సమతుల్యతను కాపాడే ఈ మహా కార్యక్రమంలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. మొక్కలను నాటడమే కాకుండా వాటి సంరక్షణ బాధ్యత కూడా తీసుకోవాలని వివరించారు. అంతకుముందు, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గుర్రంగూడా ఈకో పార్కును ప్రారంభం చేసి వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటిన కార్యక్రమాన్ని, మామడ మండల కేంద్రంలోని రైతు వేదికలో కలెక్టర్ అధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వీక్షించారు. ఈ కార్యక్రమంలో డిఎఫ్ఓ సుశాంత్ సుఖదేవ్ బోబడే, డిఆర్డిఓ విజయలక్ష్మి, తహసిల్దార్ శ్రీనివాస్, రైతులు, విద్యార్థులు, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## భైంసాలో యోగ ప్రాముఖ్యతపై అవగాహన

- **నిత్య యోగతో ఆరోగ్యవంతమైన జీవనం సాధ్యమని సూచన**



**చట్టం, భైంసా :** నిర్మల్ జిల్లా భైంసా పట్టణంలోని స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం యోగపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. యోగ టీచర్ రాటి పోతన్న ముధోల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి భోస్లే నారాయణరావు పటేల్‌ను కలిసి యోగ వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలను వివరించారు. ఈ సందర్భంగా నారాయణరావు పటేల్ మాట్లాడుతూ, తాను 67 ఏళ్ల వయస్సులోనూ ప్రతి రోజూ ఉదయం 5 గంటల నుంచి 6 గంటల వరకు యోగ సాధన చేస్తున్నానని తెలిపారు. యోగను నిత్య జీవితంలో భాగం చేసుకోవడం వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు ఆయుష్షు పెరుగుతుందని చెప్పారు. ప్రతి వ్యక్తి యోగను అలవాటు చేసుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన, ఆనందకరమైన జీవితాన్ని గడపవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బషీరుద్దీన్, కుబీర్ మండల సీనియర్ నాయకులు బంక బాబు, జాదవ్ విశాల్, కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ పి. శివాజీతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

## గుడిసెల్లో నివసించే నిరుపేదలకే తొలి ప్రాధాన్యత – ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు



**చట్టం జుక్కల్;** కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలు, నిర్మాణ పనుల పురోగతిపై అదనపు కలెక్టర్ నిమ్మ వి. గిరి మరియు సంబంధిత అధికారులతో కలిసి జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, లబ్ధిదారులు తమ ఇల్లు నిర్మాణ దశకు అనుగుణంగా డేటా సక్రమంగా అప్‌డేట్ అయ్యిందో లేదో అధికారుల ద్వారా పరిశీలించుకోవాలని సూచించారు. నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి అయ్యేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. అలాగే గుడిసెల్లో నివసిస్తున్న నిరుపేద కుటుంబాలకు ఇందిరమ్మ గృహ పథకంలో తొలి ప్రాధాన్యత కల్పించాలని అధికారులను ఆదేశించారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు చేరేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

## విట్టోలి గ్రామంలో నూతన గ్రామ పంచాయతీ భవనం, ఇందిరమ్మ ఇళ్లు ప్రారంభం



**చట్టం, ముధోల్ :** నిర్మల్ జిల్లా ముధోల్ మండలంలోని విట్టోలి గ్రామంలో గురువారం నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని ముధోల్ శాసనసభ్యులు పవార్ రామారావు పటేల్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గ్రామాల అభివృద్ధికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, గ్రామ ప్రజలకు అవసరమైన పరిపాలనా సేవలను మరింత సమర్థవంతంగా అందించేందుకు నూతన పంచాయతీ భవనం ఉపయోగపడుతుందని అన్నారు. అనంతరం గ్రామంలో నిర్మించిన నూతన ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. లబ్ధిదారుల ఇళ్లను సందర్శించి వారికి శుభాకాంక్షలు తెలిపారు. సొంత ఇంటి కల నెరవేరడం ప్రతి కుటుంబానికి ఆనందదాయకమైన విషయమని పేర్కొంటూ, పేద కుటుంబాల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న గృహ నిర్మాణ పథకాలు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని చెప్పారు. ఈ సందర్భంగా గ్రామాభివృద్ధి, మౌలిక సదుపాయాల విస్తరణ, సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, మండల నాయకులు, గ్రామ పెద్దలు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఘనంగా నరేంద్ర మోదీ సుపరిపాలన దినోత్సవం



**చట్టం సిద్దిపేట ప్రతినిధి :** నరేంద్ర మోడీ 12 సంవత్సరాల సుపరిపాలన దినోత్సవం కార్యక్రమాల్లో భాగంగా గురువారం రోజున సిద్దిపేట పట్టణంలోని మహిళలకు. ఆయిల్ మరియు గ్యాస్ లేకుండా మహిళలచే వినూత్నంగా వంటల పోటీల కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు సమాజంలో ఆరోగ్యకరమైన వంటలు భావితరాలకు అందించడమే ఈ పోటీలకి ముఖ్య ఉద్దేశం అని భారతీయ జనతా పార్టీ సెక్రెటరీ పద్మ గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా మోర్చా నాయకురాలు ఇర్రి ఉమా రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు . జిల్లా నాయకురాలు కంది విజయ వనజ వర్మ వినోద శారద తదితరులు పాల్గొన్నారు కార్యక్రమం అనంతరం బహుమతులు ఇవ్వడం జరిగింది.

## విజ్మోని 37 వ బ్రాంచ్ ప్రారంభం

- **ప్రారంభించిన మేనేజర్ టి. శ్రీనివాస్ రెడ్డి**



**చట్టం, శంషాబాద్ :** శంషాబాద్‌లో విజ్మోని సంస్థ తన విస్తరణలో మరో మైలురాయిని చేరుకుంది. దేశవ్యాప్తంగా ఆర్థిక, ట్రావెల్ సేవలను అందిస్తున్న విజ్మోని సంస్థ 37వ బ్రాంచ్‌ను శంషాబాద్‌లో ఘనంగా ప్రారంభించింది. ఈ కొత్త బ్రాంచ్‌ను ఏపీతెలంగాణ జోనల్ మేనేజర్ టి. శ్రీనివాస్ రెడ్డి రీజినల్ హెడ్ రాజుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వినియోగదారులకు ఒకే చోట గోల్డ్ లోన్, ఫారిన్ కరెన్సీ ఎక్స్చేంజ్, ట్రావెల్ కార్డులు, విదేశాలకు నగదు పంపిణీ, ట్రావెల్ & హాలిడే ప్యాకేజీలు, మనీ ట్రాన్స్‌ఫర్, యుటిలిటీ పేమెంట్స్, ఇన్సూరెన్స్ సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. కస్టమర్ల సంతృప్తి పరదర్శకత వంటి వేగమంతమైన సేవలు వీజ్మోని ద్వారా కస్టమర్లకు విదేశీ కరెన్సీ మార్పిడి విదేశాలకు డబ్బు పంపే సౌకర్యం ఉన్నత విద్య కోసం విద్యార్థులకు లోన్ సౌకర్యం ఫారెక్స్ ట్రావెల్ కార్డ్స్ సేవలు హాలిడే ప్యాకేజీలు బంగారం పై అతి తక్కువ వడ్డీ తక్కువ వడ్డీతో రుణాలు వంటి సేవలు అందిస్తుందని అన్నారు. శంషాబాద్ ప్రాంత ప్రజలకు నాణ్యమైన, వేగవంతమైన సేవలు అందించడమే లక్ష్యమని సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో భాగంగా తొండు పల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్ బుక్స్, వాటర్ ప్యూరిఫైయర్ పంపిణీ చేశారు. బ్రాంచ్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో రీజనల్ హెడ్ రాజు, స్థానిక ప్రముఖులు, వ్యాపారవేత్తలు, సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రైవేట్ విద్యా సంస్థలో ఫీజుల దోపిడీని అరికట్టాలి

**చట్టం భూపాలపల్లి ప్రతినిధి :** ప్రయివేటు విద్యాసంస్థలు, స్కూల్స్ యాజమాన్యాలు విద్యార్థుల నుండి అధిక ఫీజులు వసూలు చేస్తున్న దోపిడీని అరికట్టాలని తెలంగాణ సామాజిక రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కామిడి సతీష్ రెడ్డి డిమాండ్ చేశారు. స్థానికంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర, ఆయా జిల్లాలలో ప్రైవేటు విద్యా సంస్థల ఆగడాలను అరికట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. ఆయా ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలు పట్టించుకోకుండా ఇష్టానుసారంగా విద్య సంస్థల ను నిర్వహిస్తున్న వారిని అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అధికారులు విద్యాసంస్థల యాజమాన్యం కుమ్మక్కై ప్రైవేట్ విద్యా సంస్థల పైన తనిఖీలు,దాడులు చేయడం లేదని ఆరోపించారు. ప్రైవేట్ స్కూళ్లలో పాఠ్యపుస్తకాలు టై, బెల్టులు, డ్రెస్సులు విచ్చలవిడిగా అమ్ముతూ వివిధ రకాల ఫీజుల పేరు తోటి విద్యార్థులను, తల్లిదండ్రులను మోసం చేస్తున్నారని అన్నారు. ఈ స్కూల్స్ యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలను పట్టించుకోకుండా రాష్ట్ర ప్రభుత్వ సిలబస్ ను అమలు చేయడం లేదన్నారు . ప్రైవేట్ పాఠశాలల్లో సొంత సిరీస్ పాఠ్యపుస్తకాలను ముద్రించి, ఆ పాఠ్యపుస్తకాలు ఎక్కడ కూడా దొరకకుండా చేసి అధిక ధరలకు అమ్ముతూ వేల రూపాయలు దోచుకుంటున్నారన్నారు. విద్యను వ్యాపారంగా మార్చేసి అధిక ఫీజులను వసూలు చేస్తున్నారని స్కూళ్లకు సరైన గ్రౌండ్,సరైన మూత్రశాలు, మరుగుదొడ్లు లేక విద్యార్థుల అవస్థలు పడుతున్న విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడంలేదని అన్నారు. ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు బుక్ స్టాల్ షాప్ ల తోటి కుమ్మక్కై పర్సంటేజ్ లతో పుస్తకాలు అమ్ముతున్నారన్నారు. అక్రమ పుస్తకాల అమ్మకాలను నిలిపివేయాలని కోరారు.

CHATTAM NEWS

చట్టం
సంపూర్ణ స్వతంత్ర వార్తా పత్రిక

# సమాచార హక్కు చట్టం గ్రామ కమిటీ ఎన్నిక



**చట్టం భూపాల్ పల్లి ప్రతినిధి :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం ఇప్పలపల్లి గ్రామంలో సమాచార హక్కు చట్టం గ్రామ కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా నిర్వహించారు. గ్రామ కన్వీనర్ గా గడ్డం రమేష్, కోకన్వీనర్ గా గుర్రపు రాములను ఎన్నుకున్నారు. గ్రామ కార్యవర్గ సభ్యులుగా దూడపాక శ్రీధర్, దూడపాక కృష్ణ, దూడపాక రాములు, గడ్డం శ్రీనివాస్, దూడపాక శంకర్, కిరణ్ కుమార్, దూడపాక రాజబాబు, కుమార్, వరుణ్, సందీప్, చిరంజీవి, సదానందం, రాహుల్, గొమ్మల రాజేందర్, నరేందర్, రమేష్, దూడపాక అజయ్ లను నియమించినట్లు మండల కన్వీనర్ బండారు కుమార్ యాదవ్, మండల కమిటీ సభ్యుడు దూడపాక రాజేష్ తెలిపారు. ఈ సందర్భంగా మాజీ గ్రామ కన్వీనర్ గడ్డం రమేష్ మాట్లాడుతూ, సమాచార హక్కు చట్టం ప్రజల చేతుల్లో అవినీతిని ప్రశ్నించే శక్తివంతమైన ఆయుధమని అన్నారు. గ్రామీణ స్థాయిలో సమాచార హక్కు చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించి, చట్టాన్ని బలోపేతం చేయడానికి కృషి చేస్తానని తెలిపారు. తనపై విశ్వాసం ఉంచి గ్రామ కన్వీనర్ గా ఎన్నుకున్న మండల కన్వీనర్ తో పాటు మండల కమిటీ సభ్యులందరికీ రమేష్ కృతజ్ఞతలు తెలిపారు.

# వనమహోత్సవంలో మొక్కలు నాటిన జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ




**చట్టం - వికారాబాద్ ప్రతినిధి :** వికారాబాద్ జిల్లా అనంతగిరి మండలంలోని గట్టొండాపూర్ రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతంలో వన మహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లాలో పర్యావరణ పరిరక్షణ, హరితాభివృద్ధి లక్ష్యంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దీపక్ తివారి, జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, మున్సిపల్ చైర్పర్సన్ గడ్డం అనన్య, అదనపు కలెక్టర్ వెంకటాచారి, ట్రైనీ కలెక్టర్ సదన్ బస్వరాజ్ గుట్టూర్ పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని పెంచి పెద్ద చెట్లుగా తీర్చిదిద్దితే భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించవచ్చని తెలిపారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, పచ్చదనం పెంపొందించడం ద్వారా పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించడంతో పాటు ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని సాధించవచ్చన్నారు. ప్రతి పౌరుడు కనీసం ఒక మొక్కను నాటి దాని సంరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, విద్యార్థులు కలిసి మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖ అధికారులు, శ్యాం, పశుసంవర్ధక శాఖ అధికారి సదానందం, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# మహాదేవ్ తండాలో నీటి సమస్యకు పరిష్కారం.. బోరు మంజూరు



**చట్టం, కుంటాల :** నిర్మల్ జిల్లా కుంటాల మండలంలోని మేధాన్‌పూర్ గ్రామ అనుబంధ గ్రామమైన మహాదేవ్ తండాలో నెలకొన్న తాగునీటి సమస్యకు పరిష్కారం లభించింది. ఇటీవల గ్రామస్తులు నీటి ఎద్దడి తీవ్రంగా ఉందని ముధోల్ మాజీ ఎమ్మెల్యే విట్టల్ రెడ్డికి వివరించారు. దీంతో విట్టల్ రెడ్డి సమస్యను ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు దృష్టికి తీసుకెళ్లగా, స్పందించిన ప్రభుత్వం మహాదేవ్ తండాకు బోరు మంజూరు చేసింది. బోరు మంజూరుతో గ్రామంలోని తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, మాజీ ఎమ్మెల్యే విట్టల్ రెడ్డికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పద్మా రాజన్న, ఉపసర్పంచ్ కళ్యాణ్, రామారావు, మాజీ సర్పంచ్ మోర్ చంద్రకాంత్, వార్డ్ సభ్యురాలు రాథోడ్ సమిత్రాబాయి, రాథోడ్ రోహిదాస్, జాదవ్ పరమేశ్వర్, జాదవ్ ఇందల్, రాథోడ్ గణపతి, జాదవ్ ప్రకాష్, రాథోడ్ ప్రకాష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సిందే వెంకటరావు, కార్యం భీమన్న, సాయినాథ్, సయ్యద్ అబ్దుల్ షా తదితరులు పాల్గొన్నారు.

# వివాహ వేడుకలలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు



**చట్టం న్యూస్, వేములవాడ రూరల్ :** వేములవాడ పట్టణ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు పలు శుభకార్యాలలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. వేములవాడ మున్సిపాల్ లో విలీన గ్రామమైన కొనయపల్లికి చెందిన గుమ్మడి రాజేశం గౌడ్ కుమారుడి వివాహ వేడుకలో చైర్మన్ పుల్కం రాజు పాల్గొని వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే వేములవాడ మున్సిపాల్ 15 వ వార్డ్ కు చెందిన సకినాల అంజయ్య కుమార్తె నిశ్చితార్థ వేడుకలో పాల్గొన్న చైర్మన్ పుల్కం రాజు, నూతన జంటకు శుభాకాంక్షలు తెలియజేసి వారి భవిష్యత్ జీవితం ఆనందమయంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాల్లో కౌన్సిలర్ కొక్కుల బాలకృష్ణ, ఇందిరమ్మ కమిటీ సభ్యులు చేకూర్తి రమేష్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.


# లారీ ఢీకొని వ్యక్తి మృతి



**చట్టం మెదక్ ప్రతినిధి :** మెదక్ జిల్లా చిన్న శంకరంపేట్ మండలం చందంపేట గ్రామానికి చెందిన షేక్ ఎల్లం (33), కూలీ, రామంతాపూర్ గ్రామానికి చెందిన రెడ్డబోయిన ఆంజనేయులుతో కలిసి బైక్‌పై చేగుంట నుంచి రామంతాపూర్‌కు వెళ్తున్నాడు. ఈ క్రమంలో గురువారం మధ్యాహ్నం సుమారు 12 గంటల సమయంలో రామంతాపూర్ గ్రామ చౌరస్తా వద్ద హైదరాబాద్ నుంచి నిజామాబాద్ వైపు వెళ్తున్న లారీ బైక్‌ను ఢీకొట్టింది. ప్రమాదంలో లారీ ముందు టైరు షేక్ ఎల్లం కడుపుపై నుంచి వెళ్లడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ప్రమాదంలో రెడ్డబోయిన ఆంజనేయులుకు స్వల్ప గాయాలైనట్లు సమాచారం. మృతుడి సోదరుడు షేక్ సిద్ధిరాములు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, చేగుంట ఎస్సై దర్యాప్తు చేపట్టారు.

# మాసాయిపేట మండల కేంద్రంలో ప్రభుత్వ స్థలాలు అక్రమన

- **ఎన్ హెచ్ 44 రోడ్డు పక్కల గల ప్రభుత్వ భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి**



**చట్టం మెదక్ ప్రతినిధి :** మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గంలోని మాసాయిపేట మండల కేంద్రంలో విలువైన ప్రభుత్వ భూమిని కొందరు కబ్జా చేస్తున్నారని ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో మాసాయిపేట మండల కేంద్రంలోని విలువైన భూమిని కాపాడాలని ప్రభుత్వ భూమిని ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని విలువైన ప్రభుత్వ భూమిని కాపాడి ప్రభుత్వ కార్యాలయ కు మునుముందు అవసరం ఉన్నందున ప్రభుత్వ భూమిని తక్షణమే అధికారులు స్వాధీనం చేసుకొని ప్రభుత్వం స్థలంలో బోర్డులు ఏర్పాటు చేయాల్సిందిగా గ్రామస్తులు తెలిపారు. మాసాయిపేట మండల కేంద్రంలో ఎన్ హెచ్ 44 ఆనుకొని ఎక్కడెక్కడ ప్రభుత్వ భూమి ఉన్నా గుర్తించాలని గుర్తించిన వెంటనే విలువైన ప్రభుత్వ స్థలాలను కాపాడాలని కోరారు. ఈ విషయంపై స్థానిక నాసాయిపేట్ తహసిల్దార్ జ్ఞాన జ్యోతి ఇప్పటివరకు మా దృష్టికి రాలేదని ప్రభుత్వ భూములు ఎక్కడున్నా వాటిని కబ్జా చేసే అధికారం ఎవరికి లేదని ప్రభుత్వ భూములను గుర్తించి వాటిలలో బోర్డులు ఏర్పాటు చేస్తామని తెలిపారు.

# విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందజేత




**చట్టం ఆర్మూర్:** నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ నియోజకవర్గంలోని డొంకేశ్వర్ మండలం నూత్పల్లి గ్రామ ఉన్నత పాఠశాలలో గురువారం రోజు గ్రామ సర్పంచ్ రాజారెడ్డి, ఎమ్ఈఓ రామకృష్ణ, ఆధ్వర్యంలో ఉన్నత పాఠశాల విద్యార్థులకు, ప్రైమరీ పాఠశాల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పురుషోత్తం రెడ్డి, వార్డు సభ్యులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి

- **కలెక్టర్ ప్రతిమా సింగ్**



**చట్టం, మెదక్ ప్రతినిధి :** పారదర్శక ఓటరు జాబితా రూపొందించేందుకు ఎన్నికల సంఘం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను ఎలాంటి తప్పిదాలకు తావు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ సూచించారు. ఈ నెల 25 నుంచి ప్రారంభం కానున్న ఎస్ఐఆర్ సర్వేను పురస్కరించుకుని మెదక్ జిల్లా పాపన్నపేట మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో బూత్ లెవెల్ అధికారులు (బీఎల్ఓలు), బీఎల్ఏలు, బీఎల్ఓ సూపర్వైజర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. శిక్షణలో భాగంగా ఎస్ఐఆర్ సర్వే నిర్వహణ విధానం, పరిశీలించాల్సిన అంశాలు, ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, అనుసరించాల్సిన నిబంధనలపై మాస్టర్ ట్రైనర్లు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ నెల 25 నుంచి జూలై 24 వరకు బీఎల్ఓలు ప్రతి ఇంటిని సందర్శించి ఓటరు మ్యాపింగ్‌ను పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సర్వేలో పాల్గొనే బీఎల్ఓలకు ఆ కాలంలో శాఖలకు సంబంధించిన దైనందిన విధుల నుంచి మినహాయింపు కల్పించినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకుని పూర్తిస్థాయిలో ఎస్ఐఆర్ ప్రక్రియపైనే దృష్టి సారించాలని సూచించారు. ఓటరు వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని, ఓటరు జాబితాలో పేర్లు ఉన్నవారు శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లారా, మృతి చెందారా, రెండు చోట్ల పేర్లు నమోదయ్యాయా అనే అంశాలను నిశితంగా పరిశీలించాలని సూచించారు. సర్వే ఆధారంగానే తుది ఓటరు జాబితా రూపొందించనున్నందున పొరపాట్లకు ఆస్కారం లేకుండా జాగ్రత్తగా సర్వే నిర్వహించాలని తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, సందేహాలు ఉంటే శిక్షణలోనే నివృత్తి చేసుకోవాలని సూచించారు. ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలో ఒక్క ఓటరు కూడా మిస్ కాకుండా చూడాలని, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, ఇతర వీఐపీల మ్యాపింగ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. ఓటీపీని ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులకు వెల్లడించకూడదని, అలా చేయడం నేరంగా పరిగణించబడుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో మెదక్ ఆర్డీవో రమాదేవి, సంబంధిత అధికారులు, బూత్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# బాసర ఆలయ అభివృద్ధి పనులు వేగవంతం

- **జూలై 5న బాలాలయం ఏర్పాటు**
- **2027 జూన్ 1 నాటికి ప్రధాన ఆలయం పూర్తి లక్ష్యం**



**చట్టం, బాసర :** దక్షిణ భారతదేశంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన బాసర జ్ఞాన సరస్వతి ఆలయ అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయి. ఆలయ పునర్నిర్మాణం, అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని రాష్ట్ర దేవదాయ శాఖ స్థపతి నిపుణుల బృందం గురువారం పరిశీలించింది. బృందంలోని మోతిలాల్, మాధవి ఆలయ నిర్మాణ పనులను సమీక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు. జూలై 5న నిర్వహించనున్న బాలాలయం ఏర్పాట్ల నేపథ్యంలో ప్రస్తుతం భక్తులకు అందుబాటులో ఉన్న రూ.150 అక్షరాభ్యాస మండపాన్ని పరిశీలించారు. ఇదే మండపంలో బాలాలయం ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. అలాగే రూ.1,000 ప్రత్యేక అక్షరాభ్యాస కార్యక్రమాలు కూడా ఇదే ప్రాంగణంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ధ్యాన మందిరంలో అక్షరాభ్యాస కార్యక్రమాలు యథావిధిగా కొనసాగనున్నాయని వెల్లడించారు. జూలై 2, 3 తేదీల్లో శృంగేరి పీఠం శిష్యుల ఆధ్వర్యంలో అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు, వైదిక కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ కార్యక్రమాలు బాలాలయం ఏర్పాటుకు ఆధ్యాత్మిక ప్రాధాన్యతను చేకూర్చనున్నాయి. ఆలయ నిర్మాణ పనులను చేపట్టిన కాంట్రాక్టర్ 2027 జూన్ 1 నాటికి ప్రధాన ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుని పనులను వేగవంతం చేసినట్లు సమాచారం. ఆలయ నిర్మాణంతో పాటు పరిసర ప్రాంతాల అభివృద్ధి, భక్తులకు ఆధునిక సౌకర్యాల కల్పన, ఆధ్యాత్మిక వాతావరణాన్ని మరింత మెరుగుపరిచే దిశగా పనులు కొనసాగుతున్నాయి. సంప్రదాయ శిల్పకళా వైభవాన్ని ప్రతిబింబించేలా, ఆధునిక సౌకర్యాలతో ఆలయాన్ని తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. పనులు పూర్తయిన అనంతరం బాసర క్షేత్రం దేశవ్యాప్తంగా మరింత ఆకర్షణీయమైన ఆధ్యాత్మిక కేంద్రంగా నిలుస్తుందని అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ సందర్భంగా ఆలయానికి చేరుకున్న స్థపతి నిపుణుల బృందానికి ఆలయ అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక కుంకుమార్చన, మహా మంగళహారతి నిర్వహించి తీర్థ ప్రసాదం, లడ్డూ ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో కార్యనిర్వహణాధికారి అంజన దేవి, ఏఈఓ గంగ శ్రీనివాస్, సూపరింటెండెంట్ శివరాజ్, సంజీవరావు, రాజేందర్, సాయిలు, నారాయణ పటేల్, వాగ్దేవి సొసైటీ సిబ్బంది, భద్రతా సిబ్బంది పాల్గొన్నారు.

# తొలిమెట్టు కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలి: జిల్లా కలెక్టర్



**చట్టం, పెద్దపల్లి :** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థి చదవడం, రాయడం, ప్రాథమిక గణితంలో కనీస నైపుణ్యాలు సాధించేలా లక్ష్యబద్ధంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో విద్యాశాఖ కాంప్లెక్స్ హెచ్ఎంలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో విద్యా కార్యక్రమాల అమలుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన విద్యా సంవత్సరంలో ఉపాధ్యాయులకు అవసరమైన శిక్షణ అందించి, ఎఫ్ఎల్ఎన్ (FLN) "తొలిమెట్టు" కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక దృష్టి సారిస్తూ పిల్లల్లో ప్రాథమిక నైపుణ్యాల అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. 2026-27 విద్యా సంవత్సరానికి ప్రతి కాంప్లెక్స్‌కు, ప్రతి పాఠశాలకు స్పష్టమైన లక్ష్యాలు నిర్దేశించి వాటి సాధన కోసం ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని ఆదేశించారు. పాఠశాలల్లో ఎదురయ్యే సమస్యలను వెంటనే గుర్తించి పరిష్కరించాలని, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు ఒక బృందంగా పనిచేసి గత విద్యా సంవత్సరానికంటే మెరుగైన ఫలితాలు సాధించాలని సూచించారు. విద్యా సంవత్సరం మొత్తం ఇదే ఉత్సాహంతో పనిచేస్తూ జిల్లాకు మరింత మంచి ఫలితాలు తీసుకురావాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల విద్యాభివృద్ధిని ఉపాధ్యాయులు తమ బాధ్యతగా స్వీకరించాలని, పాఠశాలల్లో ఎదురయ్యే సమస్యలను ప్రాధాన్యతతో పరిష్కరిస్తామని తెలిపారు. అవసరమైతే కాంప్లెక్స్ స్థాయిలో వర్క్ అడ్జస్ట్మెంట్ చేసుకుని సంబంధిత జిల్లా అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి జి. శారద, అకడమిక్ అధికారి పి.ఎం. షేక్, విద్యాశాఖ అధికారులు, కాంప్లెక్స్ హెచ్ఎంలు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ మ్యాపింగ్‌కు రాజకీయ పార్టీల BLAల సహకారం కీలకం

- **బూత్ లెవెల్ ఏజెంట్ల జాబితాలు వెంటనే సమర్పించాలి**
- **అశ్వారావుపేట నియోజకవర్గ సహాయ ఎన్నికల అధికారి**




**చట్టం అశ్వారావుపేట :** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) మ్యాపింగ్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయడానికి రాజకీయ పార్టీల బూత్ లెవెల్ ఏజెంట్లు (BLAలు) పూర్తి సహకారం అందించాలని అశ్వారావుపేట నియోజకవర్గ సహాయ ఎన్నికల అధికారి కోరారు. గురువారం రైతు వేదికలో ఎస్ఐఆర్ ప్రక్రియపై బీఎల్‌వోలు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల BLAలతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జిల్లాలో చేపట్టనున్న ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియను పారదర్శకంగా, ఖచ్చితంగా నిర్వహించేందుకు ఇప్పటివరకు సమర్పించని బూత్ లెవెల్ ఏజెంట్ల జాబితాలను వెంటనే అందజేయాలని సూచించారు. బీఎల్‌వోలు చేపట్టనున్న ఇంటింటి సర్వే కార్యక్రమానికి రాజకీయ పార్టీల BLAల సహకారం అత్యంత అవసరమని తెలిపారు. జూన్ 25, 2026 నుంచి బీఎల్‌వోలు ఇంటింటి సర్వే నిర్వహించి ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేస్తారని, ప్రతి ఓటరు ఇంటిని కనీసం ఒక్కసారి సందర్శించి అవసరమైతే మూడు సార్లు వరకు వెళ్లి ఫారాలను సేకరిస్తారని వివరించారు. డేటా మ్యాపింగ్‌లో అశ్వారావుపేట నియోజకవర్గం 91.58 శాతం సాధించి రాష్ట్రంలో తొలి స్థానంలో నిలిచిందని వెల్లడించారు. ఎన్యూమరేషన్ ఫారాల సేకరణ ప్రక్రియ జూన్ 25 నుంచి జూలై 24, 2026 వరకు కొనసాగుతుందని తెలిపారు. అనంతరం జూలై 31న ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేసి, జూలై 31 నుంచి ఆగస్టు 30 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాలు స్వీకరిస్తామని చెప్పారు. అక్టోబర్ 1, 2026న తుది ఓటరు జాబితా ప్రచురిస్తామని తెలిపారు. చిరునామా మార్పులు, ఇతర సవరణల కోసం ఫారం 8 ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తామని వెల్లడించారు. ఓటర్లు తమ పేరు ఎస్ఐఆర్ 2002 జాబితాలో ఉందో లేదో తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి అధికారిక వెబ్‌సైట్ లేదా ఈసీఐ ఓటర్స్ పోర్టల్‌లో "Search by Elector Details" ద్వారా తెలుసుకోవచ్చని సూచించారు. ఆధార్ నంబర్ సమర్పణ పూర్తిగా ఐచ్ఛికమని స్పష్టం చేశారు. 18 సంవత్సరాలు పూర్తిచేసుకున్న వారు ఫారం 6 ద్వారా కొత్త ఓటరుగా నమోదు చేసుకోవచ్చని, 2026 అక్టోబర్ 1 నాటికి 18 సంవత్సరాలు పూర్తిచేసుకునే వారికి కూడా అవకాశం ఉంటుందని తెలిపారు. ఫారాల నింపడం, వివరాల ధృవీకరణకు బీఎల్‌వోలు, 1950 హెల్ప్‌లైన్, ఈసీఐ ఓటర్స్ పోర్టల్, "Book a Call with BLO" సేవలను వినియోగించుకోవాలని సూచించారు. విదేశాలు లేదా ఇతర రాష్ట్రాల్లో ఉద్యోగాలు చేస్తున్న ఓటర్ల తరపున కుటుంబంలోని పెద్ద సభ్యుడు ఫారం నింపి బీఎల్‌వోకు అందజేయవచ్చని తెలిపారు. అనంతరం ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రాముఖ్యత, ఎన్యూమరేషన్ ఫారాల నింపే విధానంపై ట్రైనింగ్ మాస్టర్లు ఉపేందర్ రెడ్డి, శంకర్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ సయ్యద్ హుస్సేన్, బీఎల్‌వో సూపర్‌వైజర్లు కృష్ణ, పద్మావతి, రాము, జయరాం, రమేష్, సీనియర్ అసిస్టెంట్ లక్ష్మయ్య, ఆపరేటర్ సమీర్ హుస్సేన్, బీఎల్‌వోలు, బూత్ లెవెల్ ఏజెంట్లు (BLAలు) పాల్గొన్నారు.

# మహిళా డ్వాక్రా భవనం ప్రారంభం

- **ప్రారంభించిన ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి**



**చట్టం పోతంగల్ /కోటగిరి:** నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండల కేంద్రంలోని కల్లూరు గ్రామంలో మొట్టమొదటగా డ్వాక్రా మహిళా భవనం కల్లూరు గ్రామంలో ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ శాసన సభాపతి వ్యవసాయ సలహాదారులు పోచారం శ్రీనివాస్ రెడ్డి హాజరై, శిలాఫలకాన్ని ఆవిష్కరించి భవనాన్ని ప్రారంభించారు. దీంతో సభలో పోచారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ నిజామాబాద్ జిల్లాలోనే కల్లూరు గ్రామంలో మొదటి డ్వాక్రా మహిళా భవనాన్ని ప్రారంభించడం ఎంతో సంతోషాన్ని కలిగిస్తోంది. ఇది కేవలం భవనం మాత్రమే కాదు, మహిళల ఆత్మవిశ్వాసానికి వారి ఆర్థిక స్వతంత్రతకు కేంద్రబిందువు అని అన్నారు. ప్రభుత్వం మహిళా సంఘాలను కేవలం పొదుపుకే పరిమితం చేయకుండా వారు ఆర్థికంగా ఎదిగేందుకు వ్యాపార రంగంలో రాణించేందుకు కృషి చేస్తోందని ఆయన సూచించారు. ఇటువంటి భవనాలు మహిళలకు సమావేశాలు నిర్వహించుకోవడానికి వారి ఉత్పత్తులను ప్రదర్శించుకోవడానికి మరియు సమష్టిగా నిర్ణయాలు తీసుకోవడానికి ఎంతో దోహదపడతాయని ఆయన అభిప్రాయపడ్డారు. గ్రామీణ ప్రాంతాల్లో డ్వాక్రా మహిళలు ఆర్థికంగా బలోపేతం అయినప్పుడే ఆ కుటుంబాలు, తద్వారా సమాజం అభివృద్ధి చెందుతుందని పోచారం పేర్కొన్నారు. కల్లూరు మహిళలు చూపిన చొరవ మిగతా గ్రామాలకు ఆదర్శంగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు. భవిష్యత్తులో కూడా మహిళల సంక్షేమం కోసం, వారి స్వయం ఉపాధి కోసం నిరంతరం కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, మండల అధికారులు, మహిళా సంఘాల సభ్యులు మరియు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాలపై ప్రజలను అప్రమత్తం చేయాలి

- **గస్తీ, నాకాబందీలతో నేర నియంత్రణకు చర్యలు**
- **స్టేషన్ తనిఖీలో పెండింగ్ కేసులపై ఆరా**
- **జిల్లా ఎస్పీ డి.వి శ్రీనివాసరావు**



**చట్టం మెదక్ ప్రతినిధి :** జిల్లాలో పెండింగ్‌లో ఉన్న కేసులను వేగంగా పరిష్కరించాలని, నేర నియంత్రణకు గస్తీ, నాకాబందీలను మరింత ముమ్మరం చేయాలని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఐపీఎస్ అధికారులను ఆదేశించారు. గురువారం రామాయంపేట పోలీస్ స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేసిన ఆయన స్టేషన్‌లోని రికార్డులు, పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతి, సిబ్బంది విధుల నిర్వహణ, స్టేషన్ నిర్వహణ,తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా దర్యాప్తులో ఉన్న కేసులను నాణ్యతతో పాటు నిర్ణీత గడువులో పూర్తి చేసి బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈసాక్ష్య యాప్ ద్వారా సంఘటన స్థలంలోని డిజిటల్ ఆధారాలను ఎప్పటికప్పుడు నమోదు చేయడంతో పాటు, కేసుల వివరాలను సీసీటీఎన్స్ లో సకాలంలో నమోదు చేసి నవీకరించాలని అధికారులను ఆదేశించారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలపై నిరంతర నిఘా ఉంచి, రాత్రి గస్తీలు, వాహనాల తనిఖీలు, నాకాబందీలను క్రమం తప్పకుండా నిర్వహించాలని సూచించారు. సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని, అనుమానాస్పద కాల్స్, లింకులు, ఓటీపీలు, బ్యాంకు వివరాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు తెలియజేయాలన్నారు. మోసాలకు గురైన వారు వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు లేదా www.cybercrime.gov.inలో ఫిర్యాదు చేయాలని సూచించారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించి, ప్రతి ఫిర్యాదును పారదర్శకంగా నమోదు చేసి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని సిబ్బందికి ఎస్పీ సూచించారు. ప్రజలకు నాణ్యమైన పోలీసు సేవలు అందిస్తూ పోలీస్ శాఖపై విశ్వాసాన్ని మరింత పెంపొందించేలా పనిచేయాలని పేర్కొన్నారు. ఎస్పీ వెంట సీఐలు సైదా, సందీప్ రెడ్డి, ఎస్సై బాలరాజు ఉన్నారు.


# ఉపాధి హామీ కార్మికులను పరామర్శించిన కందుల సంధ్యారాణి.. మజ్జిగ, పండ్ల పంపిణీ



**చట్టం రామగుండం :** జీడి నగర్, కన్నాల గ్రామంలో గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనిచేస్తున్న కార్మికులను బీజేపీ ఓబిసి మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు కందుల సంధ్యారాణి, మాజీ పెద్దపల్లి బీజేపీ జిల్లా అధ్యక్షులు చంద్రుపట్ల సునీల్ రెడ్డి కలిసి పరామర్శించారు. కార్మికుల యోగక్షేమాలను అడిగి తెలుసుకుని, ఎండ తీవ్రత దృష్ట్యా మజ్జిగ, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కందుల సంధ్యారాణి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పేదలు, రైతులు, మహిళలు, కార్మికుల సంక్షేమాన్ని లక్ష్యంగా చేసుకుని పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు కల్పించడంలో గ్రామీణ ఉపాధి హామీ పథకం కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. అలాగే ప్రధాన్ మంత్రి ఆవాస్ యోజన, ఆయుష్మాన్ భారత్, ఉజ్వల యోజన, పీఎం కిసాన్ వంటి పథకాల ద్వారా కోట్లాది మంది ప్రజలు లబ్ధి పొందుతున్నారని తెలిపారు. వేసవి ఎండల నేపథ్యంలో కార్మికులు తగిన జాగ్రత్తలు పాటిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. చంద్రుపట్ల సునీల్ రెడ్డి మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం గ్రామీణాభివృద్ధి, పేదల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. కార్మికుల సంక్షేమం, గ్రామాభివృద్ధి కోసం అనేక కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తోందని పేర్కొన్నారు. గ్రామాభివృద్ధి, దేశాభివృద్ధిలో కార్మికుల పాత్ర ఎంతో కీలకమని, వారి సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొమిరె లక్ష్మణ్, కంకటి శ్రీను, మబ్బు సాయి, భీమనపల్లి రామచందర్, తాటి పాముల పవన్, తువ్వ రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

# పొలాల్లో రైతులకు పొంచి ఉన్న పెనుప్రమాదం

- **పట్టించుకోని విద్యుత్ శాఖ అధికారులు**



**చట్టం రామగుండం :** పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం ఎల్కపల్లి గ్రామ పరిధిలోని వరి పొలాల్లో ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలు శిథిలావస్థకు చేరుకుని ఎప్పుడైనా కూలిపోయే ప్రమాదం నెలకొన్నట్లు గ్రామ సర్పంచ్ ఎరుకల అంజి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎరుకల అంజి మాట్లాడుతూ, గత కొన్నేళ్లుగా పొలాల్లోని విద్యుత్ స్తంభాలు బలహీనంగా మారి వర్షాకాలంలో ప్రమాదకర పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. ఈ సమస్యపై గ్రామ సభలోనూ, నేరుగా విద్యుత్ శాఖ అధికారుల దృష్టికీ పలుమార్లు తీసుకెళ్లినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదని విమర్శించారు. వరి సాగు చేస్తున్న రైతులు ప్రతిరోజూ ఈ విద్యుత్ స్తంభాల సమీపంలో పనులు చేస్తున్నందున, ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనన్న భయాందోళనలో ఉన్నారని పేర్కొన్నారు. భారీ వర్షాలు, బలమైన గాలులు వీచిన సమయంలో ఈ స్తంభాలు కూలిపోతే రైతుల ప్రాణాలకు, పంటలకు తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉందని తెలిపారు. అధికారులు ప్రమాదం జరిగే వరకు వేచి చూడకుండా, ముందస్తు చర్యలు తీసుకుని దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలను వెంటనే మార్చాలని గ్రామ ప్రజలు, రైతుల తరపున డిమాండ్ చేశారు. రైతుల భద్రతను దృష్టిలో ఉంచుకుని అత్యవసరంగా సమస్యను పరిష్కరించాలని కోరారు.

CHATTAM NEWS
చట్టం
సంపూర్ణ స్వతంత్ర వార్తా పత్రిక


# ఉద్యోగ నోటిఫికేషన్లు వేయాలని ఎమ్మెల్యే డా.ఆర్.భూపతి రెడ్డికి వినతి

- **ఎమ్మెల్యేను కలిసిన నిరుద్యోగ అభ్యర్థులు**
- **ఉద్యోగ నోటిఫికేషన్లు వెనువెంటనే విడదల చేయాలని విన్నపం**
- **సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే**

**చట్టం, నిజామాబాద్ ప్రతినిధి :** రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ నోటిఫికేషన్లను వెనువెంటనే విడుదల చేసేలా చొరవ చూపాలని కోరుతూ.. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా.ఆర్.భూపతి రెడ్డిని పలువురు నిరుద్యోగ అభ్యర్థులు విన్నవించారు. ఈ మేరకు గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఉద్యోగ నోటిఫికేషన్లు లేక ఇబ్బందులు పడుతున్నామని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ప్రభుత్వం వెంటనే నోటిఫికేషన్లు విడుదల చేయడంతో పాటు పోస్టుల సంఖ్యను పెంచాలని కోరారు. 20 వేల పోలీస్ డిపార్ట్మెంట్ ఉద్యోగాలకు నోటిఫికేషన్ వెలువడేలా చూడాలని తద్వారా అనేకమంది నిరుద్యోగులకు మేలు జరుగుతుందని చెప్పారు. అదేవిధంగా గ్రూప్స్, డీఎస్సీ తదితర విభాగాల వారీగా ఖాళీలను గుర్తించి నోటిఫికేషన్లు జారీ అయ్యేలా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగుల పట్ల చిత్తశుద్ధితో ఉందని అందుకు నిదర్శనమే ఇప్పటి వరకు దాదాపు 60 వేల ఉద్యోగాలు భర్తీ చేసి నియామక పత్రాలు ఇవ్వడం జరిగిందన్నారు. మరిన్ని ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల అయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. దీంతో అభ్యర్థులు సంతోషం వ్యక్తంచేశారు.



## మద్యం మత్తులో ల్యాబ్ టెక్నీషియన్..? రోగుల ఆగ్రహం



**చట్టం రామాయంపేట :** మెదక్ జిల్లా రామాయంపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న ల్యాబ్ టెక్నీషియన్ మద్యం మత్తులో విధులకు హాజరై నిద్రిస్తున్నాడంటూ రోగులు ఆరోపించారు. ఈ ఘటన గురువారం చోటుచేసుకున్నట్లు సమాచారం. వైద్య పరీక్షల కోసం వచ్చిన రోగులు ల్యాబ్ టెక్నీషియన్ నిద్రలో ఉండడాన్ని గమనించి అసహనం వ్యక్తం చేశారు. కొంతసేపు వేచి చూసినా స్పందన లేకపోవడంతో పలువురు రోగులు అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు తెలిపారు. అనంతరం మేల్కొన్న ల్యాబ్ టెక్నీషియన్, అలసట కారణంగా నిద్రపోయానంటూ చెప్పి రోగులకు పరీక్షలు నిర్వహించినట్లు సమాచారం. ఇదే ఆరోగ్య కేంద్రంలో విధుల నిర్వహణపై గతంలో కూడా పలు ఆరోపణలు వచ్చినట్లు స్థానికులు పేర్కొంటున్నారు. అత్యవసర పరిస్థితుల్లో వైద్య సిబ్బంది అందుబాటులో లేకపోవడం, అటెండర్లతోనే కొన్ని వైద్య సేవలు అందిస్తున్నారనే ఆరోపణలు గతంలో వెలుగుచూశాయని తెలిపారు. అలాగే అత్యవసర మందుల కొరతపై కూడా ప్రజలు పలుమార్లు ఫిర్యాదులు చేసినట్లు వెల్లడించారు. ఆరోగ్య కేంద్రంలో తరచూ ఇలాంటి పరిస్థితులు నెలకొంటున్నాయని, దీనివల్ల అత్యవసర రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత ఉన్నతాధికారులు వెంటనే విచారణ జరిపి, వాస్తవాలను వెలికి తీసి అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## నాళేశ్వర్‌లో ఘనంగా టిఆర్ఎస్ జండా పండుగ




**చట్టం నవీపేట్ :** కల్వకుంట్ల కవిత నూతనంగా ప్రారంభించిన తెలంగాణ రక్షణ సేన ( టిఆర్ఎస్ )పార్టీ జెండాను మండలంలోని నాలేశ్వర్ గ్రామంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర నాయకులు నవీన్ ఆచారి, రామ్ కిషన్ రావు ముఖ్యఅతిథిగా పాల్గొని జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కిషోర్, వరలక్ష్మి, బినోల సొసైటీ చైర్మన్ మగ్గరి హన్మండ్లు, ఆశిష్, కృష్ణ, అవంతి రావు, ప్రవీణ్, లక్ష్మీనారాయణ, జనార్ధన్, విజయలక్ష్మి, కరెప్ప రాజు, శంకర్, శ్రీనివాస్ గౌడ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## హాప్ డైరీ షాప్ ప్రారంభించిన ఆవుల రాజిరెడ్డి



**చట్టం కౌడిపల్లి :** కౌడిపల్లి మండల కేంద్రంలో కుస్తీ రవితేజ నూతనంగా ఏర్పాటు చేసినహాప్ డైరీ షాప్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ ఆవుల రాజిరెడ్డి, కౌడిపల్లి గ్రామ సర్పంచ్ చంద్రం కృష్ణ గౌడ్, హాజరై రిబ్బన్ కట్ చేసి ప్రారంభోత్సవం చేసి నిర్వాహకునికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మీ వ్యాపారం దినదినాభివృద్ధి చెందాలని ఆ భగవంతున్ని కోరుకుంటున్నాము అన్నారు. స్థానిక వ్యాపార అభివృద్ధికి మరియు యువతకు ఉపాధి కల్పించే ఇలాంటి కార్యక్రమాలు మరింత ప్రోత్సాహం పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తలారి హన్మేష్ ముదిరాజ్, తలారి మల్లేష్ ముదిరాజ్, ఆగం రవీందర్ గౌడ్, నరసింహారెడ్డి, వెన్నవరం శ్రీకాంత్ రెడ్డి, కుస్తీ శేకులు, గుత్తి వెంకటస్వామి, ముల్క శ్రీనివాస్, చాకలి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## హాస్టళ్లలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా సీట్లు పెంచాలి: యు.ఎస్.ఎఫ్




**చట్టం – సిద్దిపేట ప్రతినిధి :** జిల్లాలోని బాలికలు, బాలుర హాస్టళ్లలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా సీట్లను తక్షణమే పెంచాలని యు.ఎస్.ఎఫ్ సిద్దిపేట జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు జిల్లా షెడ్యూల్ కులాల శాఖ అధికారి ఇన్‌చార్జ్ సంపత్‌కు గురువారం వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి గుడికందుల రవి మాట్లాడుతూ, డిగ్రీ, ఇంటర్ చదువుల కోసం జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో పేద విద్యార్థులు హాస్టళ్లపై ఆధారపడుతున్నారని తెలిపారు. ప్రస్తుతం ఉన్న హాస్టళ్లలో సీట్లు సరిపోకపోవడంతో అనేక మంది విద్యార్థులు వసతి సమస్యలు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రైవేట్ గదులు అద్దెకు తీసుకునే ఆర్థిక స్థోమత లేక కొందరు విద్యార్థులు చదువులను మధ్యలోనే నిలిపివేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని పేర్కొన్నారు. అవసరమైతే జిల్లాలో అదనపు హాస్టళ్లను ప్రారంభించి విద్యార్థులకు వసతి కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమస్యపై అధికారులు వెంటనే చర్యలు తీసుకుని విద్యార్థులకు న్యాయం చేయాలని, లేనిపక్షంలో యు.ఎస్.ఎఫ్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు మద్దూరి జశ్వంత్, జిల్లా నాయకులు వినయ్, శర్మ తదితరులు పాల్గొన్నారు.

## మాసాయిపేట డాబాలపై ఆకస్మిక తనిఖీలు

- **మద్యం విక్రయిస్తే కేసులు, భారీ జరిమానా**



**చట్టం – మెదక్ ప్రతినిధి :** మెదక్ జిల్లా మాసాయిపేట మండల కేంద్రంలోని జాతీయ రహదారి44 పక్కన ఉన్న డాబాలను చేగుంట ఎస్సై చైతన్య కుమార్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డాబా యజమానులకు పలు సూచనలు చేశారు. డాబాల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ మద్యం విక్రయించరాదని, మద్యం సేవించేందుకు అనుమతించరాదని హెచ్చరించారు. నిబంధనలను ఉల్లంఘిస్తూ మద్యం విక్రయించినా, మద్యం సేవించేందుకు అవకాశం కల్పించినా సంబంధిత నిర్వాహకులపై కేసులు నమోదు చేయడంతో పాటు భారీ జరిమానాలు విధిస్తామని స్పష్టం చేశారు. అదే విధంగా డాబాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా నిర్వహించాలని, బాల కార్మికులను పనిలో పెట్టుకోవద్దని సూచించారు. కార్మిక చట్టాలు, ప్రజారోగ్య నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని డాబా యజమానులకు సూచించారు. తనిఖీల్లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## సర్కారీ బడిలో చిన్నారుల తొలి అడుగు

- **తాండ్రియల్ ఎంపీపీఎస్‌లో ప్రీ-ప్రైమరీకి ఘన శ్రీకారం**




**చట్టం, కథలాపూర్ :** ప్రభుత్వ పాఠశాలల్లో చిన్నారుల విద్యా పునాదిని బలోపేతం చేసే లక్ష్యంతో కథలాపూర్ మండలం తాండ్రియల్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ప్రీప్రైమరీ కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి కె. రాము పాఠశాలను సందర్శించి, చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన వసతులు, వినూత్న బోధనా విధానాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, చిన్నారుల్లో నేర్చుకోవాలనే ఆసక్తిని పెంపొందించేందుకు ఆటపాటలతో కూడిన బోధన ఎంతో అవసరమని తెలిపారు. పాఠశాలలో నిర్వహిస్తున్న రైమ్ టైం, స్టోరీ టైం, ప్రీన్యూమరసీ, ప్రీరైటింగ్ వంటి కార్యక్రమాలు విద్యార్థులను ఆకర్షిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా ప్రతి చిన్నారి ప్రీప్రైమరీలో వేసిన తొలి అడుగు ముద్రలను సేకరించి పాఠశాల రికార్డుల్లో భద్రపరిచారు. తమ పిల్లల తొలి అడుగులను చిరస్మరణీయ జ్ఞాపకాలుగా నిలిపిన ఈ వినూత్న కార్యక్రమంపై తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలలపై సమాజంలో విశ్వాసాన్ని పెంచేలా ప్రధానోపాధ్యాయుడు గుండు విజయ్ కుమార్ తన కుమార్తె గుండు వియను అదే పాఠశాలలో చేర్పించడం విశేషంగా నిలిచింది. ఈ నిర్ణయాన్ని జిల్లా విద్యాశాఖ అధికారి అభినందించి, విజయ్ కుమార్‌ను సన్మానించారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సెక్టోరల్ ఆఫీసర్ సత్యనారాయణ, జిల్లా విద్యా సవరణాధికారి మందా చంద్రశేఖర్ రెడ్డి, కేజీబీవీ ఎస్ఓ నీరజ, ఎస్సీఎక్స్ హెచ్ఎం కిషన్ రావు, సీఆర్పీ ప్రసాద్, ఉపాధ్యాయులు రవి, నరేష్, సత్య, మధు, అనూష, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## 232 మంది విద్యార్థినులకు ఇంజనీరింగ్ పట్టాలు.. కాకతీయ కళాశాలలో స్నాతకోత్సవ వేడుకలు







**చట్టం న్యూస్, నిజామాబాద్, :** కాకతీయ ఇంజనీరింగ్ మహిళా కళాశాలలో 2022-2026 విద్యా సంవత్సరానికి చెందిన ఇంజనీరింగ్ విద్యను పూర్తి చేసిన విద్యార్థినుల కోసం గురువారం శ్రీరామ గార్డెన్స్‌లో స్నాతకోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం. యాదగిరి హాజరై విద్యార్థినులకు ఇంజనీరింగ్ పట్టాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు నేటి పోటీ ప్రపంచంలో అన్ని రంగాల్లో రాణించేలా తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కళాశాల డైరెక్టర్ చెరుకూరి రజనీకాంత్ మాట్లాడుతూ, ఈ విద్యా సంవత్సరంలో కళాశాల నుంచి 232 మంది విద్యార్థినులు ఇంజనీరింగ్ పట్టాలు పొందడం గర్వకారణమన్నారు. అలాగే పలువురు విద్యార్థినులు ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో ఉద్యోగాలు సాధించడం సంస్థకు మరింత ప్రతిష్ఠను తీసుకొచ్చిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులను, వారి తల్లిదండ్రులను అభినందించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. సెల్వ కుమార్ రాజా మాట్లాడుతూ, పట్టాలు పొందిన విద్యార్థినులు ఎక్కడ ఉన్నా కళాశాలకు, తల్లిదండ్రులకు, సమాజానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఎస్టేట్ మేనేజర్ నాగేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ జి. సాయారెడ్డి, వివిధ శాఖల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జాతీయ లోక్ అదాలత్ ద్వారా ప్రజలకు తక్షణ న్యాయం



**చట్టం, నిర్మల్ ప్రతినిధి :** కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగ పరచుకోవాలని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్మల్ జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపీఎస్ విజ్ఞప్తి చేశారు. చాలా మంది ప్రజల న్యాయ సంబంధిత సమస్యలను త్వరితగతిన పరిష్కరించడానికి భారత ప్రభుత్వం నిర్వహిస్తున్న జాతీయ లోక్ అదాలత్ ను కక్షిదారులు సద్వినియోగ పరచుకోవాలని జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపీఎస్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కక్షిదారులు కోర్టు పరిధిలో ఉన్న వివిధ కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకునే అవకాశం ఉందని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు. చాలా మంది ప్రజల న్యాయ సంబంధిత సమస్యలను త్వరితగతిన , తక్కువ ఖర్చుతో పరిష్కరించడానికి భారత ప్రభుత్వం నిర్వహిస్తున్న జాతీయ లోక్ అదాలత్ ను కక్షిదారులు సద్వినియోగపరచుకోవాలని జిల్లా ఎస్పీ తెలపడం జరిగింది.

**ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ...**

ఈనెల 20 న జరిగే..రెండవ జాతీయ లోక్ అదాలత్ ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లాలో నమోదైన డిటెక్టివ్ డిపార్ట్‌మెంట్ (DD) కేసులు ,ఈ పెట్టి కేసులు, చిన్న కేసులు, ట్రాఫిక్ చలానాలు, మైనర్ క్రిమినల్ కేసులు, సివిల్ డిస్ప్యూట్లు వంటి వివాదాలు లోక్ అదాలత్ ద్వారా సులభంగా పరిష్కారం పొందవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, న్యాయ స్థానాల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను తక్కువ సమయంలో ముగించుకోవచ్చన్నారు. అంతే కాకుండా, ఇది ఒక శాంతియుత పరిష్కార విధానం కావున, ఇరు పక్షాలు పరస్పర అంగీకారంతో సమస్యలు పరిష్కరించుకునే అవకాశం ఉందని తెలిపారు. కోర్టు లో గల కేసులలో త్వరగా పరిష్కారం చేసుకుని ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపీఎస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తో పాటు భైంసా ఏఎస్పీ సాయి కిరణ్ ఐపీఎస్, ఇన్స్పెక్టర్లు, ఎస్ఐ లు ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## లయన్స్ ప్రెసిడెంట్ గా లయన్ రఫీ గౌహర్



**చట్టం ఆర్మూర్:** ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని లయన్స్ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ నవనాథపురం సీనియర్ లయన్ మెంబర్ అయినటువంటి లయన్ మొహమ్మద్ రఫీ గౌహర్, ను నూతన ప్రెసిడెంట్ గా గురువారం రోజు జరిగిన జనరల్ బాడీ సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. లయన్ రఫీ గౌహర్, గతంలో ప్రెసిడెంట్ గా, జోన్ చైర్మన్ గా, రీజినల్ చైర్మన్ గా, డిస్టిక్ లో కూడా వివిధ హోదాలను సక్రమంగా బాధ్యతగా నిర్వహించారు. మరోసారి 202627 కు గాను నూతన ప్రెసిడెంట్ గా ఆకాశం కల్పించారు. ఈ సమావేశంలో సెక్రటరీగా లయన్ అంబాల తిరుపతి, ట్రెజరర్ గా లయన్స్ సుధీర్ బాబు, లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు లైన్ రఫీ గోహర్ మాట్లాడుతూ నా సేవలను గుర్తించి మరోసారి అవకాశం ఇచ్చినందుకు అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు.

## జూన్ 20న జాతీయ లోక్ అదాలత్

- **రాజీ కేసుల పరిష్కారానికి సువర్ణ అవకాశం**



**చట్టం సిద్దిపేట ప్రతినిధి :** జూన్ 20న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఎస్. రష్మీ పెరుమాళ్ తెలిపారు. చిన్న చిన్న కంపౌండబుల్ కేసులతో కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయం, డబ్బు వృథా చేసుకోవడం కంటే లోక్ అదాలత్ ద్వారా రాజీ మార్గంలో సమస్యలను పరిష్కరించుకోవడం ఉత్తమమని సూచించారు. ఈ లోక్ అదాలత్‌లో రాజీ పడదగిన కంపౌండబుల్ కేసులు, సివిల్ వివాదాలు, ఆస్తి విభజన కేసులు, కుటుంబ పరమైన వివాదాలు, రోడ్డు ప్రమాద పరిహార కేసులు, డ్రంక్ అండ్ డ్రైవ్, టౌన్ న్యూసెన్స్ కేసులు, చెక్ బౌన్స్ కేసులు తదితర రాజీకి అవకాశం ఉన్న కేసులను పరిష్కరించుకోవచ్చు. ఇలాంటి కేసుల్లో ఉన్న నిందితులు, ఫిర్యాదుదారులు సంబంధిత పోలీస్ స్టేషన్ లేదా న్యాయస్థానాన్ని నేరుగా సంప్రదించి పరస్పర అంగీకారంతో రాజీకి రావచ్చని తెలిపారు. ప్రస్తుతం ప్రతి పోలీస్ స్టేషన్‌లో రాజీకి అవకాశం ఉన్న కేసులను గుర్తించి, ఇరువర్గాలను పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహిస్తూ అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. లోక్ అదాలత్ ద్వారా బాధితులకు త్వరితగతిన న్యాయం లభిస్తుందని, ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## జర్మనీలో యజ్ఞ ప్రచారం ముగించుకుని వచ్చిన వేద పండితుడికి ఘన సన్మానం



**చట్టం నిజామాబాద్, ప్రతినిధి :** యూరప్ ఖండంలోని జర్మనీ దేశంలో నెల రోజుల పాటు పలు నగరాల్లో యజ్ఞ ప్రచార కార్యక్రమాలు నిర్వహించి స్వదేశానికి తిరిగి వచ్చిన ప్రముఖ వేద పండితుడు బైస హరిదాస్ ఆర్య ద్వివేదికి నగరంలో ఘన సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందూరు ఆర్యసమాజం మాజీ గ్రంథాలయ చైర్మన్, అనువంశిక మూలిక వైద్య నిపుణుడు రాసమల్ల గంగాధర్ ఆర్య శాలువాతో సత్కరించి అభినందించారు. అనంతరం గంగాధర్ ఆర్య మాట్లాడుతూ, వైదిక ధర్మ ప్రచారం కోసం విదేశాల్లో యజ్ఞ సంస్కృతిని విస్తృతంగా పరిచయం చేస్తున్న హరిదాస్ ఆర్య ద్వివేది సేవలు ప్రశంసనీయమని పేర్కొన్నారు. సనాతన ధర్మ పరిరక్షణతో పాటు వైదిక సంప్రదాయాల ప్రచారానికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భువనగిరి చిన్నయ్య ఆర్య, బైస రాజలక్ష్మి ఆర్యతో పాటు పలువురు ఆర్యసమాజ సభ్యులు పాల్గొన్నారు.

## కుటుంబ గొడవల కారణంగా ఆత్మహత్య చేసుకున్న పూనగంటి మధుకర్



**చట్టం రామగుండం :** మేదర్ బస్తి గోదావరిఖని కి చెందిన పూనగంటి మధుకర్ కార్పెంటర్ గా పనిచేస్తున్న అతను ఒక భూమి కొనుగోలు విషయంలో భార్య అయిన పొన్నగంటి లావణ్య మరియు ఆమె తమ్ముడు గణేష్ వారితో గత కొద్దిరోజులుగా డబ్బుల విషయంలో ఇంట్లో గొడవ జరుగుతుందని ఫిర్యాది తెలుపుతూ పోనగంటి మధుకర్ సెల్ఫోన్లో సెల్ఫీ వీడియో తీసుకొని వాట్సాప్ స్టేటస్ పెట్టుకున్నాడు. ఇట్టి స్టేటస్ లో భూమికి డబ్బులు కట్టే విషయంలో భార్యతో మరియు భార్య తమ్మునితో గొడవ కారణంగా నేను చనిపోతున్నాను అని స్టేటస్ పెట్టినాడని, తండ్రి పొన్నగంటి నందయ్య తమ్ముడు మాధవాచారి కలిసి ఇంటికి వెళ్లి చూడగా చీరతో ఇంట్లో ఉరి వేసుకొని వేలాడుతూ ఉండగా వెంటనే విడిపించి ప్రభుత్వ ఆస్పత్రికి గోదావరిఖని కి తరలించగా చికిత్స పొందుతూ రాత్రి 12 గంటల 15 నిమిషాలకు చనిపోయినాడు అని డాక్టర్లు నిర్ధారించినారు. పొన్నగంటి నందయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టడం జరుగుతుందని గోదావరిఖని వన్ టౌన్ 2వ ఇన్స్పెక్టర్ సయ్యద్ ఆఫ్జలుద్దీన్ తెలిపారు.

## నాన్యమైన ఎరువులు, విత్తనాలు రైతులకు సబ్సీడిపై అందించాలి




**చట్టం రామగుండం :** ఏ.ఐ.కే.ఎం.ఎస్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు, జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పెద్దపల్లి జిల్లా రామగుండం మండల కార్యాలయం ముందు ధర్నా చేసి తహసీల్దార్ కి రైతాంగ సమస్యలపై వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి కొల్లూరి మల్లేశం మాట్లాడుతూ... ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెల రోజులు అవుతున్న రైతులకు సరైన విత్తనాలు, ఎరువులు సరఫరా చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని, కేంద్ర ప్రభుత్వం ఎన్నికల ముందు స్వామినాధన్ కమిషన్ సిఫారసు "మినిమం సపోర్ట్ ప్రైస్(ఎం.ఎస్.పి)" c2 ప్లస్ 50% ప్రాతిపదికన మద్దతు దర ఇచ్చి రైతులను 2022 కల్లా ధనిక రైతులను చేస్తానని చెప్పిన మాటలు పచ్చి మోసం అని తేలిపోయిందని, రైతులను నట్టేట ముంచే మూడు నల్ల చట్టాలను తీసుకొచ్చి 750 మంది రైతులను బలి గొన్నారని మండిపడ్డారు. ఐదు రాష్ట్రాల ఎన్నికలు అయిపోయిన తర్వాత యుద్ధం పేరు చెప్పి యూరియా, పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ నిత్యవసర వస్తువుల రేట్లు పెంచడం మూలంగా రైతు కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పెంచిన ధరలను వెంటనే తగ్గించాలని, రైతాంగానికి తక్షణమే నాన్యమైన ఎరవులు, విత్తనాలు సబ్సిడిపై అందించాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో ఎ.ఐ.కె.ఎం.ఎస్ రాష్ట్ర నాయకులు మేరుగు చంద్రయ్య, జిల్లా అధ్యక్షుడు గుండేటి మల్లేశం, నాయకులు ఐ రాజేశం, గుండు రాజయ్య, మల్యాల దుర్గయ్య, పెగడపల్లి దుర్గయ్య, ఎడ్ల రవికుమార్, పోగుల శేకర్, శ్రీనివాస్ తదితరలు పాల్గొన్నారు.

## భారీ ఈదురు గాలులకు నష్టపోయిన కుటుంబాలను పరామర్శించిన కార్పొరేటర్



**చట్టం రామగుండం :** జనగామ గ్రామంలో నిన్న రాత్రి వీచిన భారీ ఈదురు గాలులకు ముగ్గురు నిరుపేద కుటుంబాల ఇండ్ల పైకప్పుల రేకులు ఎగిరిపోవడంతో తీవ్ర నష్టం సంభవించింది. జానిమియా నివాసంలోని మూడు గదుల పైకప్పు రేకులు పూర్తిగా లేచి సుమారు 200 మీటర్ల దూరంలో పడిపోయాయి. అలాగే నూకల తిరుపతి ఇంటిలో ఒక గది పైకప్పు రేకులు ఎగిరిపోవడంతో పాటు విరిగిపోయాయి. కొంపెల్లి శ్రీనివాస్ ఇంటిలో కూడా ఒక గది పైకప్పు రేకులు ఎగిరిపోవడంతో నష్టం వాటిల్లింది. ఈ విషయం తెలుసుకున్న స్థానిక 6వ డివిజన్ కార్పొరేటర్ తోకల శ్యామని రమేష్ వెంటనే బాధిత కుటుంబాల ఇండ్లను సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. అనంతరం వీఆర్వో సురేష్‌కు సమాచారం అందించగా, ఆయన సంఘటనా స్థలానికి చేరుకుని జరిగిన నష్టాన్ని నమోదు చేశారు. తదుపరి కార్పొరేటర్ శ్యామని రమేష్ తహసీల్దార్ రవీందర్ రావును కలిసి, ఈదురు గాలుల వల్ల నష్టపోయిన ఈ ముగ్గురు నిరుపేద కుటుంబాలకు ప్రభుత్వం ద్వారా తక్షణ నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ రవీందర్ రావు, బాధిత కుటుంబాలకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## సిద్దిపేటలో రోడ్డు ప్రమాదం.. క్షతగాత్రుడిని సకాలంలో ఆసుపత్రికి తరలించిన ట్రాఫిక్ పోలీసులు



**చట్టం – సిద్దిపేట ప్రతినిధి:** సిద్దిపేట జిల్లా కేంద్రంలోని బ్లాక్ ఆఫీస్ చౌరస్తా వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో చిట్యాల గ్రామానికి చెందిన వడ్ల ప్రకాష్ తీవ్రంగా గాయపడ్డాడు. బైక్‌పై వెళ్తున్న సమయంలో ప్రమాదానికి గురైన అతడిని అక్కడే విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులు వెంటనే గుర్తించి సహాయక చర్యలు చేపట్టారు. ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ సుధాకర్ రెడ్డి, కానిస్టేబుల్ మహేష్ సమయస్ఫూర్తితో స్పందించి, స్థానికుల సహకారంతో క్షతగాత్రుడిని 108 అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సకాలంలో వైద్యం అందేలా చర్యలు తీసుకోవడంతో అతడికి తక్షణ చికిత్స అందింది. ప్రమాద సమయంలో వేగంగా స్పందించి మానవత్వాన్ని చాటుకున్న ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ సుధాకర్ రెడ్డి, కానిస్టేబుల్ మహేష్ సేవలను ఉన్నతాధికారులు, స్థానిక ప్రజలు అభినందించారు. ఆపదలో ఉన్నవారికి వెంటనే అండగా నిలవడంలో పోలీసులు ఎప్పుడూ ముందుంటారనే విషయాన్ని ఈ ఘటన మరోసారి చాటిచెప్పింది.

CHATTAM NEWS
చట్టం
సంపూర్ణ స్వతంత్ర వార్తా పత్రిక

# మిత్రుడి కుటుంబానికి అండగా నిలిచిన 1992–93 టెన్త్ బ్యాచ్.. రూ.20 వేల ఆర్థిక సాయం



**చట్టం శంకరపట్నం :** శంకరపట్నం మండలంలోని కన్నాపూర్ గ్రామానికి చెందిన కాసగోని అంజయ్య గౌడ్ ఇటీవల అకాల మరణం చెందడంతో ఆయన కుటుంబాన్ని ఆదుకునేందుకు 199293 పదో తరగతి బ్యాచ్ స్నేహితులు ముందుకొచ్చారు. గురువారం మృతుడి నివాసానికి చేరుకున్న బ్యాచ్ సభ్యులు కుటుంబ సభ్యులను పరామర్శించి, ధైర్యం చెప్పారు. అనంతరం తమ వంతు సహాయంగా సేకరించిన రూ.20 వేల ఆర్థిక సాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా కష్టకాలంలో మిత్రుడి కుటుంబానికి అండగా నిలవడం తమ బాధ్యతగా భావించి ఈ సహాయం అందించినట్లు బ్యాచ్ సభ్యులు తెలిపారు. మిత్రుడి కుటుంబానికి చేయూతనందించిన 199293 టెన్త్ బ్యాచ్ సభ్యుల మానవత్వాన్ని గ్రామస్తులు అభినందించారు. ఈ కార్యక్రమంలో రాదా, రాజేశ్వరి, సుధాకర్, కోమల్ రెడ్డి, రవీందర్, రామ్ రెడ్డి, తిరుపతి, సదయ్య, సమ్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# చందూర్ జెడ్పీ పాఠశాలలో పాఠ్యపుస్తకాల పంపిణీ

- **ప్రభుత్వ విద్యతోనే విద్యార్థుల భవిష్యత్తు ఉజ్వలం: ప్యాక్స్ చైర్మన్ ప్యారం అశోక్ యాదవ్**



**చట్టం మోస్రా :** నిజామాబాద్ జిల్లా బాన్సువాడ నియోజకవర్గంలోని చందూర్ మండల కేంద్ర ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలలో గురువారం విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్యాక్స్ చైర్మన్ ప్యారం అశోక్ యాదవ్ పాల్గొని విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ప్యారం అశోక్ యాదవ్ మాట్లాడుతూ, ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యమైన ఉచిత విద్యతో పాటు విద్యా సంవత్సరం ప్రారంభంలోనే పాఠ్యపుస్తకాలను అందజేస్తూ విద్యాభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఉన్నత స్థాయికి చేరుకునే అవకాశాలు విస్తృతంగా ఉన్నాయని పేర్కొన్నారు. వేసవి సెలవుల అనంతరం పాఠశాలకు తిరిగి వచ్చిన విద్యార్థులు విద్యపై పూర్తి దృష్టి సారించి, క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. ఉపాధ్యాయులకు, విద్యార్థులకు నూతన విద్యా సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ సురేఖ సాయిలు, గ్రామ కమిటీ అధ్యక్షుడు బొట్టే శంకర్, సొసైటీ డైరెక్టర్ రుక్మిణి రాంరెడ్డి, వార్డు సభ్యులు మామూలు కవిత, చిరంజీవి, చిన్న సాయిలు, వీరసరపు మంజుల, గోపాల్, బ్యాంక్ సాయిలు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పోతురాజు శ్రీనివాస్, వడ్ల గంగాధర్, బాలకృష్ణ గౌడ్, సుదర్శన్ రెడ్డి, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# కాలనీ సమస్యకు తక్షణ పరిష్కారం

**రోడ్డుకు నల్లమట్టి, ఇసుక వేసి ప్రయాణానికి ఊరట**



**చట్టం దోంగ్లి :** కామారెడ్డి జిల్లా దోంగ్లి మండలం సిర్పూర్ గ్రామంలోని 2వ వార్డులో రహదారి పూర్తిగా దెబ్బతిని కాలువలను తలపించేలా మారడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను గ్రామ సర్పంచ్ గజానంద్ పటేల్, రామ్ పటేల్ దృష్టికి తీసుకెళ్లగా వారు వెంటనే స్పందించారు. ప్రజల ఇబ్బందులను గుర్తించి రోడ్డుపై నల్లమట్టి, ఇసుక వేయించి ప్రయాణానికి అనువుగా మార్చారు. దీంతో కాలనీవాసులకు రాకపోకలు సులభతరమయ్యాయి. ఈ సందర్భంగా గజానంద్ పటేల్, రామ్ పటేల్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందించడం, సిర్పూర్ గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. సమస్యను తక్షణమే పరిష్కరించినందుకు కాలనీవాసులు, గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ సర్పంచ్‌తో పాటు గ్రామ నాయకత్వాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ రమేష్, వార్డు సభ్యులు నాగు, గంగన్న, హజ్మద్ సాబ్, మునీర్, హైమద్, రాజాబోయి, గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.

## రాహుల్ గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన మహేష్ కుమార్ గౌడ్



**చట్టం, నిజామాబాద్ ప్రతినిధి :** లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ జన్మదినం సందర్భంగా టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ శుభాకాంక్షలు తెలిపారు. దేశంలో ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ, రాజ్యాంగ స్ఫూర్తి కాపాడటం, సామాజిక న్యాయం సాధన కోసం రాహుల్ గాంధీ నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. యువత, రైతులు, కార్మికులు, మహిళలు, వెనుకబడిన వర్గాల సమస్యలను దేశవ్యాప్తంగా ప్రజల ముందుకు తీసుకెళ్లి వారి గొంతుకగా నిలుస్తున్న నాయకుడిగా కొనియాడారు. భారత్ జోడో యాత్ర, భారత్ జోడో న్యాయ యాత్రల ద్వారా దేశంలో ఐక్యత, సౌభ్రాతృత్వం, రాజ్యాంగ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన పెంపొందించడంలో రాహుల్ గాంధీ పాత్ర కీలకమని అన్నారు. ప్రజల సమస్యలపై నిరంతరం స్పందిస్తూ ప్రజా పక్ష నాయకుడిగా దేశవ్యాప్తంగా విశ్వాసాన్ని సంపాదించుకున్నారని పేర్కొన్నారు. దేశ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా మరింత కాలం ప్రజాసేవలో కొనసాగాలని, ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని మహేష్ కుమార్ గౌడ్ ఆకాంక్షించారు.

# గుర్తుతెలియని వ్యక్తి రైలు నుంచి పడి మృతి

- **బిక్నూర్ రైల్వే ట్రాక్ వద్ద ఘటన, మృతదేహం కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో**

**(చట్టం ప్రతినిధి కామారెడ్డి)** బిక్నూర్ శ్రీ సిద్ధ రామేశ్వర టెంపుల్ సమీపంలోని రైల్వే ట్రాక్ కె.ఎం నంబర్ 529/98 వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఈరోజు ఉదయం 11 గంటల కంటే ముందు ఏదో రైలు నుంచి కింద పడి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.

**గాయాల వివరాలు**

మృతుడికి తలకు బలమైన రక్త గాయమైంది. వీపు, కడుపుపై కంకర రాళ్లు కుచ్చుకోవడంతో చిన్న చిన్న గాయాలు అయ్యాయి. మృతుని వద్ద ఎలాంటి ఐడీ ప్రూఫ్ లభించలేదని రైల్వే పోలీసులు తెలిపారు.

**మృతుని ఆనవాళ్లు**

ఎత్తు: సుమారు 5 అడుగుల 6 అంగుళాలు

వయస్సు: 30 నుంచి 35 సంవత్సరాలు

రంగు: చామన ఛాయ, గడ్డం ఉంది. వెంట్రుకలు, గడ్డం నల్లగా ఉన్నాయి. ముఖం గుండ్రంగా ఉంది

ధరించిన దుస్తులు: బ్లాక్ కలర్ వైట్ చెక్స్ షర్టు. కాలర్‌పై "కుమార్ ప్రీమియం షర్ట్స్, మేడ్ ఇన్ ఇండియా, సైజ్ 40 CM" అని ఉంది. వైట్ కలర్ హాఫ్ హ్యాండ్ బనియన్, బ్లూ కలర్ ఫుల్ డ్రాయర్, బూడిద కలర్ ప్యాంటు, బ్లాక్ కలర్ బెల్ట్

ఇతర గుర్తులు: కుడి చేతికి స్టీల్ కడియం, కుడి చేతిపై లవ్ సింబల్ పచ్చబొట్టు, ఛాతిపై పుట్టుమచ్చ మృతదేహాన్ని కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీ గదిలో ఫ్రీజర్‌లో భద్రపరచినట్లు రైల్వే ఎస్సై సాదు లింబాద్రి తెలిపారు. మృతుని గురించి సమాచారం తెలిసినవారు రైల్వే ఎస్సై కామారెడ్డి లింబాద్రి, సెల్ నంబర్ 87126 58614 కు ఫోన్ చేసి సంప్రదించాలని కోరారు.

# సీజనల్ వ్యాధులు, డెంగ్యూ వ్యాధుల పట్ల అవగాహన సదస్సులు నిర్వహించాలి. డిఎంహెచ్వో



**చట్టం ఆర్మూర్:** ఆర్మూర్ డివిజన్ పరిధిలో గల అన్ని పట్టణ ఆరోగ్య కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, బస్తి దావఖానలలో పని చేస్తున్నటువంటి డాక్టర్స్, హెల్త్ సూపర్వైజర్స్, రిపోర్టింగ్ అధికారులకు అందరికి గురువారం రోజు ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రివ్యూ సమావేశం నిర్వహించిన జిల్లా వైద్యశాఖ అధికారిని డాక్టర్ రాజశ్రీ, ఈ సమావేశంలో భాగంగా వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలని, సీజనల్ వ్యాధులు ముఖ్యంగా డెంగ్యూ వ్యాధుల గురించి అవగాహన సదస్సులు నిర్వహించాలని, గర్భిణీల నమోదు, టీకాలు, చిన్నపిల్లల టీకాలకు ప్రభుత్వ ఆసుపత్రిలో కాన్పులు జరిగేలా తగు చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారినీ డాక్టర్ రాజశ్రీ ఆదేశించారు. ఈ సందర్భంగా ఆమె పలు సూచనలు సలహాలు అందజేశారు. ఈనెల 28న జరగ బోయే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. 28న బూత్ లెవెల్, 29, 30 తేదీలలో ఇంటింటికి తిరిగి పల్స్ పోలియోని ప్రజలు ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిస్టిక్ ఇమ్యునైజేషన్ ఆఫీసర్ డాక్టర్ అశోక్, ఆర్మూర్ డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ రవీందర్, ఆర్మూర్ డివిజన్లో గల డాక్టర్లు, సిహెచ్ఓలు, హెచ్ఈవోలు, హెల్త్ సూపర్వైజర్లు పాల్గొన్నారు.

# మెదక్ అర్బన్ ఫారెస్ట్ పార్కులకు పర్యాటక ప్రాచుర్యం

- **జిల్లా గ్రీన్ యాక్షన్ ప్లాన్‌కు శ్రీకారం**



**చట్టం రామాయంపేట :** ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మెదక్ జిల్లా రామాయంపేట మండలం అక్కన్నపేట గ్రామంలోని వన్ యోజన అటవీ పార్కులో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ పాల్గొని మొక్కలు నాటారు. 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ రత్నాకర్, డీఎఫ్‌వో జోజి, డీఆర్‌డీవో పీడీ శ్రీనివాసరావు, ఆర్అండ్‌బీ ఈఈ వేణు, అటవీ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ జిల్లాలోని అర్బన్ ఫారెస్ట్ పార్కులను పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేసి, వాటి గొప్పతనాన్ని దేశవ్యాప్తంగా ప్రచారం చేసే దిశగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. జిల్లాలో 24 శాతం అటవీ విస్తీర్ణం ఉండటం ప్రత్యేకత అని పేర్కొన్నారు. నర్సాపూర్, వడియారం, పరికిబండ, మనోహరాబాద్ అర్బన్ ఫారెస్ట్ పార్కులను ప్రత్యేకంగా అభివృద్ధి చేసి పర్యాటకులను ఆకర్షించేలా కార్యాచరణ రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. జిల్లా స్థాయిలో ప్రత్యేక గ్రీన్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తున్నామని, పర్యావరణ పరిరక్షణతో పాటు పర్యాటకాభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు అటవీ పార్కులకు ప్రత్యేక పర్యటనలు ఏర్పాటు చేసి అడవుల ప్రాముఖ్యత, జీవ వైవిధ్యం, వృక్ష సంపద సంరక్షణపై అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు.

'ఏక్ పెడ్ మా కే నామ్' కార్యక్రమం ప్రతి ఒక్కరినీ తమ తల్లి పేరుతో ఒక మొక్క నాటి దానిని సంరక్షించేలా ప్రేరేపిస్తోందన్నారు. మానవాళి మనుగడకు మొక్కలే జీవనాధారమని, ప్రతి కుటుంబం కనీసం ఒక మొక్కను నాటి వృక్షంగా పెంచాలని పిలుపునిచ్చారు. ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ రత్నాకర్ మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాల ప్రభావాన్ని తగ్గించడంలో చెట్ల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. విశాఖపట్నంలో సంభవించిన సునామీ సమయంలో చెట్లు అధికంగా ఉన్న ప్రాంతాల్లో నష్టం తక్కువగా నమోదైన విషయాన్ని గుర్తు చేశారు. గ్రామీణాభివృద్ధి శాఖ, అటవీ శాఖ సమన్వయంతో పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలను మరింత విస్తృతంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు, అటవీ శాఖ సిబ్బంది, రెడ్‌క్రాస్ ప్రతినిధులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# యూరియా కోసం క్యూలైన్లు అవసరం లేదు

- **యాప్ ద్వారానే బుకింగ్ చేసుకోవాలి: కలెక్టర్ ప్రతిమా సింగ్**




**చట్టం మెదక్ ప్రతినిధి :** మెదక్ జిల్లాలో యూరియా కొరత లేదని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ స్పష్టం చేశారు. యూరియా పంపిణీని పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారు. రైతులు ఇంటి వద్ద నుంచే యాప్ ద్వారా యూరియాను బుక్ చేసుకుని, కేటాయించిన సమయానికి సమీప డీలర్ వద్దకు వెళ్లి ఎరువును పొందాలని సూచించారు. యూరియా కోసం భారీ క్యూ లైన్లలో నిలబడాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. ప్రస్తుతం జిల్లాలోని ప్రైవేట్ డీలర్లు, మార్క్‌ఫెడ్ గోదాముల్లో కలిపి 6,300 మెట్రిక్ టన్నుల యూరియా బఫర్ స్టాక్ అందుబాటులో ఉందని వెల్లడించారు. ప్రతి మండలంలో రెండు నుంచి మూడు డీలర్ పాయింట్ల వద్ద యూరియా నిల్వ ఉంచినట్లు తెలిపారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని చెప్పారు. రైతు సేవా కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించి, అవసరమైన వ్యవసాయ ఇన్‌పుట్లు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఐకేపీ రైతు సేవా కేంద్రాల్లో విక్రయించే విత్తనాలు, ఎరువులు, పురుగుమందులకు సంబంధించిన లైసెన్సులను దుకాణంలో స్పష్టంగా కనిపించేలా ప్రదర్శించాలని సూచించారు. రైతులు కొనుగోలు చేసే ప్రతి వ్యవసాయ ఇన్‌పుట్‌కు సంబంధించిన పూర్తి సమాచారం అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని చెప్పారు. నకిలీ, నాసిరకం ఉత్పత్తులకు అవకాశం లేకుండా కట్టుదిట్టమైన పర్యవేక్షణ చేపట్టి, ప్రమాణాలకు అనుగుణమైన ఉత్పత్తులనే విక్రయించేలా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. రైతుల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా నాణ్యమైన సేవలు అందించాలని సూచించారు. వ్యవసాయ రంగ అభివృద్ధిలో రైతు సేవా కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని, పారదర్శక సేవలతో రైతుల విశ్వాసాన్ని పెంపొందిస్తూ వ్యవసాయ ఉత్పాదకత పెరుగుదలకు తోడ్పడాలని కలెక్టర్ పేర్కొన్నారు.

# రైతులను పట్టించుకోని కేంద్ర ప్రభుత్వం


- **సన్నవడ్ల కు బోనస్ ఇచ్చిన ఘనత రాష్ట్ర ప్రభుత్వానిదే**
- **రాష్ట్రంలో ఉత్పత్తి అయ్యే ఎరువులను రాష్ట్ర రైతులకే వినియోగించాలి**
- **వచ్చే పంట కాలానికి సన్నవడ్లకు బోనస్ చెల్లిస్తాం**
- **రాష్ట్రంలో ఉత్పత్తి అయ్యే ఎరువులు రాష్ట్రానికే చెందాలి**
- **ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయ రమణా రావు**




**చట్టం పెద్దపల్లి :** హైదరాబాద్ అసెంబ్లీ సీఎల్పీ కార్యాలయం లో గురువారం రోజున ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్ లో తెలంగాణ ప్రభుత్వ విప్ పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు మాట్లాడుతూ... ఇక్కడ ఉత్పత్తి అవుతున్న యూరియా ఎరువులను మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్ తదితర రాష్ట్రాలకు రవాణా చేయడం వల్ల తెలంగాణలో కొరత ఏర్పడే అవకాశం ఉందన్నారు. ఏప్రిల్, మే మాసాలకు సంబంధించిన 47 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా ఇంకా రాష్ట్రానికి రావాల్సి ఉందని చెప్పారు. ఈ విషయంలో కేంద్ర మంత్రులు ఇద్దరు ఏనాడు పట్టించుకోలేదని విజయ రమణారావు తెలిపారు. రైతు గోస పేరిట యాత్రలు చేసిన బిజెపి నేతలకు యూరియా సమకూర్చే ఆలోచన లేదన్నారు. రాష్ట్రంలో ఎనిమిది మంది ఎంపీలు ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నప్పటికీ రైతు సమస్యలను ఏనాడు పట్టించుకున్న పాపాన పోలేదని విమర్శించారు. రైతు గోస ఏమో కాని.. బిజెపి నేతల గోస చూస్తే జాలి వేస్తోందని చెప్పారు. గతంలో కేసీఆర్ సన్నవడ్ల కు ఎన్నడు బోనస్ ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు సన్నవడ్ల కు ఇస్తున్నదని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల 2 వేల కోట్ల బోనస్ రైతులకు చెల్లించడం జరిగిందని చెప్పారు. అలాగే, రైతులకు ఎలాంటి సమస్యలు లేకుండా వడ్ల కొనుగోళ్లు పూర్తి చేసినట్టు చెప్పారు. రాష్ట్రంలో 75 లక్షల మెట్రిక్ టన్నుల వడ్లను సేకరించడం జరిగిందని చెప్పారు. మార్క్ఫెడ్ ద్వారా 15 లక్షల మెట్రిక్ టన్నుల మక్కలను సేకరించినట్టు చెప్పారు. ప్రభుత్వానికి మక్కల కొనుగోలు వల్ల నష్టం వచ్చినప్పటికీ రైతుల కోసం భరించడం జరిగిందన్నారు. సన్నవడ్ల కు మళ్లీ బోనస్ చెల్లించడం జరుగుతుంది అని స్పష్టం చేశారు. వరి పంట వేయవద్దని తమ ప్రభుత్వం ఏనాడు చెప్పలేదని, పంటల మార్పిడి వల్ల భూసారం పెరుగుతుందని అలాగే, పామాయిల్ తోటల పెంపకం లాభసాటి వ్యాపారం అని రైతులను చైతన్యం చేయడం జరిగిందని చెప్పారు. భవిష్యత్తు అవసరాల కోసం పామాయిల్ విత్తనాలను ఇతర దేశాల నుండి దిగుమతి చేసుకోకుండా రాష్ట్రంలోని తోటల పెంపకం చేయాలని మాత్రమే రైతులకు చెప్పడం జరిగిందన్నారు. కేటీఆర్, హరీష్ రావులు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని విమర్శించడమే ధ్యేయంగా పెట్టుకున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించడానికి ఇద్దరు పోటీపడుతున్నారని చెప్పారు.

# బాన్సువాడలో ఇద్దరు ద్విచక్ర వాహనాల దొంగల అరెస్టు

- **చోరీ చేసిన రెండు బైక్‌లు స్వాధీనం చేసుకున్న పోలీసులు**
- **వాటర్ ప్లాంట్ కార్మికులే నిందితులు: సీఐ తుల శ్రీధర్**
- **సిబ్బందిని అభినందించిన సీఐ**



**(చట్టం ప్రతినిధి కామారెడ్డి)** బాన్సువాడ పట్టణం, పరిసర ప్రాంతాలలో ద్విచక్ర వాహనాల దొంగతనాలకు పాల్పడిన ఇద్దరు దొంగలను గురువారం పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ సీఐ తుల శ్రీధర్ తెలిపారు.

**నిందితుల వివరాలు**

అరెస్టయిన నిందితులను బాన్సువాడ మండలం పోచారం గ్రామానికి చెందిన ఎర్రోళ్ల సాయికుమార్ (20), నసురుల్లాబాద్ మండలం కామ్‌షీట్‌పల్లి గ్రామానికి చెందిన ఏనుగు నరసయ్య (19)గా గుర్తించారు. వీరిద్దరూ వేర్వేరు వాటర్ ప్లాంట్‌లలో కార్మికులుగా పనిచేస్తున్నారు.

**ఎలా పట్టుబడ్డారు**

ఈమధ్య కాలంలో బాన్సువాడ పట్టణం, పరిసర ప్రాంతాలలో వరుస ద్విచక్ర వాహనాలు చోరీ కావడంతో సీఐ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం ఏర్పాటు చేశారు. వేర్వేరు ప్రాంతాల్లోని సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తూ దర్యాప్తు కొనసాగించారు. గురువారం ఉదయం బీర్కూర్ చౌరస్తాలో ఎస్సై నవీన్ చంద్ర ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై అనుమానాస్పదంగా కనిపించారు. పోలీసులు ఆపే ప్రయత్నం చేయగా వారు అకస్మాత్తుగా వాహనాన్ని మలుపుతిప్పి తప్పించుకునే యత్నం చేశారు. పోలీసులు వెంబడించి పట్టుకున్నారు.

**నేరం అంగీకారం, వాహనాలు స్వాధీనం**

విచారణలో నిందితులు ఈ మధ్య రెండు ద్విచక్ర వాహనాలు దొంగిలించినట్లు అంగీకరించారు. వీరి వద్ద నుంచి టీఎస్ 16 ఈసీ 7090, టీఎస్ 16 ఈహెచ్ 8724 నంబర్లు గల వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. దొంగలను పట్టుకోవడంలో కీలక పాత్ర పోషించిన ఎస్ఐ నవీన్ చంద్ర, హెడ్ కానిస్టేబుల్ సాయికుమార్, కానిస్టేబుళ్లు పాండురంగ, పృథ్వీరాజ్, సుదర్శన్ రావులను పట్టణ సీఐ తుల శ్రీధర్ అభినందించారు.

# వైస్ చైర్మన్ తీరుపై బిఆర్ఎస్ కౌన్సిలర్ల నిరసన

- **చైర్పర్సన్, కమిషనర్ కు తెలియకుండానే అభివృద్ధి పనులు**
- **స్థానిక బీఆర్ఎస్ వార్డు కౌన్సిలర్ నిరసన**
- **మున్సిపల్ లో ఎవరి పెత్తనం కొనసాగుతోంది**
- **ప్రోటోకాల్ వివాదంపై కలెక్టర్ కు ఫిర్యాదు చేస్తాం**



**చట్టం ఆర్మూర్:** ఆర్మూర్ మున్సిపల్ కార్యాలయంలో పాలకవర్గం తీరుపై స్థానిక ప్రజలు అయోమయంలో ఉన్నారని బిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు పూజ నరేందర్ అభిప్రాయపడ్డారు. ఆర్మూర్ మున్సిపల్ చైర్పర్సన్ గోనెలహరి, కమిషనర్ శ్రీహరి రాజులకు సమాచారం లేకుండా అభివృద్ధి పనులు ఎలా ప్రారంభమయ్యాయనీ ఆయన ప్రశ్నించారు. గురువారం రోజు స్థానిక 17వ వార్డులో వార్డు కౌన్సిలర్ కు తెలియకుండానే అభివృద్ధి పనులకు కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ వైస్ చైర్మన్ కాటిపల్లి వెంకటరెడ్డి, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు కొబ్బరికాయలు కొట్టి పనులు ప్రారంభించడంపై బిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లు అసహనం వ్యక్తం చేస్తూ, మున్సిపల్ కార్యాలయంలో నిరసనకు దిగారు. స్థానిక వార్డు కౌన్సిలర్ కు సమాచారం లేకుండా అభివృద్ధి పనులను ఎలా ప్రారంభించారని వారు చైర్పర్సన్ తో పాటు కమిషనర్ ను నిలదీశారు. వార్డులో ప్రారంభమైన అభివృద్ధి పనులపై తమకు ఎలాంటి సమాచారం లేదని వారు బదులిచ్చారు. దీంతో పార్టీ పట్టణ అధ్యక్షుడు పూజ నరేందర్, మీడియాతో మాట్లాడుతూ అసలు మున్సిపల్ లో ఏం జరుగుతుందో అర్థం కావడం లేదని, రోజు రోజుకి మున్సిపల్ లో ఎవరు చైర్మనో, ఎవరు వైస్ చైర్మనో, ఎవరు కౌన్సిలరో అని తెలియడంలేదని, మున్సిపల్ పరిపాలన ఎవరి చేతుల్లో ఉందో స్థానిక సమస్యలు ఎవరి దృష్టికి తీసుకెళ్లాలో అర్థం కావడం లేదని ఎద్దేవా చేశారు. పేరు ఒకరిది ఊరు మరొకరిది అన్న చందంగా ఒకరు చైర్మన్ అయితే మరొకరు పెత్తనం కొనసాగించడం ఏంటని ఆయన ప్రశ్నించారు. మున్సిపల్ పరిధిలో అభివృద్ధి పనులను ప్రారంభించడం సంతోషకరమేనని కాని ప్రోటోకాల్ ప్రకారం స్థానిక వార్డు కౌన్సిలర్లకు తెలియకుండా వైస్ చైర్మన్ పెత్తనం చెయడమేంటని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం పనుల ప్రారంభోత్సవంలో మున్సిపల్ కమిషనర్ కి కానీ చైర్పర్సన్ కి గానీ తెలవకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. అధికార మదంతో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఏం చేసినా చెల్లుతుందనే ధోరణితో ప్రవర్తిస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక వార్డు కౌన్సిలర్లకు సమాచారం లేకుండా అభివృద్ధి పనులను చేస్తే ఊరుకోమని హెచ్చరించారు. మరోసారి ఇలాంటి ఘటన ఉన్నారావృతం అయితే తీవ్ర పరిణామాలను చవిచూడాల్సి వస్తుందని అన్నారు. స్థానిక వార్డు కౌన్సిలర్ ప్రోటోకాల్ వివాదంపై కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అన్న అక్క మెంటారెషిప్



**చట్టం ఆర్మూర్:** ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం రోజు తెలంగాణా ప్రభుత్వ కమీషనర్ కళాశాల విద్య హైదరాబాద్ వారి ఆదేశాల మేరకు అన్న అక్క మెంటారెషిప్ టీచింగ్ ఇంటర్న్షిప్ ప్రోగ్రామ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ లెర్నింగ్ పై కళాశాల సిబ్బందికి విద్యార్థులకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా కార్యక్రమాన్ని కళాశాల పిన్సిపాల్ డాక్టర్ టి. వేణుగోపాల స్వామి, మాస్టర్ శిక్షకుడు గుండాజీ శృతిన్, కళాశాల నోడల్ ఆఫీసర్స్ డాక్టర్.వజీరాబాను, రమ్యశ్రీ , డాక్టర్.జి.లింగన్న, వైస్. ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత, డాక్టర్ వేణు ప్రసాద్, ఇతర అధ్యాపకులతో కలిపి ప్రారంభించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ ప్రొఫెసర్ గుండాజీ శృతిన్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల విద్యారులను భవిష్యత్తులో సాంకేతిక ప్రపంచానికి అనుకూలంగా సిద్ధం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చారిత్రాత్మకంగా ముందడుగు వేసిందని తెలియజేశారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు, ప్రభుత్వ పాఠశాల పిల్లలకు మార్గదర్శకులుగా మారి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ డిజిటల్ విద్యా బోధనను అందించనున్నారని, సాంకేతిక వినియోగం, సమస్య పరిష్కార నైపుణ్యాలు ఆవిష్కరణలు, భవిష్యత్తు ఉద్యోగాలపై విస్తృత సమాచారాన్ని విద్యారులతో పంచుకొన్నారు.

# బిఆర్ఎస్ విద్యార్థి నాయకుల అరెస్టు



**చట్టం ఆర్మూర్:** రేవంత్ రెడ్డి పాలనలో ఎస్‌బీ, ఇంటెలిజెన్స్ వ్యవస్థల వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోందనీ బిఆర్ఎస్ పార్టీ విద్యార్థి నాయకులు అన్నారు. గురువారం రోజు వారు మాట్లాడుతూ బిఆర్ఎస్వి నుంచి ఈరోజు ఎలాంటి కార్యక్రమం లేదు, పిలుపు లేకపోయినా, ఆర్మూర్ పట్టణానికి చెందిన బిఆర్ఎస్వి నాయకులు మీరా శ్రవణ్ కుమార్, మొహమ్మద్ షాహిద్ అలీ, విద్యార్థి విభాగం ఆర్మూర్ మండల అధ్యక్షులు అగ్గు క్రాంతి, లను పోలీసులు అక్రమంగా ముందస్తు అరెస్ట్ చేయడం తీవ్రంగా ఖండనీయమైన విషయం అన్నారు. ఇదే విధంగా రాష్ట్రవ్యాప్తంగా పలువురు విద్యార్థి నాయకులను కూడా ముందస్తుగా అదుపులోకి తీసుకోవడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధం అన్నారు. విద్యార్థుల సమస్యలపై పోరాడుతూ, వారి హక్కుల కోసం గొంతెత్తుతున్న నాయకులను లక్ష్యంగా చేసుకుని ఇలాంటి చర్యలకు పాల్పడటం వారి వ్యక్తిగత స్వేచ్ఛను హరించడమే కాకుండా ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడమే అన్నారు. ఎలాంటి కారణం లేకుండా విద్యార్థి నాయకులను ఇబ్బందులకు గురిచేయడం, వారి సమయాన్ని వృథా చేయడం పోలీసు శాఖకు అలవాటుగా మారిందన్నారు. ఇకనైనా పోలీసులు తమ వైఖరిని మార్చుకుని, విద్యార్థి నాయకుల పట్ల ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరించాలని, అక్రమ అరెస్టులు, వేధింపులను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేస్తున్నాము అన్నారు.

# నిషేధిత ప్లాస్టిక్‌పై పంజా...ఎల్లారెడ్డిలో పురపాలక గర్జన!

- **మెరుపు దాడుల్లో నిషేధిత ప్లాస్టిక్ వెలికితీత – జరిమానాల మోత**



**చట్టం / ఎల్లారెడ్డి:** పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి ఎల్లారెడ్డి పురపాలక సంఘం నిషేధిత ప్లాస్టిక్‌పై ఉక్కుపాదం మోపింది. చైర్మన్ పద్మ శ్రీకాంత్, కమిషనర్ జగ్జీవన్ ఆదేశాల మేరకు గురువారం పట్టణవ్యాప్తంగా నిర్వహించిన ఆకస్మిక తనిఖీలు వ్యాపార వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. తనిఖీల సందర్భంగా పలుదుకాణాల్లో నిషేధిత ప్లాస్టిక్ కవర్లు, ఇతర ప్లాస్టిక్ వస్తువులు వెలుగులోకి రావడంతో అధికారులు వెంటనే చర్యలు చేపట్టి సంబంధిత దుకాణాలపై మొత్తం రూ. 6,000 జరిమానా విధించామన్నారు.

**'ప్రకృతిని కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత' – పర్వేజ్:**

ఇన్చార్జ్ శానిటరీ ఇన్స్పెక్టర్ పర్వేజ్ స్పష్టం చేస్తూ... ప్లాస్టిక్ వినియోగం పర్యావరణానికి తీవ్ర ముప్పని హెచ్చరించారు. వ్యాపారులు ఇకపై నిషేధిత ప్లాస్టిక్‌ను పూర్తిగా విరమించి, పర్యావరణహిత ప్రత్యామ్నాయాలను అవలంబించాలని సూచించారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి మెరుపు తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని స్పష్టం చేయడంతో నిబంధనలు అతిక్రమించే వారిపై కఠిన చర్యలు తప్పవని సంకేతాలు స్పష్టమవుతున్నాయి. ఈ తనిఖీలలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ ఎం. అంజయ్య, వార్డ్ ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు, పురపాలక సిబ్బంది పాల్గొన్నారు.

CHATTAM NEWS

చట్టం సంపూర్ణ స్వతంత్ర వార్తా పత్రిక

# అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ కోయ హర్ష



**చట్టం, పెద్దపల్లి :** పిల్లల ఓపీలో రద్దీ ఏర్పడకుండా క్యూ విధానంలో సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ కోయ హర్ష అధికారులను ఆదేశించారు. గురువారం పెద్దపల్లి పట్టణంలోని మాతా శిశు ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసి ఆసుపత్రిలోని నోటీస్ బోర్డు, ఓపీ కౌంటర్, ఓపీ నమోదు ప్రక్రియను పరిశీలించారు. చిన్నారుల ఓపీ విభాగంలో రోగులకు ఇబ్బందులు కలగకుండా క్రమబద్ధమైన క్యూ విధానం అమలు చేయాలని సూచించారు. ఆసుపత్రిలో ఇటీవల విధుల్లో చేరిన నూతన వైద్యులను కలుసుకుని అందుబాటులో ఉన్న వైద్య సేవలపై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం బండారికుంట ఎంపీపీ ఎస్ ప్రభుత్వ పాఠశాల, అదే ప్రాంగణంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థుల హాజరు, నమోదు వివరాలను పరిశీలించి, ఒక్క విద్యార్థి కూడా మధ్యలో చదువు మానకుండా ప్రత్యేకంగా ఫాలోఅప్ చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాలు, నాణ్యమైన విద్యపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించి కొత్త ప్రవేశాలు పెంచేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రంలో గుడ్లు, ఇతర పోషకాహార పదార్థాల నాణ్యతను పరిశీలించి, సరుకులు స్వీకరించే దశలోనే నాణ్యత పరీక్షలు నిర్వహించాలని సూచించారు. నిల్వలను ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం నిర్వహించాలని తెలిపారు. ప్రతి చిన్నారి ఎదుగుదలను నిరంతరం పర్యవేక్షించడంతో పాటు గర్భిణుల ఆరోగ్య సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. తనిఖీల్లో డీసీహెచ్ఎస్ డాక్టర్ శ్రీధర్, ఆర్ఎంఓ డాక్టర్ విజయ్, వైద్య సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## పతనమవుతున్న మానవ సంబంధాలు “



**చట్టం :** మనిషి ఒంటరిగా జన్మిస్తాడు సంబంధాల మధ్యలో పెరుగుతాడు అమ్మ ఒడిలో మొదలైన ఆ అనుబంధం, నాన్న చూపులో పెరుగుతుంది నమ్మకం. అక్కా తమ్ముళ్ల నవ్వుల్లో పంచుకున్న బాల్యం, స్నేహితుల మాటల్లో దాగిన సంతోషం. ప్రేమ అనేది మాటల్లో కాదు, మనసుల్లో నాటుకున్న విశ్వాసం. కోపాలు వస్తాయి, అపార్థాలు పెరుగుతాయి, కానీ క్షమించే హృదయం నిలిపే సంబంధం. కాలం మారినా, మనుషులు మారినా, మారకూడని ఒకటుంది——మనసు. సంబంధాలు బలంగా ఉంటే జీవితం అందంగా, లేకపోతే ఖాళీగా మారే ఈ ప్రపంచం. మనవ సంబంధాలు పువ్వుల్లాంటివి, జాగ్రత్తగా చూసుకుంటే పరిమళిస్తాయి. విస్మరించితే వాడిపోతాయి, అయితే ప్రేమతో నింపితే శాశ్వతమవుతాయి. ఇటీవల తెలుగు రాష్ట్రాలలో భార్యల చేతిలో భర్తలు భర్తల చేతిలో భార్యలు దారుణంగా చాపబడుతూ వున్నారు రెండు నెలల క్రితం హన్మకొండ జిల్లా ఐన వ్వోలు మండలం పున్నెల్ గ్రామం లో అజహర్ అనే వ్యక్తి ఆడపిల్లలే పుడుతూ ఉన్నారనే కోపంతో గర్భిణిగా ఉన్న తన బార్యను పదేళ్ల లోపు వయస్సు వున్న ఇద్దరి కూతళ్ళను స్విమ్మింగ్ పూల్ లో ముంచి దారుణంగా హత్య చేశాడు లింగ నిర్ధారణ పరీక్షలు చేయించాకే ఈ ఘటనకు పాల్పడ్డారు రాష్ట్ర వ్యాప్తంగా ఈ ఘటన సంచలనం సృష్టించింది హత్య కేసు మిస్టరీని పోలీసులు ఛేదించి అజహర్ మరియు సహకరించిన వారిని అరెస్టు చేశారు అలాగే కరీంనగర్ జిల్లా కేంద్రం లో ఓ తండ్రి తన ఇద్దరు కవల పిల్లలను బావి లో పడవేసి దారుణంగా చంపారు హైదరాబాద్ లో ఓ కూతురు ప్రియుడి తో కలిసి స్వంత తల్లిని చంపి ఇంటిలో సమాధి చేసింది జహీరాబాద్ లో కార్ లోనే తన భార్యను భర్త గొంతు కోసి హత్య చేశారు ఎక్కువగా అక్రమ సంబంధాలే ఈ హత్యలకు దారితీసుతున్నాయని పోలీస్ శాఖ తెలియచేస్తుంది ఏ పత్రిక తిరగేసిన సామాజిక మాధ్యమాల్లో చూసిన ఇలాంటి ఘటనలే కనిపిస్తున్నాయి మన చిన్నతనంలో ఎవరైనా బంధువులు ఇంటికి వస్తే కనీసం రెండు మూడు రోజులు ఉండేవారు. ప్రత్యేకించి ఏమీ వండేవారు కారు. ఆరుబయట నులక మంచాలు వేసుకుని పడుకోవడం...కబుర్లు చెప్పుకుని పడుకోవడం...మూడు పూటలా అన్నమే తినడం...మూడో రోజు వారు తిరిగి ప్రయాణం అయ్యే సమయానికి వారి చెప్పులు కనిపించేవి కావు. ఇల్లంతా వెతికినా కనిపించవు. అంతలో వాళ్ళు ఎక్కాల్సిన బస్సు వచ్చి వెళ్ళిపోతుంది. అప్పట్లో రోజుకు ఒకటో రెండో బస్సు సర్వీసులు. కొన్ని ఊళ్ళకైతే అవి కూడా ఉండేవి కావు. ఆ బస్సు వెళ్ళగానే చెప్పులు ప్రత్యక్షం అయ్యేవి. బంధువులు మరొక రోజైనా ఉండాలనే కోరికతో ఇంటివాళ్లే చెప్పులనుదాచిపెట్టేవారు .రానురాను మనం ఆధునికత సంతరించుకున్న తరువాత బంధుత్వాల బలం సన్నగిల్లిపోయింది. ఇక గత రెండు మూడు దశాబ్దాలుగా బంధుత్వాలు మొక్కుబడిగా మారిపోయాయి. ఒకే ఊరిలో నగరం లో ఉంటున్నా కూడా ఏడాదికో రెండేళ్లకో ఒకసారి కలుసుకోవడం జరుగుతున్నది.అంతా ఫోన్ కాల్స్,వీడియో కాల్స్ మధ్య ముచ్చట్లు. సాగుతున్నాయి ఉమ్మడి కుటుంబాలు విడిపోయాక అన్నదమ్ములు, అక్కాచెల్లెళ్లలో ఆర్థికంగా బలవంతులైన వారు తమ సొంత కుటుంబంలోని బలహీనులను దూరంగా పెట్టే జాడ్యం ప్రారంభం అయింది. డబ్బున్న బంధువులకు ఒకరకమైన మర్యాదలు, డబ్బులేని బంధువులకు మరొకరకమైన మర్యాదలు జరిపే ఆచారం మొదలైంది. ఒకే ఇంట్లో పుట్టినప్పటికీ, అంతస్తుల మధ్య తేడా పెరిగాక సొంతవాళ్ళం అన్న మమకారం నశించి మనం బంధువులం అని చెప్పుకోవడం మొదలు పెట్టారు. డబ్బులేని బంధువులు మన ఇంటికి వస్తున్నారంటే వారు మనలను అప్పు అడగడానికి వస్తున్నారు అని తప్పుడు అంచనాలు వేసుకుంటున్నారు.ఒక వేళ ఇంటిలో వున్నారా అని ఫోన్ చేస్తే అయ్యో మేము లేము అని సమాధానం.ఇక సొంత అన్నదమ్ములైనా, అక్కాచెల్లెళ్ళే అయినా, ఏవైనా ఫంక్షన్స్ ఉంటె తప్ప కలుసుకోవడం లేదు. మామూలుగా వెళ్లి చూడటం, పలకరించడం అనేది తగ్గిపోయింది. ఆ ఫంక్షన్స్ కు కూడా భోజనాలకు గంట ముందుగా వెళ్లడం, భోజనాలు అయ్యాక వెంటనే "పనులు ఉన్నాయి" అని వంక చెప్పి వెళ్లిపోవడమే చాలా గృహాల్లో చూస్తున్నాము. మనుషుల మధ్య ఆత్మీయత అనేది చాలా అరుదుగా కనిపిస్తున్నది.సంవత్సరానికి కనీసం పన్నెండు సార్లైనా ఒకరినొకరు కలుసుకుని ఒకరి ఇళ్లలో మరొకరు భోజనాలు చేసుకుని కాసేపు కబుర్లు చెప్పుకుని వీలయితే ఆ రాత్రికి అక్కడే ఉండే పద్ధతులు పాటించే కుటుంబాల్లో కాస్తో కూస్తో బంధాలు అనేవి కనిపిస్తున్నాయి. అలా కాకుండా ఏవైనా ప్రత్యేక ఫంక్షన్స్ లో మాత్రమే కలుసుకుని, కేటరింగ్ భోజనాలు చేసేసి వెళ్లిపోయే కుటుంబాల్లో బంధాలు గట్టిగా ఉండవు. వందలమంది అతిధులు హాజరయ్యే వేడుకల్లో ప్రత్యేకించి ఏ ఒక్క దగ్గరి బంధువునో, తోబుట్టువులనో ప్రత్యేకంగా మర్యాద చెయ్యడం, వారితోనే కూర్చుని ముచ్చట్లు చెప్పడం అనేది జరిగే పని కాదు.*అందుకే ఎలాంటి వేడుకలు లేకపోయినా, కనీసం నెలకొక్కసారైనా ఒకరితో ఒకరు కలుసుకుని సాదాసీదా ఆత్మీయ భోజనం చేసి ఆనందంగా వెళ్లిపోవడం బంధాలను బలంగా ఉంచుతాయి. చాలామంది మాకు టైం లేదు అని సాకులు చెబుతుంటారు. ఏడాదికి ఎన్నో ఆదివారాలు,వివిధ పండుగలు వున్నాయి.అయినా ఒకరి కష్టసుఖాలు మరొకరు పంచుకోవడం లేదు.ఒకప్పుడు పెళ్ళిళ్ళు,మిగతా శుభ ,అశుభ కార్యక్రమాల సందర్భంగా సహపంక్తి భోజనాలు చేసేవారు.అరటి ఆకులో అన్నం తినేవారు.ఇప్పుడు ప్లాస్టిక్ ,పేపర్ ప్లేట్స్ అందుబాటు లో వున్నాయి.కడుపారా నవ్వు కునే రోజులు కరువు అయినాయి.నేను బిజీ అనే ఊత పదం అందరి నోట వినిపిస్తూ ఉంటుంది.అక్కా,చెల్లెళ్ళు, అన్న దమ్ముల ,దగ్గరి బంధువుల కలయిక నిత్యం వుండాలనే ఉద్దేశ్యంతో బలగం సినిమా తెరకు ఎక్కింది.ఈ సినిమా ను దాదాపు అందరూ చూసారు గ్రామాల వారీగా రాత్రి వేళ ముఖ్య కూడళ్లలో ప్రొజెక్టర్ ద్వారా ఈ సినిమా చూపించారు .దూరమైన అన్న,దమ్ములు,అక్కా చెల్లెళ్ళు రక్త సంబంధీకులు సినిమా చూసి మనసు కరిగి దగ్గర అవుతూ వున్నారు.బంధాలకు, బంధుత్వాలు కు విలువ ఇవ్వండి.భార్య భర్తల మధ్య సరి అయిన అవగాహన వుండాలి ఒకరినొకరు అర్థం చేసుకుంటే ఆ కుటుంబం సంతోషముగా ఉంటుంది మానవ సంబంధాలు మంట గలిపేలా వుండద్దు ఒకరు ఎదుగుతో వుంటే అభినందించండి వారిని హేళన చేయవద్దు ఎవ్వరిని చిన్న చూపు చూడవద్దు సాటి మనిషిగా ప్రతి ఒక్కరినీ గౌరవించాలి కక్షలు కార్పణ్యాలు పగలు ప్రతీకారాలు వద్దు కుటుంబ సభ్యులు దంపతులు కలిసి మెలిసి ఉండాలి

**కామిడి సతీష్ రెడ్డి జయశంకర్ భూపాలపల్లి జిల్లా 9848445134.**
**తెలంగాణ సామాజిక రచయితల సంఘం రాష్ట్ర అధ్య క్షులు**

## రైతులు ఎవరు ఆత్మహత్య చేసుకోవద్దు




**ఆదిలాబాద్, చట్టం:** రైతు నిర్లక్ష్యం వల్ల రైతు మరణించడం జరిగింది కాని దానికి ప్రభుత్వానికి ఎంటువంటి సంబంధం లేదు,జొన్న కొనుగోలు కేంద్రలో రైతు యొక్క జొన్నలు కాటా మరియు లాట్ నెంబర్ రసీదు రైతుకు ఇవ్వడం జరిగింది కానీ అతను జొన్న కొనుగోలు కేంద్రానికి రాలేదు కేంద్రం అధికారులు ఆయనకు సమాచారం ఇచ్చిన రాలేకపోయాడు అయినా అతని జొన్నలు గోదాంకు పంపడానికి సిద్ధంగా ఉండే కానీ ఆ రైతుకు ఏ సమస్యను ఉండే కావచ్చు కానీ అతను ఆ యొక్క జొన్నలు కోసం ఆత్మహత్య పై దానికి విచారణ నిమిత్తం అధికారులు విచారణ కొనసాగిస్తున్నారు మార్కెట్లో ఎంత జొన్న వచ్చిన రైతుల గింజ కూడా ఇంటికి పోకుండా వర్షానికి నానిపోయిన మార్కెట్ సెంటర్ వాళ్ళు కొనుగోలు చేసి గోదాములకు తరలించినారు కానీ ఇలా ఈ విధంగా రైతు తన నిర్లక్ష్యం వల్ల చనిపోవడం చాలా బాధాకరం దానికి మేమందరం కూడా విచారం వ్యక్తం చేస్తున్నాము ఏ రైతు కూడా ఇలా ఆత్మహత్యలు పాల్పడకూడదు అని తెలియజేస్తున్నాము కానీ దానిని రాజకీయం చేయాలని చూస్తున్నారు. ప్రభుత్వంపై నిందలు వేయకూడదు అని దానిని రాజకీయం చేయడం భారస పార్టీ కి తగదు అసలు వాస్తవం తెలుసుకోవాలి BRS వాళ్లకు ఇతువు పలుకుతున్నాం. రాజకీయం చేసేటప్పుడు చేస్తామని తెలియజేస్తున్నాం ఆ యొక్క రైతు కు సంబంధించిన వారి కుటుంబానికి పార్టీ పరంగా ప్రభుత్వపరంగా సహాయ సహకారాలు అందించడం జరుగుతుంది మరియు మా వంతు కూడా కృషి చేయడం జరుగుతుంది మా కాంగ్రెస్ ప్రభుత్వం పార్టీ ఎల్లప్పుడు రైతుల ప్రక్షాళన పేద ప్రజల పక్షాన ఉండే పార్టీ కాబట్టి భారస వాళ్ళకు ఒకటే చెబుతున్నాం నీతిమాలిన రాజకీయాలు చేయవద్దని కరకండిగా చెబుతున్నాం. అని తెలియజేస్తున్నాం సిరికొండ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కంచం లక్ష్మన్, జిల్లా కాంగ్రెస్ సెక్రటరీ షేక్ ఇమామ్, సర్పంచ్ ల సంఘము అధ్యక్షులు, సర్పంచ్ బొడ్డు దత్తాత్రి, మాజి జడ్పీటీసీ చంద్రకళ రఘరామ్, కన్నాపూర్ సర్పంచ్ బాలాదేవి చంద్రకాంత్, ఉప సర్పంచ్ తోకల రాజు రాయి సీడం భీమ్రావు చిక్రం పరమేశ్వర్ మైనారిటీ చైర్మన్ ఎండి రంజాన్ కాంగ్రెస్ నాయకులు జల భూమన్న ఎల్లయ్య రషీద్ తిరుపతి చిన్న లక్ష్మన్న తదితర నాయకులు పాల్గొన్నారు.

## చోరీ కేసులో ఒకరిని రిమాండ్ చేసిన పోలీసులు

**నిజామాబాద్ , చట్టం:** నిజాంబాద్ పట్టణంలోని శాంతినగర్ ప్రాంతంలో ఇటీవల జరిగిన చోరీ కేసును పోలీసులు చేదించి నేరస్థుడిని అరెస్టు చేశారు అరెస్టు అయిన నేరస్తుడు రియాజ్ ఖాన్ 33 అఫ్జల్ ఖాన్ కుమారుడు శాంతినగర్ నివాసిగా పోలీసులు గుర్తించారు పోలీసుల కథనం ప్రకారం జల్సాలకు అలవాటు పడిన రియాజ్ కాను డబ్బుల కోసంp డబ్బుల కొరతతో ఏర్పడడంతో దొంగతనాలకు పాల్పడాలని నిర్ణయించుకున్నాడు ఈ క్రమంలో జూన్ 176 అర్ధరాత్రి సుమారు రెండు గంటల సమయంలో శాంతినగర్కు చెందిన అజ్మీర్ బేగం ఇంటిలోకి చేరబడి బీరువాలు పగలగొట్టి అందులో ఉన్న ఒక లక్ష ఇరవై వేల రూపాయల నగదును ఆ 6 గ్రాముల బంగారు చిలకమ్మలు ఇరవై తులాల వెండి పట్ట గొలుచులను అపహరించినట్లు పోలీసులు తెలిపారు గురువారం కిల్లా చౌరస్తా వద్ద అనుమాన స్పదంగా సంచరిస్తున్న నేరస్థుడిని పోలీస్ అదుపులోకి తీసుకొని విచారించగా నేరాన్ని ఒప్పుకున్నాడు అతని వద్ద నుంచి ఒక లక్ష పదివేలు నగదు చోరీకి ఉపయోగించిన ఒక ఇనుప సుత్తిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు నిందితుని రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరిచినట్లు పోలీసులు వెల్లడించారు

## ఇందిరమ్మ ఇండ్లు పేదవారి ఆత్మగౌరవానికి ప్రతీక



**చట్టం వెల్దుర్తి:** వెల్దుర్తి మండల పరిధిలోని నెల్లూరు, బస్వాపూర్, గ్రామాలలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇల్లు పథకం ద్వారా మంజూరైన ఇండ్ల నిర్మాణం పూర్తి అవ్వడంతో గృహప్రవేశ కార్యక్రమం నిర్వహించారు. లబ్ధిదారుల ఆహ్వానం మేరకు నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ ఆవుల రాజిరెడ్డి, మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు హనుమన్నగారి నరేందర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ. సుధాకర్ గౌడ్, తలారి మల్లేష్ ముదిరాజ్, హాజరై లబ్ధిదారులతో కలిసి రిబ్బన్ కట్ చేసి గృహప్రవేశ ప్రారంభోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాజిరెడ్డి మాట్లాడుతూ పేద ప్రజలకు ఎన్నికలలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుంది. గత బిఆర్ఎస్ ప్రభుత్వ పది సంవత్సరాల కాలంలో ఏ ఒక్క నిరుపేద సొంత ఇంటి నిర్మాణానికి నోచుకోలేరు కానీ మా ప్రభుత్వం అలా కాకుండా నిజమైన లబ్ధిదారులను గుర్తించి ఇందిరమ్మ ఇల్లు పథకం ద్వారా గృహ నిర్మాణానికి 5 లక్షల రూపాయలు మంజూరు చేయడంతో గ్రామీణ, పట్టణ, ప్రాంతాల్లో సొంతింటి నిర్మాణం కోసం ఏళ్ల తరబడి ఎదురుచూసిన పేద కుటుంబాల కలను నిజం చేశాము. పేద ప్రజలకు ఈ ఇండ్లు శాశ్వత నివాసాలుగా మారి వారి కుటుంబాలకు భద్రత కల్పిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు గ్రామ సర్పంచ్ రంగారెడ్డి వెల్దుర్తి మండల మాజీ అధ్యక్షులు నరసింహారెడ్డి, జిల్లా కార్యదర్శి నంబూద్రి గుప్తా, సీనియర్ నాయకులు. తలారి హన్మేష్ ముదిరాజ్, పోతిరెడ్డి, శేఖగౌడ్, దుర్గ గౌడ్, లక్ష్మీనారాయణ, నిరంజన్ రెడ్డి , అంజిరెడ్డి, బొడ్డు సింహం, సర్పంచులు శివలింగం, బంజరవి, ఉప సర్పంచ్లు నవీన్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## జాతీయ నూనె గింజల మిషన్ ద్వారా రాయితీపై సోయా విత్తనాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే




- **నకిలీ విత్తనాలు అమ్మే వ్యాపారులపై కఠిన చర్యలు**

**చట్టం బిచ్కుంద ;** కామారెడ్డి జిల్లా బిచ్కుంద మండలం పరిధిలోని మార్కెట్ కమిటీ ప్రాంగణంలో జాతీయ నూనె గింజల మిషన్ పథకంలో భాగంగా జుక్కల్ శాసనసభ్యులు లక్ష్మీకాంతరావు రాయితీపై సోయాబీన్ విత్తనాలు పంపిణీ చేశారు అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నకిలీ విత్తనాలు నాసిరకం ఎరువులు అమ్మే వ్యాపారులపై కఠిన చర్యలు ఉంటాయని, అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఎమ్మెల్యే ఆదేశించారు, రైతు ప్రాణం అమూల్యం కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమానికి కట్టుబడి ఉంది అని స్పష్టం చేశారు. నూనె గింజల పంటలకు ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వం చేపట్టిన జాతీయ నూనె గింజల మిషన్ పథకంలో భాగంగా రాయితీపై సోయాబీన్ విత్తనాలను మండలంలోని రైతు ఉత్పత్తిదారుల సంఘం రైతులకు కేటాయించడం జరిగింది. ఈ రాయితీ విత్తనాలను ఎమ్మెల్యే బిచ్కుంద రైతు ఉత్పత్తిదారుల సంఘం రైతులకు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా వ్యవసాయ అధికారి శ్రీ మోహన్ రెడ్డి , బిచ్కుంద మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శంకర్ , సహాయ వ్యవసాయ సంచాలకులు అమర్ ప్రసాద్, బిచ్కుంద రైతు ఉత్పత్తిదారుల సంఘం చైర్మన్ శంకర్ , బిచ్కుంద మున్సిపాలిటీ కౌన్సిలర్లు, నాయకులు విట్టల్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, వ్యవసాయ శాఖ అధికారులు మరియు రైతులు పాల్గొన్నారు.

## పారదర్శకంగా కానిస్టేబుళ్ల బదిలీలు

- **పారదర్శక బదిలీలతో పోలీసు సిబ్బందికి భరోసా**
- **సీనియారిటీకి ప్రాధాన్యమిస్తూ బదిలీలు**
- **కౌన్సిలింగ్ ద్వారా 80 మంది కానిస్టేబుళ్లకు పోస్టింగ్‌లు**
- **పారదర్శక బదిలీలే సమర్థవంతమైన పోలీసింగ్‌కు పునాది**
- **మెదక్ జిల్లా ఎస్పీ డి .వి. శ్రీనివాసరావు, ఐపీఎస్**





**చట్టం మెదక్ ప్రతినిధి :** మెదక్ జిల్లా పోలీసు శాఖలో కానిస్టేబుళ్ల బదిలీలను పూర్తిగా పారదర్శకంగా నిర్వహించారు. నాలుగేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న 80 మంది కానిస్టేబుళ్లకు జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్ ఆధ్వర్యంలో గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో కౌన్సిలింగ్ నిర్వహించి పోస్టింగ్‌లు కేటాయించారు. ప్రతి కానిస్టేబుల్‌తో ఎస్పీ వ్యక్తిగతంగా మాట్లాడి వారి విల్లింగ్ స్టేషన్లు, జీవిత భాగస్వామి ఉద్యోగ స్థానం (స్పౌస్), సీనియారిటీ, ఆరోగ్య పరిస్థితులు, సర్వీస్ రికార్డు, పిల్లల విద్య వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని పారదర్శకంగా బదిలీల ప్రక్రియను పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, పారదర్శకమైన బదిలీల విధానం సిబ్బందిలో విశ్వాసాన్ని పెంపొందించడమే కాకుండా బాధ్యతాయుతమైన విధుల నిర్వహణకు బలమైన పునాదిగా నిలుస్తుందన్నారు. ప్రతి పోలీసు సిబ్బంది క్రమశిక్షణ, నిబద్ధత, నిజాయితీతో విధులు నిర్వహిస్తూ ప్రజల్లో పోలీసు శాఖపై విశ్వాసాన్ని మరింత బలోపేతం చేయాలని సూచించారు. పోలీసు అధికారిగా నైతిక విలువలు, సేవాభావం అత్యంత ముఖ్యమని పేర్కొన్న ఎస్పీ, విధుల్లో నైపుణ్యాన్ని పెంపొందించుకుని ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని దిశానిర్దేశం చేశారు. కొత్తగా పోస్టింగ్‌లు పొందిన కానిస్టేబుళ్లు తమ పోలీస్ స్టేషన్ పరిధిలో అంకితభావంతో విధులు నిర్వహించి జిల్లా పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ ఐపీఎస్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ రెడ్డి, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ సందీప్ రెడ్డి, సూపరింటెండెంట్ వల్య నాయక్ తదితరులు పాల్గొన్నారు.


## జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



**చట్టం, నిర్మల్ ప్రతినిధి :** బాసరలో జరగనున్న గోదావరి పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. గురువారం బాసర పుష్కరాల ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులతో ఆయన కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... వచ్చే సంవత్సరంలో నిర్వహించే గోదావరి పుష్కరాలకు వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని అన్ని ఏర్పాట్లను ముందస్తుగా పూర్తి చేయాలని సూచించారు. ముఖ్యంగా పాత పుష్కర ఘాట్లకు అవసరమైన మరమ్మతులు చేపట్టడంతో పాటు, అవసరమైన చోట కొత్త ఘాట్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పుష్కర ఘాట్లను భక్తులకు కనువిందుగా ఉండేలా సుందరీకరించాలని, కళ్యాణ కట్ట, పిండ ప్రదాన వేదికలు, దుస్తులు మార్చుకునే గదులను తక్షణమే నిర్మించాలని సూచించారు. చేపట్టే ప్రతి నిర్మాణ పనిలో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని, ఘాట్ల సమీపంలో భక్తులకు తాగునీటి కొరత లేకుండా తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అలాగే, ఆయా శాఖల అధికారులు తమకు కేటాయించిన పనులకు సంబంధించిన పూర్తి స్థాయి ప్రతిపాదనలను వెంటనే సిద్ధం చేసి సమర్పించాలని సూచించారు. ఈ సందర్భంగా బాసర ఆలయ మాస్టర్ ప్లాన్‌పై కూడా చర్చించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, బాసర ఆలయ ఈవో అంజనా దేవి, ఆర్డబ్ల్యూఎస్ ఈఈ సందీప్, వివిధ శాఖల ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మునుగోడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 5 సీసీ కెమెరాలు ఏర్పాటు

- **సీసీ కెమెరాలు ప్రారంభించిన సర్పంచ్,అధికారులు,పోలీస్ శాఖ**



**మునుగోడు, చట్టం:** మునుగోడు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠశాల నిరంతర పర్యవేక్షణ మరియు విద్యార్థుల సౌకర్యార్థం 2001 2002 పూర్వ విద్యార్థులు అత్యంత ప్రతిష్టాత్మకంగా 5 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి గురువారం ప్రారంభించారు.హెడ్మాస్టర్ బాల ప్రసాద్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపిడిఓ విజయభాస్కర్,సర్పంచ్ పాలకూరి రమాదేవి నరసింహ గౌడ్, ఎంఈవో మల్లేశం, ఏఎస్సై హబివుద్దీన్,గ్రామ పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ రెడ్డి లతో కలిసి 2001 02 పూర్వ విద్యార్థులు,పెరుమాళ్ళ ప్రమోద్ కుమార్, బొల్లు సైదులు ప్రారంభించారు.ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసుల సెక్యూరిటీ అన్నారు. చదువుకున్న పాఠశాలలో పాఠశాల అభివృద్ధికై మేమున్నామంటూ 2001 ,2002 సంవత్సరం పూర్వ విద్యార్థులు ముందుకు రావడం, పాఠశాల సౌకర్యార్థం సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం అభినదనీయం అన్నారు. ఈ పూర్వ విద్యార్థులు పాఠశాలకు అభివృద్ధికి పునాదిగా అయ్యి పలువురు ఆదర్శంగా తీసుకోవాలని కోరారు..పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ మన ఊరు మనబడి మనం చదువుకున్న పాఠశాలకు ఎంతో కొంత అభివృద్ధి చేయాలన్న సంకల్పంతోనే మేము ముందడుగు వేశామన్నారు. పాఠశాల అభివృద్ధికి మేము మా వంతు సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు..ఈ సందర్భంగా 2001 02 సంవత్సర పూర్వ విద్యార్థులను అధికారులు, ప్రజాప్రతినిధులు అభినందించారు..ఉపాధ్యాయులు కునూరెడ్డి సత్తిరెడ్డి, రత్నయ్య, అన్నపురెడ్డి,మహిళ ఉపాధ్యాయులు,పూర్వ విద్యార్థులు పెరుమాళ్ళ ప్రమోద్ కుమార్, బొల్లు సైదులు,భవిత పాఠశాల చైర్మన్ పందుల ఎల్లమ్మ,గాలి సైదులు,అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు పెరుమాళ్ళ ప్రణయ్ కుమార్,పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పోలీస్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## నర్సింహులపేటలో భారీగా పీడీఎస్ బియ్యం పట్టివేత

- **అక్రమంగా తరలిస్తున్న 75 బస్తాల పీడీఎస్ బియ్యం స్వాధీనం**
- **డీసీఎం వాహనం సీజ్.. ఇద్దరు నిందితుల అరెస్ట్**



**నర్సింహులపేట, చట్టం:** మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలంలో అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ (రేషన్) బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. డీసీఎం వాహనంలో రహస్యంగా తరలిస్తున్న 75 బస్తాల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఒక్కో బస్తా 50 కిలోల చొప్పున మొత్తం సుమారు 3,750 కిలోల బియ్యం ఉన్నట్లు అధికారులు తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు వాహనాన్ని తనిఖీ చేయగా, ప్రభుత్వ పంపిణీ కోసం ఉద్దేశించిన పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించారు. వెంటనే బియ్యంతో పాటు డీసీఎం వాహనాన్ని సీజ్ చేసి, ఈ వ్యవహారంలో ప్రమేయం ఉన్న నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా పేదలకు అందించాల్సిన బియ్యాన్ని అక్రమంగా తరలించడం చట్టవిరుద్ధమని, ఇటువంటి కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. నిందితులపై సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు. జిల్లాలో పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక నిఘా కొనసాగుతోందని, ప్రజలు కూడా అనుమానాస్పద కార్యకలాపాలపై సమాచారాన్ని అందించాలని అధికారులు కోరారు.

## నాళేశ్వర్ గ్రామంలో ఘనంగా టిఆర్ఎస్ జండా పండుగ కార్యక్రమం

**ఆర్మూర్,చట్టం:** నిజామాబాద్ జిల్లా బోధన్ నియోజకవర్గం నవీపేట్ మండలం నాళేశ్వర్ గ్రామంలో గురువారం కల్వకుంట్ల కవిత నూతనంగా ప్రారంభించిన తెలంగాణ రక్షణ సేన టిఆర్ఎస్ పార్టీ యొక్క జెండా పండుగ కార్యక్రమాన్ని నాళేశ్వర్ గ్రామంలో ఘనంగా నిర్వహించారు. కల్వకుంట్ల కవిత నూతనంగా ఏర్పాటు చేసిన టిఆర్ఎస్ పార్టీ యొక్క లక్ష్యాలను సిద్ధాంతాలను ప్రజలకు చేరవేసే దిశగా ఈ జెండా పండుగ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా సొసైటీ చైర్మన్( కవితక్క అభిమాని) మగ్గారి హన్మండ్లు మాట్లాడుతూ సామాజిక తెలంగాణే లక్ష్యంగా తెలంగాణకు రక్షణగా ఈ తెలంగాణ రక్షణ సేనగా పార్టీ పని చేస్తున్నదని తెలంగాణ ప్రజలకు అండగా ఈ టిఆర్ఎస్ ఫార్టి ఉంటాదనని ప్రజలకు భరోసాను కల్పిస్తూ ఈ జెండా పండుగ నిర్వహించడం జరుగుతున్నదన్నారు. అనంతరం మహిళలు నృత్యాలు కవితక్క జిందాబాద్ అంటూ నినాదించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు నవీనాచారి రామ్ కిషన్ రావు,కిషోర్,వరలక్ష్మి, ,ఆశిష్,కృష్ణ అవంతి రావు,ప్రవీణ్,లక్ష్మినారాయణ,జనార్ధన్,విజయలక్ష్మి,కరిపె రాజు,శంకర్, శ్రీనివాస్ గౌడ్,మహేష్ , గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by SIRIGADA PRASAD and Printed at INDUR OFFSET PRINTERS, Opposite Cheer Hanuman Temple, Weekly Bazar, Nizamabad District,Telangana 503001.,
and Published at: H.No. 3-3-486/2, Gayathrinagar, Varni road, Nizamabad District, Telangana - 503001.,Editor: SIRIGADA PRASAD. RNI.No. TELTEL/2010/32350. Cell ;9948884497. prasadsirigada27@gmail.com